www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 18-1-2025

Ongole | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Nallagonda | Nizamabad and Bengaluru | ఒంగోలు సిటీ

గ్రామ సర్వేయర్లపై పని ఒత్తిడి

- మూడుశాఖల మధ్య నలిగిపోతున్న వైనం
- ఏ శాఖ పనులు ముందు చేయాలో తెలియక గందరగోళం
- సమస్య పరిష్కారం కోసం చొరవచూపని అధికారులు

3





డ్వామా పూర్వ పీడీ శీనారెడ్డిని విచారిస్తున్న త్రిసభ్య బృందం (ఫైల్)

శీనారెడ్డి ఇష్టారాజ్యం

త్రిసభ్య కమిటీ విచారణలో వెలుగులోకి అక్రమాలు

డ్వామా పీడీగా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో పెద్ద ఎత్తున అవకతవకలు, అక్రమాలు జరిగాయి. ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ తన స్వప్రయోజనం, ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా నాలుగున్నరేళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. తనకు నమ్మకస్తులైన ఉద్యోగులను కేంద్రంగా చేసుకొని జిల్లా కార్యాలయంలో సాగించిన ఆయన అక్రమాలలో పలువురు సిబ్బంది కూడా భాగస్వామ్యులయ్యారు. శీనారెడ్డి పీడీగా ఉన్న కాలంలో జరిగిన వ్యవహారాలపై విచారణ చేపట్టిన కమిటీ విచారణలో అనేక అక్రమాలు, అవినీతి, అవకతవకలను గుర్తించింది. ప్రధాన అంశాల వారీగా కమిటీ సభ్యులు ఇటీవల తమ నివేదికను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేయగా శీనారెడ్డితో పాటు అక్రమాలకు బాధ్యులపై చర్యలుకోసం సదరు నివేదికను కలెక్టర్ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

కలెక్టర్‌కు నివేదిక అందజేత

విచారణ బృందం దాదాపు పది రోజులకుపైగా డ్వామా కార్యాలయంలో ప్రత్యక్షంగా ఫైళ్లు పరిశీలించింది. ఫిర్యాదుదారులను, ఉద్యోగులను విచారించింది. వారు ఇతర సమయాల్లో తమ వద్ద ఉన్న ఫిర్యాదులు, ఉద్యోగులు ఇచ్చిన వివరణలు, రికార్డులను పరిశీలించింది. వీటన్నింటిపై సంక్రాంతికి ముందే తమ నివేదికను కలెక్టర్ అన్సారియాకు బృందం అందించింది. వాటిని కలెక్టర్ నిశిత పరిశీలన చేస్తున్నారు.

ఒంగోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో నాటి ప్రజాప్రతినిధులు, కీలక నేతల కన్నా మిన్నగా జిల్లానీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ శీనారెడ్డి వ్యవహరించాడన్న ఆరోపణలు అప్పట్లోనే వచ్చాయి. ఇతర పలు శాఖల వ్యవహారాల్లో నాటి అధికారపార్టీ కీలక నేత అండతో జోక్యం చేసుకోవడమే కాక డ్వామాలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి వైసీపీ నేతలకు లాభం చేకూర్చారన్న ప్రచారం ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాలను పట్టించుకోకుండా సిబ్బంది నియామకాలు, బదిలీలు, సామాజిక తనిఖీలను చేశారు. నచ్చని ఉద్యోగులను వేధించడంతోపాటు నచ్చిన వారిని వెనుకేసుకొచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక శీనారెడ్డి అవినీతి, అక్రమాలు, అవకతవకలు, ప్రజాధనం దుర్వినియోగం నిబంధనలకు విరుద్ధంగా ఆయన సాగించిన వ్యవహారాలపై విచారణ కోరుతూ పలువురు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో శీనారెడ్డి వ్యవహారంపై విచారణ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి శివనారాయణరెడ్డి, సెప్ సీఈవో శ్రీమన్నారాయణతో కూడిన త్రిసభ్య కమిటీని కలెక్టర్ తమీమ్ అన్సారియా నియమించారు. సదరు కమిటీ దాదాపు నెలన్నర రోజులపాటు డ్వామా కార్యాలయం కేంద్రంగా విచారణ సాగించింది. 70 వరకు ఫిర్యాదులు అందగా వాటిలో ఇంచుమించు 25 నుంచి 30 వరకు ఫిర్యాదులలో అందరూ ఉన్నట్లు గుర్తించిన త్రిసభ్య కమిటీ అధికారులు వాటి మీద ప్రధాన దృష్టి సారించారు.

అంతా దాటవేత ధోరణే

అందుబాటులో ఉన్న ఫైళ్లను పరిశీలించిన అనంతరం శీనారెడ్డితోపాటు

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు
- స్వప్రయోజనాలు, అక్రమార్జనే లక్ష్యంగా పాలన
- కొందరు ఉద్యోగుల భాగస్వామ్యం
- కలెక్టర్ పరిశీలనలో నివేదిక
- చర్యలపై డ్వామా సిబ్బందిలో ఆందోళన

ఫిర్యాదులో భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలు ఉన్న ఉద్యోగులు, ఆయా విభాగాల సిబ్బంది అలాగే ఫిర్యాదుదారులను వ్యక్తిగతంగా విచారించారు. ఈక్రమంలో శీనారెడ్డికి లిఖిత పూర్వకంగా రెండుసార్లు నోటీసులు ఇచ్చి ఆయన కోరిన గడువును కూడా ఇచ్చి ఈనెల 2న వ్యక్తిగతంగా విచారణ చేశారు. కొన్ని అంశాలపై మౌఖికంగా, కొన్నింటిపై మిగతా 2లో...



ఫిర్యాదుదారులైన న్యాయవాది శైలజను, మరో వ్యక్తిని విచారిస్తున్న కమిటీ సభ్యులు (ఫైల్)

ఉపాధి పనుల్లో అంతులేని అవినీతి

జిల్లాలో ఉపాధి పనులలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని, కూలీలతో కాకుండా దొంగ మస్టర్లతో, యంత్రాలతో పనులు చేసి బిల్లులు డ్రా చేశారన్న ఫిర్యాదులపై డ్వామా పీడీగా శీనారెడ్డి ఉన్న కాలంలో రాష్ట్ర కమిషన్ కార్యాలయం నుంచి వచ్చిన ప్రత్యేక తనిఖీ బృందాలు కొండపి, అర్ధవీడు, పెద్దారవీడు, కేకేమిట్ల, దోర్నాల మండలాల్లో పరిశీలన చేసి అక్రమాలు గుర్తించారు. అందుకు బాధ్యులుగా 25మంది అప్పట్లో సస్పెండ్ అయ్యారు. రాష్ట్ర బృందాలు తనిఖీ చేసిన పనులను శీనారెడ్డి రీవెరిఫికేషన్ పేరుతో ఒక ఏపీడీ నేతృత్వంలో పరిశీలన చేయించి సస్పెండైన వారికి తిరిగి పోస్టింగులు ఇచ్చారు. రీ వెరిఫికేషన్ అధికారం లేకున్నా చేయించడం, సస్పెండైన వారికి పోస్టింగ్‌లు ఇవ్వడాన్ని విచారణ కమిటీ తప్పు బట్టింది. కనీసం రీవెరిఫికేషన్‌కు అటు కమిషనర్ నుంచి కాని ఇటు కలెక్టర్ నుంచి కాని అనుమతి తీసుకోలేదని గుర్తించారు.

శీనారెడ్డి ఆదేశాలతో అలా చేశా

ఒంగోలు ఏపీడీ కాత్యాయిని కొంత కాలం అనారోగ్యంతో సెలవులో, మరికొంతకాలం కార్యాలయంలో లేని సమయంలో వెంకటస్వామిని ఇన్‌చార్జిగా నియమించారు. అతని అద్దెకారు వాడుకునే ప్రొవిజన్ లేకపోగా కాత్యాయినితో టూర్ డైరీపై సంతకాలు చేయించి వెంకటస్వామికి బిల్లులు ఇచ్చారు. శీనారెడ్డి ఆదేశాలతో తాను అలా సంతకాలు పెట్టినట్లు కాత్యాయిని కమిటీ ముందు చెప్పినట్లు సమాచారం. కిందిస్థాయి ఉద్యోగికి పైస్థాయి అధికారి ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చేటప్పుడు కమిషనరేట్ లేదా కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సి ఉండగా ఒంగోలు ఏపీడీగా వెంకటస్వామి, కందుకూరు ఏపీడీగా సుభాషిణిలను ఇన్‌చార్జీగా నియమించడమే కాక వారికి లేని వాహన ప్రొవిజన్ కల్పించారు. తద్వారా తమపై స్థాయి అధికారులైన ఎంపీడీవోలను అజమాయిషీ చేసే అధికారాన్ని, నిబంధనలకు విరుద్ధంగా వారికి కట్టబెట్టారు.



పీడీసీసీబీ కార్యాలయం (ఫైల్)

డీసీసీబీ ఎవరికో?

ఉమ్మడి జిల్లా పరిధిలో జిల్లా పరిషత్ తర్వాత ఆ స్థాయి ప్రాధాన్యత గల జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) పూర్తిస్థాయి ఆధిపత్యం కోసం అధికార టీడీపీ నాయకులు దృష్టిసారించారు. అందులో భాగంగా మున్ముందు రాబోయే సహకార ఎన్నికలు కూడా దీటుగా ఎదుర్కొనే వారితో పాలకమండలిని నియమించే విషయంపై కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుతం సెంట్రల్ బ్యాంక్ పాలకమండలిలో కిందిస్థాయి సొసైటీల్లో అధికారులతో కూడిన త్రీమెన్ కమిటీలు ఉన్నాయి. వాటి స్థానే రాజకీయ నేతలతో కూడిన త్రీమెన్ కమిటీలు నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు కిందిస్థాయిలో సొసైటీల త్రీమెన్ కమిటీ నియామకాలపై ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జులు కుస్తీ పడుతున్న విషయం తెలిసిందే. సొసైటీలతోపాటు జిల్లా బ్యాంకుకు కూడా ఒక పర్సన్ ఇన్‌చార్జిని ఇద్దరు లేక ఐదుగురు సభ్యులుగా ఉండే పాలకమండలిని నియమించాలని భావిస్తోంది. ఇప్పటికే ఈ విషయంపై టీడీపీ నాయకులు దృష్టిపెట్టి పరిశీలన చేస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

- పర్సన్ ఇన్‌చార్జి నియామకంపై కసరత్తు
- ఇప్పటికీ పరిశీలనలో ముందున్న డాక్టర్ సీతారామయ్య, వీరయ్య పేర్లు
- భవిష్యత్తులో ఎన్నికల వ్యయభారాన్ని మోయాలని ఆంక్ష
- డాక్టర్ పేరును ప్రతిపాదించిన ఎమ్మెల్యే దామచర్ల
- ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఇద్దరి సిఫార్సు లేఖలపై సంతకాలు చేసిన వైనం

ఎన్నికల బాధ్యత తీసుకోవాల్సిందే

కొంతకాలం క్రితం డీసీసీబీ విషయమై తాడేపల్లిలోని మంత్రి రవికుమార్ నివాసంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ఇతర ముఖ్య నాయకులు సమావేశమై చర్చించారు. అంతకుముందు ఒంగోలులో జరిగిన ఒక సమావేశంలో కూడా ఈ విషయంపై వారి మధ్య చర్చలు జరిగాయి. ప్రస్తుతం సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జిని ఎవరిని నియమించినా వారే భవిష్యత్తు సహకార ఎన్నికల బాధ్యత తీసుకునే విధంగా చూసుకోగలగాలని తదనుగుణంగానే ప్రస్తుత ఎంపిక జరగాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల సమయంలో వ్యయాన్ని భరించగలిగిన వారే ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జి పదవి కోసం ముందుకు రావాలని టీడీపీ నాయకులు ఆశావాహులకు సూచించారు.

పరిశీలనలో ముందున్న ఆ ఇద్దరు

ప్రస్తుతం డీసీసీబీ కోసం పలువురు ప్రయత్నం చేస్తున్నారు. అలా ప్రయత్నించే వారిలో ప్రస్తుతానికి ఒంగోలుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యల పేర్లు పరిశీలనలో ముందున్నట్లు తెలుస్తోంది. ఒంగోలులోని వెంకటరమణ వైద్యశాల యాజమాన్య భాగస్వామి అయిన డాక్టర్ సీతారామయ్య పేరును ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రతిపాదించారు. డాక్టర్ సీతారామయ్య తండ్రి డాక్టర్ రమణారావు 1989 ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత సీతారామయ్య వైద్య వృత్తిలో వచ్చినప్పటి నుంచి టీడీపీలో కొనసాగుతూ తన వంతు పాత్ర పోషిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఒంగోలు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. 2014 నుంచి ప్రతి ఎన్నికల్లో దామచర్లకు మద్దతుగా పనిచేశారు. సెంట్రల్ బ్యాంకులో తక్కువ సింగిల్ విండోలు ఉన్న నియోజకవర్గం ఒంగోలు. మిగతా 2లో...

ఆటస్థలం పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దొనకొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లబాడు జడ్పీ పాఠశాలకు కేటాయించిన ఆట స్థలాన్ని తహసీల్దార్ బి.రమాదేవి పరిశీలించారు. కబ్జాకోరల్లో ఆటస్థలం శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ రమాదేవి తన సిబ్బందితో తెల్లబాడు గ్రామంలోని సర్వేనెంబర్ 178/2లోని ప్రభుత్వ భూమిని రికార్డుల మేరకు పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక వారి ఆదేశాల మేరకు త్వరలో పాఠశాలకు ఆటస్థలం కేటాయించేలా తగిన చర్యలు చేపడతామని ఆమె పేర్కొన్నారు.



తెల్లబాడు గ్రామస్థులతో చర్చిస్తున్న తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ సిబ్బంది

20 నుంచి గ్రామాల్లో రీసర్వే

జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 38 మండలాల్లో ఒక్కొక్క గ్రామంలో ఈనెల 20వతేదీ నుంచి రీసర్వేను ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో శుక్రవారం రీసర్వేపై సర్వేయర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 38 గ్రామాల్లో 136 బ్లాకులుగా ఏర్పాటుచేసి 64,904.04 ఎకరాలను సర్వే చేయనున్నట్లు తెలిపారు. అందుకోసం 126 మందితో ఫీల్డ్ వర్క్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సర్వే గ్రామాల్లో విస్తీర్ణాన్ని బట్టి నాలుగైదు బృందాలను కేటాయిస్తామన్నారు. ఒక్కొక్క బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏ ఉంటారన్నారు. సర్వే జరిగే గ్రామానికి చెందిన రైతులకు, గ్రామంలో లేకుండా ఇతర ప్రాంతాల్లో ఉండే భూయజమానులందరికి నోటీసులు ఇచ్చి రశీదులు తీసుకుంటామన్నారు. సర్వే జరిగే గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సభలు, ర్యాలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రైవేటు భూముల సర్వే ఉమ్మడి ల్యాండ్ పార్శిల్ మ్యాప్‌గా కాకుండా ప్రతి రైతుకు ఒక ఎల్‌బీఎం



సమావేశానికి హాజరైన అధికారులు, మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

వచ్చేలాగా రోవర్ ద్వారా సర్వే చేస్తామని తెలిపారు. సర్వేకు ముందు గ్రామసభ ఏర్పాటు చేసి అందులో వచ్చే సమస్యలను రికార్డులను నమోదు చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవగాహన సదస్సులకు సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలతోపాటు తహసీల్దార్లు కూడా పాల్గొంటారని వెల్లడించారు. ప్రతి రైతుకు సంబంధించిన భూమి రికార్డుల్లో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి షేక్ గౌస్‌బాషా పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతికి ఏర్పాట్లు పూర్తి

రక్తదానాలు, అన్నదానాలకు సిద్ధం

ఒంగోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు వర్ధంతి కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు తెలుగు తమ్ముళ్లు సిద్ధమయ్యారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి కాగా ఆ కార్యక్రమానికి కేడర్ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది కావడంతో కార్యకర్తలు మరింత ఉత్సాహంగా కనిపిస్తున్నారు. నియోజకవర్గం యూనిట్‌గా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు వర్ధంతి కార్యక్రమాలపై దృష్టిసారించి గ్రామగ్రామాన కార్యక్రమాలు జరిగేలా సిద్ధమయ్యారు. అన్నిచోట్ల ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నివాళులతోపాటు సభలు, ఆ సందర్భంగా రక్తదాన శిబిరాలు, భారీగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలోని పలుచోట్ల ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలను కూడా టీడీపీ శ్రేణులు చేపడుతున్నారు. టంగుటూరు మండలం కందులూరులో



ఒంగోలులో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమానికి సిద్ధమైన వేదిక

ఎన్టీఆర్, దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహావిష్కరణ జరగనుంది. కార్యక్రమానికి మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య ఆహ్వానంతో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామి, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఇతర ప్రముఖులు హాజరవుతున్నారు.

డీసీసీబీ ఎవరికో?

(మొదటి పేజీ తరువాయి)

దీంతో ఈ విషయాన్ని కొందరు ప్రస్తావించగా ఎమ్మెల్యే దామచర్ల తన ప్రతిపాదనను అంగీకరించాలని కోరటంతో మిగిలిన వారు సైలెంట్ అయ్యారు. ఆయన పేరును దామచర్ల ప్రతిపాదించగా ఆ సిఫార్సు లెటర్‌పై నూతన ప్రకాశం జిల్లాలోని ముఖ్య నాయకులు, మంత్రి స్వామితో సహా అందరూ సంతకాలు చేయగా మిగిలిన నాయకులు కూడా మద్దతు ఇచ్చినట్లు తెలిసింది. మరోవైపు మాజీ ఎంపీపీ వీరయ్య కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయన కూడా సంతకాల సేకరణ జరిపినట్లు తెలిసింది. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్ కుమార్‌తో సహా ప్రకాశం జిల్లాలోని ఎక్కువ మంది నాయకులు ఆయన సిఫార్సు లేఖపై కూడా సంతకాలు చేశారు. దామచర్ల మాత్రం సీతారామయ్యవైపే ఉన్నారు. మంత్రులు రవి కుమార్, స్వామి అధిష్ఠానం నిర్ణయాన్ని కాదనలేమని ఎవరి ప్రయత్నం వారు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది.

బాబు, లోకేశ్‌లను కలిసి విన్నపం..

ఇటు సీతారామయ్య అటు వీరయ్యలు ఇద్దరు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లను కూడా కలిసి సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జిగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ ఇద్దరు నాయకులు కూడా లోకేశ్ దృష్టిలో ఉన్నారనేది సమాచారం. లోకేశ్ పాదయాత్ర సందర్భంగా వీరయ్య ఆయనకు దగ్గరై ఆ తర్వాత ఎన్నికల సమయంలో చీరాల కో-ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ ఇరువురు కాకుండా మరికొందరు నాయకులు కూడా తమకు అవకాశం ఇవ్వాలని అటు బాబును ఇటు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అద్దంకి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య కూడా ఆప్కాబ్ చైర్మన్ పదవికి తన పేరును పరిశీలించాలని చంద్రబాబు, లోకేశ్‌లను కోరి ఉన్నారు. ఆప్కాబ్ చైర్మన్ కావాలంటే ముందుగా సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికవ్వాలి. ఆ రకంగా ఆయన కూడా సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆప్కాబ్ చైర్మన్ పదవిని గోదావరి జిల్లాలో ఒకరికి కేటాయించాలని మంత్రి లోకేశ్ ఆలోచిస్తున్నట్లు కూడా సమాచారం. దీంతో సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి నియామకం విషయంలో రానున్న వారం రోజుల్లో జిల్లాలోని టీడీపీ నాయకులంతా ఏకాభిప్రాయంతో ఒక పేరును సూచిస్తారా? లేక అధిష్ఠానమే తదినిర్ణయం తీసుకుంటుందా అనే విషయం తేలాల్సి ఉంది.

వైభవంగా శ్రీభద్రావతి సమేత భావన్నారాయణ స్వామి కల్యాణం



వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య, మున్సిపల్ చైర్మన్ జంజనం తదితరులు

చీరాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పేరాలలో వేంచేసి ఉన్న శ్రీ భద్రావతి సమేత శ్రీ భావన్నారాయణ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి చీరాల, పేరాల పుర వీధుల్లో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవం నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య మా ట్లాడుతూ ఆలయాభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జం జనం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయలానికి 100 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఆలయ పుట్టుపూర్వోత్తరాలను వివరించారు. నగరోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, నిర్వాహక ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు.

అలరించిన నాటిక పోటీలు

పర్చూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పౌరాణిక కళాకారులు, నట ప్రతాప్ చెరుకూరి శ్రీరాములు చౌదరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మండలం బోడవాడలో ప్రదర్శించిన నాటిక పోటీలు ప్రేక్షకులను రంజింపచేశాయి. నేటి సమాజంలో తరగిపోతున్న మానవ విలువలు, సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు అందించాలన్న సంకల్పంతో సాగిన నాటిక ప్రదర్శనలో కళాకారుల అద్భుతమైన నటను చూపించారు. నాటిక పోటీల అనంతరం భీమినేని యుక్తా చౌదరి నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన మంత్రముగ్ధులను చేసింది. టీడీపీ నాయకుడు చెరుకూరి శ్రీధర్(చింపయ్య) సారథ్యంలో ఈ పోటీలను ఏర్పాటు చేశారు.

ఎన్టీఆర్ వర్ధంతికి ఏర్పాట్లు పూర్తి

భారీగా నివాళులు, అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఒంగోలు నగరం గుంటూరు రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగే ఈ వేడుకలకు సంబంధించి దామచర్ల శుక్రవారం నిర్వహణ కమిటీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొన్ని సలహాలు, సూచనలు చేసి, ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే ఒంగోలు నియోజకవర్గం టీడీపీ ఆధ్వర్యంలో భారీగా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 37వ డివిజన్‌లో చెన్నకేశ స్వామి లేఅవుట్ పార్కులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించడంతో పాటు, గుంటూరు రోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ప్రారంభం, అనంతరం అద్దంకి బస్టాండ్‌లోని దివంగత ఎన్టీఆర్, పోనుగుపాటి కోటేశ్వరరావు, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు నివాళులు అర్పిస్తారు. అలాగే 5వ డివిజన్‌లోని గోపాలనగరంలో గల తిరుపతమ్మ గుడి వద్ద ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం, కమ్మపాలెంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో, అనంతరం నల్లూరి నర్సింగ్ హోమ్ ఎదురు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు, నిర్మల్ పార్కువద్ద, కర్నూలు రోడ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు, తెలుగుతల్లి విగ్రహాలలకు నివాళి, 60 అడుగలరోడ్డులో విగ్రహం వద్ద నివాళి, మధ్యాహ్నం నుంచి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగే వర్ధంతి సభ కార్యక్రమంతోపాటు అన్నదానం ఏర్పాటుచేశారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో కలిసి దామచర్ల జనార్దన్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, మునిసిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు కమ్మ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లాను కుష్ఠువ్యాధి రహితంగా మార్చాలి

● కలెక్టర్ అన్సారియా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాను కుష్ఠువ్యాధి రహితంగా మార్చేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. అంతకు ముందు డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి కుష్ఠు నివారణ కోసం ప్రత్యేక అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది నవంబరు ఆఖరు వరకు జిల్లాలో 91 కేసులు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. జిల్లాలో కుష్ఠువ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు ఈనెల 20నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ అనుమానిత కేసులను గుర్తిస్తే వెంటనే చికిత్స ప్రారంభించాలన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుష్ఠు నివారణాధికారి సురేష్‌కుమార్, డీసీహెచ్ఎస్ సూరిబాబు, అధికారులు కిరణ్‌కుమార్, వెంకట నాయుడు, చిరంజీవి, లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

20నుంచి జిల్లాలో కుష్ఠువ్యాధిగ్రస్తుల గుర్తింపు

జిల్లాలో ఈనెల 20వ తేదీ నుంచి వచ్చేనెల 2వతేదీ వరకు కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయం నుంచి శుక్రవారం జిల్లాలోని వైద్యాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, అలాగే చెవులు, వీపుపై, ఎదపై నొప్పిలేని బుడిపెలు, కనురెప్పలు మూతపడం, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు కలిగి ఉండటం, పాదాల వాపు, తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం, చేతివేళ్ళు, కాలివేళ్ళు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం వంటి లక్షణాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ప్రతిష్ఠాత్మంగా తీసుకొని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌టీవో డాక్టర్ సురేశ్‌కుమార్, ప్రోగ్రాం అధికారి భగీరథి, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ రజిత, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

దిగుబడి పెంపు.. నాణ్యమైన పంటే లక్ష్యం

పొగాకు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

సబ్సిడీపై ఉపకరణాలు అందజేత

వేలం కేంద్రం అధికారుల సమీక్షలో బోర్డు విస్తరణ మేనేజర్ దామోదర్



సమీక్ష చేస్తున్న బోర్డువిస్తరణ విభాగం మేనేజర్ దామోదర్, లక్ష్మణరావు

ఒంగోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పొగాకు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు మరింత అవగాహన కల్పించేలా వేలం కేంద్ర అధికారులు కృషి చేయాలని పొగాకు బోర్డు విస్తరణ విభాగం మేనేజర్ పి. దామోదర్ సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అత్యంత నాణ్యమైన పంట ఉత్పత్తే లక్ష్యంగా కార్యక్రమాలు ఉండాలన్నారు. శుక్రవారం జిల్లాలో ఒంగోలు ఆర్ఎం లక్ష్మణరావుతో కలిసి ఆయన పర్యటించారు. తొలుత ఒంగోలులోని ప్రాంతీయ కార్యాలయంలో దక్షిణాది వేలం కేంద్రాల అధికారులతో సమీక్షించారు. అనంతరం ఒంగోలు-1, వెల్లంపల్లి వేలం కేంద్రాల పరిధిలోని రుద్రవరం, గురువారెడ్డిపాలెం, ముండ్లమూరు గ్రామాల్లో పర్యటించి పొగతోటలు, ఆకు రెలుపు, బ్యారన్‌లో క్యూరింగ్‌లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కాగా ఒంగోలులో నిర్వహించిన సమీక్షలో దామోదర్ మాట్లాడుతూ పోటీ మార్కెట్లో పొగాకు పంటలో నాణ్యత ప్రధానంగా ఉండాలన్నారు. ప్రధానంగా గ్రేడింగ్ బేళ్ల తయారీలో అన్యపదార్థాలు రాకుండా చూడటంపై దృష్టి పెట్టాలని చెప్పారు. అలాగే నారుమడుల నుంచి అమ్మకాల వరకు రైతులకు పొగాకు బోర్డు ద్వారా నిర్వహించే శిక్షణా కార్యక్రమాలపై సమీక్ష చేశారు. సబ్సిడీపై నీటి సరఫరా పైపులు, టార్పాలిన్, పచ్చిరొట్ట విత్తనాలు, లింగాకర్షణ బుట్టలు, ఎరువుల సరఫరా వంటివి బోర్డు ద్వారా చేస్తుండగా ప్రస్తుత ఏడాది ఆయా వేలం కేంద్రాల వారీ వాటి అమలుతో పాటు రానున్న ఏడాది లక్ష్యాలు, ప్రణాళికలను సమీక్ష చేశారు.

మళ్లీ ఆర్ఎంగా లక్ష్మణరావు బాధ్యతలు స్వీకరణ

ఒంగోలు కేంద్రంగా ఉన్న పొగాకు బోర్డు ప్రాంతీయ మేనేజర్(ఆర్ఎం) ఎం. లక్ష్మణరావు తిరిగి బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లుగా ఇక్కడ పని చేస్తున్న ఆయనను ఐదు నెలల క్రితం డిప్యూటేషన్‌పై కర్ణాటక వేలం నిర్వహణ కోసం పంపించారు. ఆ సమయంలో గుంటూరులోని బోర్డు ప్రధాన కార్యాలయంలో మేనేజర్‌గా ఉన్న కృష్ణశ్రీకి ఇక్కడి ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వగా డిసెంబరు 31న ఆమె ఉద్యోగ విరమణ చేశారు. కర్ణాటకలో ముమ్మరంగా కొనుగోళ్లు జరుగుతుడటంతో లక్ష్మణరావును అక్కడే కొనసాగిస్తూ ఒంగోలు ఆర్ఎంగా ప్రధాన కార్యాలయంలోని మేనేజర్ సుబ్బారావుకు బాధ్యతలు ఇచ్చారు. కాగా సంక్రాంతి సమయంలో కర్ణాటకలో వేలం తాత్కాలికంగా ఆపడంతో పాటు వచ్చేనెలలో రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్లను ప్రారంభించాల్సి ఉంది. దీంతో లక్ష్మణరావు తిరిగి ఒంగోలు రెగ్యులర్ ఆర్ఎంగా నియమించడంతో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అయితే లక్ష్మణరావు ఈ ఏడాది జూన్ 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

శీనారెడ్డి ఇష్టారాజ్యం

(మొదటి పేజీ తరువాయి)

రాతపూర్వకంగా ఆ సమయంలో ఆయన వివరణ ఇచ్చినా కమిటీ సభ్యులు ప్రశ్నించిన పలు అంశాలపై దాటవేత ధోరణితో వ్యవహరించారని గుర్తించిన వారు ఆయా అంశాలపై మరింత వివరంగా స్టేట్‌మెంట్ ఇవ్వాలని సూచించగా ఇవ్వలేదని సమాచారం. ఫిర్యాదుదారులు ఐదుగురుకి, డ్వామా ఉద్యోగులు, పూర్వ ఉద్యోగులు 44మందికి విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చిన కమిటీ ఈనెల 8, 9 తేదీల్లో విచారణ చేసింది. అందులో నలుగురు ఫిర్యాదుదారులు, 39మంది ఉద్యోగులు విచారణకు హాజరు కాగా వారి నుంచి కూడా లిఖిత పూర్వకంగా వివరణలు తీసుకున్నారు.

కలెక్టర్‌కు ఇచ్చిన నివేదిక సారాంశం

● జగనన్న కాలనీల్లో లెవలింగ్, అంతర్గత రోడ్ల నిర్మాణం, ఇతర పనులకు భారీగా ఉపాధి నిధులు ఖర్చుచేయగా వాటిలో అనేక అక్రమాలు జరిగి నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. చేసిన పనులకు రికార్డులు లేకపోవడాన్ని కమిటీ గుర్తించింది. ఒంగోలు మండలం చేజర్ల కాలనీ పనులు రికార్డులు పరిశీలించగా అక్రమాలు నిజమని తెలినట్లు సమాచారం. ఒంగోలుకు సంబంధించి యరజర్ల వద్ద తొలుత వేసిన లే అవుట్‌కు ఉపాధి నుంచి నిధులు ఇవ్వడానికి అవకాశం లేదని, కొండ ప్రాంతం కాబట్టి కూలీలతో కాకుండా యంత్రాలతో చేయాలని శీనారెడ్డి లిఖితపూర్వకంగా ఇవ్వగా రూ.34 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. అక్కడ ఇళ్ల స్థలాలు పంపిణీ నిలిచిపోగా అప్పటి వైసీపీ నేతల లబ్ధికోసం శీనారెడ్డి అలా లెటర్ ఇచ్చినట్లు కమిటీ గుర్తించింది. ఆ లేఖకు సంబంధించి డ్వామా కార్యాలయంలో ఎలాంటి ఉత్తర, ప్రత్యుత్తరాలు కూడా లేవని తేల్చారు.

● ఏపీడీగా పనిచేస్తున్న వెంకటస్వామి వాస్తవానికి జడ్పీలో సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగికాగా డ్వామా విజిలెన్స్ విభాగం పర్యవేక్షకునిగా తొలుత డిప్యుటేషన్‌పై తీసుకొని కొంత కాలం తర్వాత ఏకంగా జిల్లా విజిలెన్స్ అధికారిగా, మరికొంతకాలం తర్వాత పది మండలాలకు పర్యవేక్షణ ఉండే ఒంగోలు ఏపీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఆ సమయంలో విజిలెన్స్ విభాగంలో పలు అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఇప్పటికి కూడా సదరు వెంకటస్వామి ఏపీడీగానే కొనసాగుతున్నారు.

● ఒంగోలు క్లస్టర్ శిక్షణ కేంద్రం నిధుల వినియోగంపై ఏపీడీ కేంద్ర డైరెక్టర్‌లకు జాయింట్ చెక్‌పవర్ కాగా వారికి సంబంధం లేకుండా అటెండర్ రూ.14లక్షలు బ్యాంకు నుంచి ఆరునెలల వ్యవధిలో డ్రా చేశాడు. ఆ విషయాన్ని ఏపీడీ కాత్యాయిని, డైరెక్టర్ లలితాదేవిలు పీడీ శీనారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. క్రిమినల్ కేసు నమోదు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ ఇద్దరిని సస్పెండ్, అటెండర్‌ను డిస్మిస్ చేయాల్సి ఉండగా తాత్కాలికంగా అటెండర్‌ను సస్పెండ్ చేశారు. తర్వాత నగదు తిరిగి కట్టాడని చెప్పి మళ్లీ అటెండర్‌కు ఉద్యోగం ఇచ్చారు. ఇందులో ఏపీడీ వెంకటస్వామిని విచారణ అధికారిగా పెట్టి నామమాత్రంగా చేపించినట్లు కమిటీ గుర్తించింది.

● డ్వామాలో పీడీ కన్నా ముందు గతంలో కొంతకాలం ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేసిన శీనారెడ్డి ఆ సమయంలో ప్రభుత్వ ఉద్యోగి అయిన తన భార్య పేరుతో అద్దె వాహనం పెట్టుకొని బిల్లులు డ్రా చేశారు. పీడీ అయ్యాక నిబంధనల ప్రకారం నెలకు రూ.45వేలు అద్దె చెల్లింపు చేయాల్సి ఉండగా ఏకంగా రూ.60వేలు డ్రా చేశారు.

● ఆయన కాలంలో సామాజిక తనిఖీలు ప్రహసనంగా సాగాయి. బృందాలు ఒక మండలంలో రూ.2కోట్లు అక్రమాలు జరిగాయని గుర్తిస్తే ప్రజావేదికలో దానిని తగ్గించి కొందరు సిబ్బందిని సస్పెండ్ చేశారు. అనంతరం వ్యక్తిగత విచారణ పేరుతో పిలిచి మాట్లాడుకొని మరింత తగ్గించి రికవరీలు చేయకుండా తిరిగి పోస్టింగ్‌లు ఇచ్చారు. దోర్నాల మండలంలో ఒక వ్యక్తి అనేక మంది వేలిముద్రలు వేసి అక్రమంగా ఉపాధి డబ్బులు స్వాహా చేయడాన్ని గుర్తించిన కమిటీ ఈ వ్యవహారాల్లో శీనారెడ్డితోపాటు నాటి విజిలెన్స్ విభాగం సిబ్బంది కూడా ఉన్నట్లు తేల్చింది.

● కొన్నిచోట్ల ఆడిట్ నివేదికల ఆధారంగా సిబ్బందిపై చర్యలు తప్పని పరిస్థితి ఎదురైతే కలెక్టర్‌కు నివేదించి సస్పెండ్ చేయించి తర్వాత తనకు నచ్చిన వారికి గుట్టుచప్పుడు కాకుండా తానే పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇష్టంలేని వారిని డిస్మిస్ చేశారు.వారికిసంజాయిషీ ఇచ్చుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. ఈ విషయం కమిటీ గ్రహించడంతో పాటు కలెక్టర్ అనుమతి లేకుండా పోస్టింగ్‌లు ఇచ్చారని గుర్తించారు.

● డ్వామాలో నిరంతరం వివిధ అంశాలపై శిక్షణా కార్యక్రమాలు నడుస్తుంటాయి. స్టేషనరీ వాడకం కూడా అధికంగా ఉంటుంది. వీటికి సంబంధించి కార్యాలయంలో శీనారెడ్డికి నమ్మకస్తుడిగా ఉండే ఒక ఉద్యోగి భార్య పేరుతో ఉన్న క్యాటరింగ్, స్టేషనరీకి ఏజెన్సీల ద్వారా ఖర్చుచేసినట్లు కమిటీ గుర్తించింది. ఆ బిల్లులు కూడా కమిటీ ముందు ప్రస్తుత ఉద్యోగులు సమర్పించకపోవడంతో అక్రమాలు జరిగినట్లు తేల్చారు.

● డ్వామాలోని విజిలెన్స్ విభాగం, సోషల్ ఆడిట్, హెచ్ఆర్‌తోపాటు పలు సెక్షన్లలో అవినీతి వేళ్లానుకుపోయినట్లు, కొందరు ఉద్యోగుల పాత్ర అందులో ఉన్నట్లు కమిటీ గుర్తించి వారి పేర్లతో సహా తమ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. లంచాలు కూడా ఫోన్ పే ద్వారా జరిగాయని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన కమిటీ శీనారెడ్డి అలాగే విజిలెన్స్ విభాగంలోని ఉద్యోగి మొబైల్ నెంబర్లకు ఉన్న బ్యాంకు అకౌంట్లను కూడా పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

● డ్వామాలో వాడిన అద్దె వాహనాలు, చెల్లించిన బిల్లులు, స్టేషనరీ, క్యాటరింగ్ బిల్లులు, జలసిరి, ఈజీఎస్ బిల్లుల ఫైళ్లు అనేకం అందుబాటులో లేవంటూ సిబ్బంది కమిటీకి సమర్పించలేదు. దీంతో మరోసారి సమగ్రంగా వివరణ ఇవ్వాలని శీనారెడ్డికి సూచించినా రాకపోవడం, కమిటీకి సహకరించాలని ప్రస్తుత పీడీ రాతపూర్వకంగా ఉత్తర్వులు ఇచ్చినా కొందరు ఉద్యోగులు దాటవేత వైఖరితో ఉండటం వంటి అంశాలను కూడా కమిటీ తమ నివేదికలో పేర్కొంటూ బాధ్యులపై చర్యలతో పాటు డ్వామా కార్యాలయంలో సిబ్బంది మార్పులు, చేర్పులు చేయడం అవసరంగా సూచించినట్లు తెలిసింది.

పీఎం జన్‌మన్ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి

అవీఇవీ



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అభివృద్ధే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయమహాఅభియాన్(పీఎంజన్‌మన్) పథకాన్ని జిల్లాలో పటిష్ఠంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం పలు శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి లక్ష్యంతో గిరిజనులు, చెంచులు నివసిస్తున్న హ్యాబిటేషన్లలో సురక్షితమైన గృహాలు, స్వచ్ఛమైన తాగునీరు, వైద్యం, విద్య, పోషకాహారం, రహదారి, టెలికమ్యూనికేషన్స్ కనెక్టివిటి, స్థిరమైన జీవనోపాధికి అవకాశాలతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన 11 ఇండికేటర్స్‌ను కేంద్ర ప్రభుత్వం ఈ ప థకం కింద నిర్దేశించిందన్నారు. అందుకు అనుగుణంగా మంజూరైన పనులను సంబంధితశాఆఖల అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం కిందచేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసేందుకు ఆయాశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఎఫ్ఓ సందీప్ కృపాకర్, ఐటిడిఎ పిఓ వెంకట శివప్రసాద్, వివిధశాఖల అధికారులు శ్రీనివాస ప్రసాద్, కిరణ్‌కుమార్, హేన సుజన, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ బేబిరాణి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, బాల శంకరరావు, బెనహర్ తదితరులు ఉన్నారు.

దాడి ఘటనపై ఆరుగురిపై కేసు

మార్టూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గురువారం అర్ధరాత్రి పెట్రోలు బంకు వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులపై ఆరుగురు వ్యక్తులు దాడిచేసి గాయపరచిన ఘటన జరిగింది. గ్రామంలో గురువారం తిరునాళ్ల జరుగుతుండడంతో అర్ధరాత్రి సమయంలో మండలంలోని జొన్నతాళి గ్రామానికి చెందిన దేసిబోయిన శ్రీనివాస్, చిట్టిబోయిన వెంకటేష్‌తో పాటు మరో నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై పెట్రోలు బంకు వద్దకు వచ్చారు.ఈ సమయంలో వారు పెట్రోలు పోయించుకునే విషయంలో ఘర్షణ పడుతూ పెట్రోలు బంకు కు చెందిన ముగ్గురు వ్యక్తులు పెంట్యాల నాగేశ్వరరావు,బోలే నరసింహారావు,ముప్పవరపు ఉదయభాస్కర్ లపై దాడి చేసి గాయపరచారు.దాంతో పెంట్యాల నాగేశ్వరరావు స్టేషన్ లో 6 గురు యువకులపై ఫిర్యాదు చేశారు.అనంతరం గాయపడిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషగిరిరావు శుక్రవారం తెలిపారు.

ద్విచక్రవాహనదారుడు మృతి

అద్దంకి టౌన్,జనవరి17(ఆంధ్రజ్యోతి) ద్విచక్రవాహనంపై వస్తున్న మాగంటి గురవయ్య (29) అనే వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అతను సంఘటనా స్థలంలోనే మృతిచెందిన సంఘటన శుక్రవారం ఉదయం అద్దంకి మండల పరిదిలోని చక్రాయపాలెం వద్ద జరిగింది.మృతునికి రెండేళ్ల క్రితం వివాహం జరిగింది.అతను భార్యతల్లితో చినకొత్తపల్లిలో నివాసం ఉంటున్నారు.మృతుడు అద్దంకి లోని ప్రవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు.శుక్రవారం అద్దంకి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి సీఐ సుబ్బరాజు,ఎస్ఐ ఖాదర్‌భాషాలు వచ్చి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.మృతుని భార్య హేమలత ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఖాదర్‌భాషా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కదిలే రైలులో చోరీకి యత్నం

దుండగుడిని పట్టుకునేందుకు దూకిన తండ్రీ, కూతురు

తండ్రికి స్వల్ప గాయాలు.. తప్పిన ప్రమాదం

చీరాలటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుడే కదులుతున్న రైలులో సెల్‌ఫోన్‌ను అపహరించి బయటకు దూకాడు ఓ దుండగుడు. అయితే అతనని పట్టుకునేందుకు కూతురు, తండ్రి ఒకరి తరువాత ఒకరు దూకారు. అయితే రైలు చిన్నగా కదులుతుండడంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలుకు చెందిన మల్లికార్జునరావు, కుమార్తెను తీసుకుని శుక్రవారం బాపట్లలోని బంధువుల వద్దకు వెళ్లా రు. సాయంత్రం తిరిగి ఒంగోలు వచ్చేందుకు పూరీ - తిరుపతి రైలు ఎక్కారు. ఈక్రమంలో వారిని అప్పటికే గమనిస్తున్న ఓ దుండగుడు రైలు చిన్నగా కదులుతూ చీరాల ఫైర్ గేటు సమీపానికి రాగానే కుమార్తె చేతులో ఉన్న ఫోన్ లాక్కుని బయటకు దూకాడు. బిగ్గరగా కేకలు వేసిన కుమార్తె అతడిని పట్టుకునేందుకు ఆమె కూడా బయటకు దూకింది. దీంతో కుమార్తె కోసం తండ్రి మల్లికార్జునరావు కూడా బయటకు దూకాడు. దుండగుడి కోసం పదిమీటర్లు వరకు కుమార్తె వెంబడించగా దుండగుడు ఫోన్ వదిలేసి పరారయ్యాడు. కుమార్తెకు సురక్షితంగానే ఉండగా, తండ్రి కాలికి రాయి గుచ్చుకుని రక్త గాయమైంది. దీంతో చీరాల ఏరియా వైద్యశాలలో చేరి, చికిత్స పొందగా, రైల్వే పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు.

మేళతాళాలతో అమ్మవారి గ్రామోత్సవం

వేలాదిగా పాల్గొన్న భక్తులు.. పూలమయంగా పురవీధులు



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

పంగులూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి పాలవెల్లి మహోత్సవం తొమ్మిదవ రోజు శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మేళతాళాలతో సాగిన అమ్మవారి గ్రామోత్సవంలో వేలాది మంది భక్తులు అమ్మవారికి అభిముఖంగా వెనుకకు నడుస్తూ పూలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భక్తి పారవశ్యంతో అమ్మవారికి సమర్పించిన పూలతో పురవీధులు పసుపు మయమాయ్యాయి. శుక్రరవారం తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల మూల మంత్ర జపం చేసి 11 మంది ముత్తయిదువులకు పూలు, గంధం, కుంకుమలు అర్పించి బాలభోగం నిర్వహించారు. పొంగించిన పాలపై నెయ్యితో కలిపిన మధుర పదార్థం అమ్మవారికి నివేదన గావించి ముత్తయిదువులకు ఆ పధార్థాలను ఒడ్డించారు. అనంతరం ముత్తయిదువులు జల బిందెలతో పురవీధులలో అమ్మవారి గ్రామోత్సవం వెంట రాగా, మేళతాళాలతో సాగిన ఈ గ్రామోత్సవంలో చందలూరు, పరిసర గ్రామాల ప్రజలు, బంధు మిత్రులు వేలాదిగా పాల్గొని అమ్మవారికి నమస్కరిస్తూ, పూలు చల్లుతూ సాగిన ఉత్సవం తిలకించేందుకు ప్రధాన రహదారికి ఇరువైపులా భక్తులు బారులుతీరారు. కిక్కిరిసిన జన సందోహంతో సాగిన గ్రామోత్సవం తిరునాళ్లను తలపించింది. అమ్మవారు పురంలో కొలువుదీరారు. రాత్రివేళ విద్యుత్ దీపాలతో రూపుదిద్దుకున్న ప్రభవతో పుల్లెల, తాటి వంశస్తులు పుర వీదులలో ఊరేగింపు నిర్వహించారు.



రోగాలకే సవాల్..!

- ఆడు.. మగాడు రా బుజ్జి..
- ఏడుపదుల వయస్సులోనూ కాయకష్టం
- నేటికీ ఆసుపత్రి మెట్లు ఎక్కలేదు.. మందు బిళ్ల మింగలేదు

ఆయన వయస్సు 70 ఏళ్లు.. తోలుతో ఎముకలను కప్పేసినట్లు శరీరం.. మెల్లలాంటి చేతులు, కాళ్లు.. ఒక్కమాటలో చెప్పాలంటే ఒంటిలో అరకేజి కండ కూడా ఉండదు. ఉన్న ఇద్దరు పిల్లలకు పెళ్లిళ్లు చేశాడు. ఇప్పటికి కూడా కాయష్టం చేస్తూ నేటి తరం యువతకు, రోగాలకు సవాల్ విసురుతున్నాడు. ఔను..! నిజంగా అతను చాలెంజ్ వీరుడే.. ఎందుకంటే ఇంత వరకు ఆయన ఆసుపత్రి మెట్లు ఎక్కలేదు. నోట్లో మందు బిళ్ల వేసుకోలేదు. రోగమంటే ఏమిటో కూడా తెలియదు. ఆయనది ఒంగోలు రూరల్ మండలం ఉలిచి గ్రామం. పేరు గరికపూడి రాఘవులు. అతను రోజూ చేసే పని చూసిన వారంతా ఔరా అని ముక్కున వేలేసుకుంటున్నారు. సుమారు ఐదు కేజీల బరువు కలిగిన గొడ్డలిని చేత పట్టుకుని, భారీ కట్టెలను ఇట్టే నరికేస్తాడు. ఎంతటి మొద్దునైనా ఇట్టే నరికేయగల బాహుబలి అని చెప్పవచ్చు. చేతి కష్టాన్ని నమ్ముకుని రోజు కూలీగా రూ.500లతో భార్యను పోషిస్తూ తన బాధ్యతను నిర్వర్తిస్తున్నాడు. అతనిని చూసిన వారంతా ఆడు మగాడు రా బుజ్జి అని పొగడుతున్నారు. శుక్రవారం అతను ఒంగోలులోని రామ్‌నగర్‌లో పనిచేస్తుండగా ఆంధ్రజ్యోతి పలుకరించింది. ఆయన జీవిత విశేషాలు వెల్లడిస్తుంటే విన్నవారంతా ముక్కున వేలుసుకుంటున్నారు.

- ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)





గ్రామ సర్వేయర్లపై పని ఒత్తిడి

మూడు శాఖలు చెప్పే పనులివీ..

పంచాయతీరాజ్‌శాఖ ద్వారా డోర్ టుడోర్ ట్యాకింగ్(మ్యాపింగ్), ఆధార్‌లింక్, బ్యాంకు అప్‌డేట్ చేయడం, హౌస్ ట్యాక్స్ సర్వేనెంబరు లింక్, పంచాయతీ భూముల సంరక్షణ వంటి పనులు త్వరగా పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తుండగా రెవెన్యూశాఖ ద్వారా గ్రామాల్లో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల పరిష్కారంతోపాటు రీ సర్వే, స్టోన్సు ఎరైజింగ్(పేరు తొలగింపు) వంటి పనులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇంకొక వైపు సర్వేశాఖ ద్వారా ప్రతిరోజూ కొన్ని లక్ష్యాలను నిర్దేశించి ఆపనులు పూర్తి చేసి సాయంత్రంలోపు నివేదికలు పంపాలని ఆదేశిస్తున్నారు.

- మూడుశాఖల మధ్య నలిగిపోతున్న వైనం
- ఏ శాఖ పనులు ముందు చేయాలో తెలియక గందరగోళం
- సమస్య పరిష్కారం కోసం చొరవచూపని అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సర్వేయర్లు మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారు. మూడు శాఖల మధ్య సమన్వయం లేమి కారణంగా ఏ రోజు ఏ పనిచేయాలో కూడా తెలియనిపరిస్థితి ఏర్పడింది. ఏ రోజుకారోజు ఆయా శాఖల అధికారులు లక్ష్యాలను నిర్దేశిస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గ్రామసచివాలయ పరిధిలో పనిచేస్తున్న సర్వేయర్లపై పంచాయతీ రాజ్, రెవెన్యూ, సర్వేశాఖ ఉన్నతాధికారులు లక్ష్యాలను నిర్దేస్తుండటంతో ఏ శాఖ పని ముందు చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.


పనిభారంతో సెలవులు

గ్రామాల్లో పనిచేసే సర్వేయర్లు ఆయా శాఖల అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయలేక, ఆ సమాచారం మండల స్థాయి అధికారులకు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నారు. పనిభారం భరించలేక కొంత మంది అనారోగ్య పరిస్థితులను సాకుగా చూపి సెలవులు పెడుతున్నారు. సర్వేయర్లు ఏ రోజు పని ఆరోజు చేసేందుకు మూడుశాఖల మధ్య సమన్వయం లేని కారణంగానే ఈపరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.

మండల సర్వేయర్ పరిధిలోకి తీసుకురావాలి

నాళం వెంకటేశ్వర్లు, సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గ్రామాల్లో పనిచేసే సర్వేయర్లను మండల సర్వేయర్ పరిధిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. తద్వారా గ్రామాల్లో పనులను త్వరగా పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మూడు శాఖలు లక్ష్యాలు ఇస్తుండటంతో ఏ శాఖ పనిచేయాలో అర్థం కాక మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారు. పనిభారం తగ్గించేందుకు కొంత వెసులుబాటు కూడా కల్పించాలి.



- రైతులకు మేలు చేకూర్చేందుకు ఇటీవల రెవెన్యూ సదస్సులు నిర్వహించి గత భూసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన దరఖాస్తులతోపాటు గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి చేయాలని మండల స్థాయి రెవెన్యూ అధికారులు ఒత్తిడి పెంచారు.
- గ్రామ సర్వేయర్లకు పంచాయతీరాజ్‌శాఖ ద్వారా వేతనాలు చెల్లిస్తుండటంతో తమ శాఖకు సంబంధించిన పలు రకాల పనులను నిర్దేశిస్తున్నారు.
- సర్వేశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ సర్వేయర్లకు తమ నిర్దేశాలను ఇస్తున్నారు.

ఇలా ఏ శాఖ అధికారులు ఆ శాఖ అధికారులు తమ లక్ష్యాలను ఇస్తుండటంతో ఏ శాఖ పని ముందు చేయాలో, ఏ శాఖ పని వెనుకచేయాలో తెలియడం లేదు.

మండల స్థాయి సర్వేయర్‌తో...

మండల స్థాయిలో సర్వేయర్ ఉన్నందున అతని ద్వారా ఏ రోజుకారోజు ఒక శాఖ పని చేయించడం ద్వారా పని సులభంగా ఉంటుందని కొందరు చెప్తున్నారు. ఆ దిశగా మండల స్థాయిలో నిర్ణయాలు తీసుకోకపోవడం, ఆయా శాఖలకు ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలను క్షేత్ర స్థాయి సర్వేయర్లకు దిశా నిర్దేశం చేస్తున్నారు. దీని వల్ల గ్రామాల్లో సర్వేయర్లు ఏ పనిచేయలేని పరిస్థితి ఏర్పడింది.



సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి

- పాకల చెల్లమ్మగారి పట్టపుపాలెం తీరంలో మృతదేహం లభ్యం



పవన్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



పవన్ (ఫైల్)

సింగరాయకొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పాకల సముద్ర తీరంలో స్నేహితులతో కలిసి సరదాగా మునుగుతుండగా అలల ఉధృతికి గల్లంతైన సింగరాయకొండ శ్రీరాం నగర్‌కు చెందిన తమ్మిశెట్టి పవన్ (22) మృతిచెందాడు. యువకుడి మృతదేహం పాకల పరిధిలోని చెల్లమ్మగారి పట్టపుపాలెం తీరంలో శుక్రవారం లభ్యమైంది. మెరైన్, పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. తొలుత పవన్ ఆచూకీ కోసం గురువారం సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు తహసీల్దార్ రవి ఆధ్వర్యంలో పోలీసులు, మెరైన్ సిబ్బంది, మత్స్యకారులు తీరంలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి సమయంలో కూడా మెరైన్ పోలీసులు మృతదేహం ఎప్పుడు ఎక్కడ బయటకొస్తుందోనని తీరం వెంబడి తిరుగుతూనే ఉన్నారు. ఆయన పవన్ ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం నుంచి బోట్లలో ముమ్మరంగా గాలింపు చర్యలను ప్రారంభించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో చెలమ్మగారి పట్టపు పాలెం తీరంలో అలలపై తేలాడుతున్న పవన్ మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. గల్లంతైన పవన్ కోసం నిన్న మధ్యాహ్నం నుంచి తీరంలో రోదిస్తున్న వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఒక్కసారిగా మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా విలపించారు. చేతికి అందొచ్చిన చెట్టంత కొడుకును అకాల మృత్యువు రాకాసి అలల రూపంలో తీసుకెళ్లిందంటూ.. కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పోలీసులు కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తహసీల్దార్ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన గాలింపు చర్యలలో సీఐ చావా హజరత్తయ్య, సింగరాయకొండ ఎస్సై బి. మహేంద్ర, జరుగుమల్లి ఎస్సై బత్తుల మహేంద్ర, మెరైన్ ఎస్సై మస్తాన్ షరీఫ్, ఆర్ఐ వి.ప్రసాద్, సర్పంచ్ సైకం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు ఉచిత స్టడీ మెటీరియల్

ఒంగోలువిద్య, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాలలకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం ప్రతి పాఠశాలకు రెండేసి చొప్పున స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్, డీసీఈబీ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎస్సీఈఆర్టీ నుంచి వచ్చిన ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్ సాఫ్ట్ కాపీని ప్రింట్ చేయించి డీసీఈబీ ద్వారా ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు డీసీఈబీ కార్యాలయం నుంచి ఈ పుస్తకాలు పొందాలని కోరారు. ఉపాధ్యాయులను పంపేటప్పుడు వారి ద్వారా తప్పనిసరిగా హెచ్ఎంలు లెటర్ ఇచ్చి పంపాలని వారు కోరారు.

20న కనిగిరిలో గొర్రెల మార్కెట్ యార్డు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలోని గొర్రెల మార్కెట్ యార్డును ఈనెల 20వతేదీన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభిస్తారని జిల్లా గొర్రెలపెంపకం దారుల సహకార యూనియన్ చైర్మన్ తోడేటి గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశుసంవర్ధకశాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ టి.దామోదర్‌నాయుడు, రాష్ట్ర షీప్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రజిని కుమారి, జిల్లా జాయింట్ డైరెక్టర్ బేబీరాణి, ఇతర మండల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షులు, సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు

- ఫిబ్రవరి 2వ తేదీ వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆచార్య అప్పాజోస్యులకు ఎన్టీఆర్ జీవిత సాఫల్య పురస్కారం



వివరాలు వెల్లడిస్తున్న ఈదర హరిబాబు

ఒంగోలు కల్చరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి రోజైన శనివారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు చెప్పారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం వివిధ ప్రాంతాలకు చెందిన విద్వాంసులచే మంగళవాయిద్యాలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. శనివారం రాత్రి 7 గంటలకు ఎన్టీఆర్ సంస్మరణ సభ, కార్యక్రమాల ప్రారంభ సభ ఉంటుందని ఇందులో జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. అదేవిధంగా కోలాటం, భక్త ప్రహ్లాద నృత్యరూపకం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఇక రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ నాటక సమాజాలచే చీకటి పువ్వు, శ్రీకృష్ణ కమలపాలిక, నాట్యోద్భవం, రాత, గురి తప్పిన వేట, కమనీయం, శంకర విజయం, కొత్తపరిమళం, పక్కింటి మొగుడు, జారుడు మెట్లు, నర్తనశాల, శ్రీ వేంకటేశ్వర మహత్యం, రుక్మిణీ కల్యాణం, శ్రీనివాస కల్యాణం వంటి నాటికలు, నృత్య రూపకాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సాంస్కృతిక, ఇతర కార్యక్రమాలు

చెక్కభజన, నృత్య ప్రదర్శనలు, స్కూలు విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలు ఉంటాయని ఈదర హరిబాబు చెప్పారు. అదేవిధంగా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మొక్కల పెంపకం, మంచి ఆహార నియమాలు, అర్బన్ ఫామింగ్ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామని, మొక్కలు పెంపకంపై ఆసక్తి ఉన్న వారికి కూరగాయలు, వివిధ పూలమొక్కల విత్తనాలు, వాటికి అవసరమయ్యే ఎరువు మిక్చర్‌ను ఉచితంగా అందజేస్తామని ఈదర హరిబాబు తెలిపారు. ఒంగోలు పీవీఆర్ బాలుర ఉన్నత మైదానంలో కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, నాటికలకు, నృత్యరూపకాలకు, ఇతర ప్రదర్శనలకు ప్రత్యేకంగా స్టేజీ నిర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. ఇక ఈ సంవత్సరం ఎన్టీఆర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని చీరాలకు చెందిన ప్రముఖ నటులు, దర్శకులు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు ఇవ్వనున్నట్లు హరిబాబు వెల్లడించారు. ప్రజలు, కళాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసాద రావు, కార్యక్రమాల కో ఆర్డినేటర్ శివప్రసాద్, ఈదర గౌతంలు పాల్గొన్నారు.

19న గాన గంధర్వ తరంగిణి

- ఒంగోలులో తొలిసారిగా మెగా మ్యూజికల్ ఈవెంట్
- పాల్గొననున్న తెలుగు ఐడల్ కళాకారులు
- 600 మందికి ఏర్పాట్లు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో తొలిసారిగా మెగా మ్యూజికల్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక హైదరీ క్లబ్‌లో శుక్రవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ ఒంగోలులో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రముఖ గాయనీగాయకులు, సినిమా మ్యూజిక్ ఆర్కెస్ట్రా కళాకారులతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ పురుషోత్తమరావు మాట్లాడుతూ తెలుగు చిత్రాలలో ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన సంగీత సాహిత్య ప్రధానమైన పాటలతో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జూనియర్ ఎస్పీగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన చెన్నైకి చెందిన రాము, ఘంటసాల పాటలకు పెట్టింది పేరైన బాలకామేశ్వరరావు, గాయత్రీ నారాయణన్, నాదప్రియ వంటి ప్రముఖ గాయనీగాయకులు పాల్గొంటున్నట్లు నిర్వాహక కార్యవర్గ ప్రతినిధి మండవ శ్రీనివాసరావు తెలిపారు. హైదరీ క్లబ్ ఆవరణలో 19వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని సుమారు 600 మంది ప్రేక్షకులు చూసేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ సినీ నటులు రఘుబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారని, తెలుగు ఐడల్ ఫేమ్ కళాకారిణి వయోలిన్ కామాక్షి, ప్రముఖ వ్యాఖ్యాత మోహన్‌గాంధీలు వస్తున్నారని ఎస్.చంద్రమోహన్ రెడ్డి చెప్పారు. సమావేశంలో డాక్టర్ కొర్రపాటి సుధాకర్, పాటిబండ్ల ఆనందరావు, కారుసాల రామారావు పాల్గొన్నారు.



పశు ఆరోగ్యశిబిరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

20 నుంచి పశు ఆరోగ్యశిబిరాలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈనెల 20నుంచి 31వ తేదీ వరకు పశుఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ శిబిరాలలో పశువులకు, దూడలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందజేస్తామన్నారు. అన్ని గ్రామాల్లోని తెల్ల పశువులకు ముద్దచర్మవ్యాధి నివారణ టీకాలు, అన్ని పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని చెప్పారు. ఎదకు రాని, గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా చికిత్సలు అందిస్తామన్నారు. జిల్లాపశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ ఈ శిబిరాల వల్ల పాడిపశువుల, గొర్రెలు, మేకలకు ఉత్పాదక శక్తి పెరుగుతుందని, పశువులలో ఈతకు ఈతకు మధ్య వ్యవధి తగ్గి ఏడాదికి ఒక దూడను పొందవచ్చని తెలిపారు. అధికారులు ఉన్నారు.

21న జిల్లా స్థాయి రంగోత్సవ పోటీలు

ఒంగోలు విద్య, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మైనంపాడులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ఈనెల 21న జిల్లా స్థాయి రంగోత్సవ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 6నుంచి 12 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, చేతిరాత రంగోలి, జానపద నృత్యాలు, జాతీయ సమైక్యతపై డిజిటల్ పోస్టర్ల తయారీ, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్లోగన్ల తయారీ, భారతీయ సంస్కృతి, చరిత్ర విలువలుపై రోల్ ప్లే పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒక విద్యార్థి ఒక పోటీలో పాల్గొనేందుకు మాత్రమే అర్హులన్నారు. ఈ పోటీలకు అవసరమైన సామగ్రిని స్వయంగా సమకూర్చుకోవాలని, జిల్లాస్థాయిలో ప్రథమంగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులని, వివరాలకు 9502043307 సెల్ నంబరులో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ట్రెజరీ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ డైరీని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆవిష్కరించారు. అమరావతిలోని మంత్రి చాంబర్‌లో శుక్రవారం అసోసియేషన్ డైరీని ఆవిష్కరించగా ముందుగా అసోసియేషన్ రాష్ట్రనాయకుడు కాజా రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బొకే అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎలీషారాణి, పీవీ.నారాయణ, అంజనేయులు, వెంకటేశ్వర్లు, ఖాదర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'ఆటోలను రోడ్డుపై నిలపొద్దు'



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ పోలీసులు

కొండపి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కొండపిలో రోడ్లపై ఆటోలను నిలపొద్దని, రాకపోకలకు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని కొండపి సీఐ జి.సోమశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం ఉదయం రోడ్డుపై తమ వాహనాలను నిలిపిన ఆటో డ్రైవర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పరమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను, కూలీలను ఎక్కించుకుని వారిని ప్రమాదాల బారిన పడేయొవద్దని సీఐ హెచ్చరించారు. ఆటోల్లో అధిక సౌండ్‌తో మ్యూజిక్ సిస్టం ఏర్పాటు చేసుకుని ఇబ్బంది కలిగించొవద్దని ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా నడిచే ఆటోలను సీజ్ చేసి కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని సీఐ వారికి తెలిపారు.

విజేత దాసరెడ్డిపాలెం లెవెన్స్



నగదు బహుమతి అందుకుంటున్న దాసరెడ్డిపాలెం లెవెన్స్ జట్టు

కొండపి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మర్రిపూడి మండలం ధర్మవరంలో జరిగిన క్రికెట్ పోటీల్లో కొండపి పంచాయతీలోని దాసరెడ్డిపాలెం లెవెన్స్ జట్టు ప్రథమ బహుమతి సాధించింది. శుక్రవారం దాసరెడ్డిపాలెం లెవెన్స్ జట్టుకు నిర్వాహకులు 22 వేల రూపాయలు అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ధర్మవరం జట్టు 17 వేల రూపాయలు పొందింది. పోటీల్లో మొత్తం 50 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు.

వేగంగా ముత్యాలమ్మ దేవాలయ నిర్మాణం

మర్రిపూడి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడిలో ఆనంవారి ఇంటి ఆడపడుచుగా భావించే ముత్యాలమ్మతల్లి గ్రామదేవత దేవాలయ నిర్మాణ పనులు గత కొంతకాలంగా చురుకుగా సాగుతున్నాయి. స్థానిక చెరువు అలుగు కింద పురాతనమైన దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో మర్రిపూడి పడమర బజారుకు చెందిన యువకులు నూతన దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పూర్తిగా రాతి కట్టడాలతో దేవాలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. శిల్పకళా నైపుణ్యం ఉట్టిపడేలా రాతి స్తంభాలను రాయలసీమకు చెందిన శిల్పులు సర్వాంగ సుందరంగా చెక్కారు. దేవాలయ నిర్మాణానికి రూ.70 లక్షలకుపైగా ఖర్చుచేశారు. బస్టాండ్‌కు అతిచేరువలో ఉండటంతో దేవాలయం గ్రామానికి ప్రత్యేక శోభను ఇస్తోంది. మర్రిపూడికి చెందిన పలువురు సుదూర ప్రాంతాల్లో ఉన్నప్పటికి సహాయసహకారాలు అందిస్తున్నారు. ప్రస్తుతం దేవాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిపేందుకు నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

నాగులుప్పలపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన ఎయిడెడ్ పాఠశాల మాజీ కరస్పాండెంట్ శికా చినసోమయ్య వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు శుక్రవారం స్థానిక అరుణోదయ వృద్ధాశ్రమంలోని అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఎడిటర్ శికా సంధ్యా సుందర్, రిటైర్డ్ ఆర్టీసీ డిపో మేనేజరు నవీన్‌కుమార్, ఇరిగేషన్‌శాఖ సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, దయావతి, కొలకలూరి సురేష్, అనిత పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి వ్యాపారులు సహకరించాలి

- కమిషనర్ వెంకటేశ్వరరావు
- కర్నూలు రోడ్డు విస్తరణ పనుల ప్రారంభం



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధి పనుల్లో ప్రజలతోపాటు వ్యాపారులు సహకారం అందించాలని కమిషనర్ వెంకటేశ్వరరావు కోరారు. నగర సుందరీకరణలో భాగంగా, ట్రాఫిక్ సమస్య నియంత్రణకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కర్నూలురోడ్‌లో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పనులు పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ కాలువలు ఆక్రమించి వాటిపై ర్యాంపులు నిర్మించడంతో మురుగునీటి పారుదల వ్యవస్థకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా కర్నూలురోడ్‌లో నీరు నిలిచి చెరువును తలపిస్తోందన్న విషయాన్ని గుర్తించామని తెలిపారు. దీంతో సమస్య పరిష్కారం కోసం నగరంలోని పలు ప్రాంతాలలో రోడ్డు విస్తరణలు, ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణ చేపట్టినట్లు వివరించారు. అలాగే కర్నూలురోడ్‌లో కాలువలపై నిర్మించిన ర్యాంపులు, ఆక్రమణలు తొలగించి అందంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. నగర అభివృద్ధి కోసం కార్పొరేషన్ చేపట్టిన పనులకు వ్యాపారులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ర్యాంపులు తొలగించి, కాలువల్లో పూడిక తీసి రోడ్డు విస్తరణ చేస్తామని కమిషనర్ తెలిపారు. అంతకుముందు ఆయన నగరంలో పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. రోడ్లపై చెత్త లేకుండా చూడాలని, ప్రతిరోజు డ్రైనేజీలో పూడిక తీత పనులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్, ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఈ ఐసయ్య, ఏఈ చాణక్య, ఏసీపీ సుధాకర్, టీపీవో బాబూరావు, శానిటరీ సూపర్ వైజర్ బాబ్జి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

- కుమారుడికి గాయాలు

నాగులుప్పలపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా, ఆయన కుమారుడికి గాయాలైన సంఘటన చదలవాడలోని జాతీయరహదారిపై జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఒమ్మెవరం గ్రామానికి చెందిన అల్లంనేని ప్రతాప్‌కుమార్ (62), ఆయన కుమారుడు చంద్రఆదిత్య మోటార్‌సైకిల్‌పై శుక్రవారం ఉదయం ఒంగోలు వెళుతున్నారు. ఈక్రమంలో చదలవాడ ఎస్సీకాలనీ వద్దకు రాగానే అదే కాలనీకి చెందిన యువకులు అలవలపాటి శ్రీనివాసరావు, దేవరపల్లి వేణు మోటార్‌సైకిల్‌పై వేగంగా వెళుతూ ఒక్కసారిగా ప్రతాప్‌కుమార్, చంద్రఆదిత్యలు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొన్నారు. దీంతో ప్రతాప్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా అతని కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకొన్న 108 సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా అప్పటికే ప్రతాప్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలి

- ఎమ్మెల్యే బీఎన్‌కు వినతి

నాగులుప్పలపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి కనపర్తి ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీరు అందించాలని ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు కోరారు. ఈ మేరకు ఆయన కమిటీ సభ్యులు, రైతులతో కలిసి శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే గుండ్లకమ్మ ప్రాజెక్టు ఉన్నతాధికారులతో మాట్లాడారు. కనపర్తి ఎత్తిపోతల పథకం పరిధిలో వరి సాగు పొట్ట, వెన్నుదశలో ఉన్నందున నష్టం వాటిల్లకుండా వెంటనే దిగువకు నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రాజెక్టు ఉన్నతాధికారులను సైతం కమిటీ సభ్యులు కలిశారు. రైతులకు ఇబ్బంది లేకుండా దిగువకు నీటిని విడుదల చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు వెంకటకృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో నడిపినేని శేషగిరి, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



బాధితుడికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చలప్పాలెం గ్రామానికి చెందిన కరిచేటి రమేష్‌కు శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.2,23,429 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, జి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్, జనన ధ్రువీకరణ రిజిస్ట్రేషన్ వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 0-6 సంవత్సరాల లోపు చిన్నారుల ఆధార్, జనన ధ్రువీకరణపత్రాల రిజిస్ట్రేషన్ ఆయా సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసి వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో అంగనవాడీ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనన ధ్రువీకరణ పత్రం లేని వారికి నాన్ అవైల్‌బుల్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోల సమన్వయంతో ఆయా సమాచారాన్ని లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

మద్దిపాడులో కలుషిత నీటి సరఫరా

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న స్థానికులు



సంపులో వస్తున్న కలుషిత నీరు

మద్దిపాడు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు గ్రామ పంచాయతీలోని ఇళ్లకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు కలుషితంగా ఉంటోంది. కనీసం క్లోరినేషన్ కూడా చేయకుండా పంచాయతీ సిబ్బంది నీటిని సరఫరా చేయడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీ అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సమన్వయ లోపం తాగునీరు కలుషితం కావడానికి కారణమని ఉపసర్పంచ్ గుంటూరు కాశీరావు ఆరోపిస్తున్నారు. ఒకే మోటార్ కావడంతో నీరు ఇవ్వడంలో జాప్యం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సక్రంగా మంచినీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటిని క్లోరినేషన్ చేయాలి

-షేక్ దోలత్, స్థానికుడు

గ్రామంలోని కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీంతో పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్లోరినేషన్ చేయకపోవడంతో రోగాల బారినపడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటిని క్లోరినేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలి

సకాలంలో రేషన్ సరుకులు అందించాలి

సంతనూతలపాడు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): డీలర్లు సకాలంలో రేషన్ సరుకులు అందజేయాలని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 7 గంటల కల్లా సరుకులు అందించాలన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

మద్దిపాడు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు శుక్రవారం తెలిపారు. మద్దిపాడు సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఘన నివాళి అర్పించేందుకు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కనుక పార్టీ శ్రేణులు హాజరుకావాలని జయంత్‌బాబు కోరారు.

టంగుటూరులో..

టంగుటూరు: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాలు ఈనెల 18న టంగుటూరులో నిర్వహించనున్నారు. తెలుగుదేశం పార్టీ జండాల ఆవిష్కరణలు, సభలు, సమావేశాలు నిర్వహించాలని పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్ గ్రామీణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలురంగా ల్లో పోటీలు, అలాగే అదే రోజున మహిళలకు మసీదు సెంటర్‌లోనే ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పొగాకు ట్రాక్టర్ల ట్రాలీల డోర్లు తీయొద్దు

- సీఐ సోమశేఖర్ హెచ్చరిక

కొండపి, జనవరి17 (ఆంధ్రజ్యోతి): పొగాకు పచ్చాకు ట్రాక్టర్లు ట్రక్కులు డోర్‌లు తెరుచుకుని వస్తే సహించేది లేదని సీఐ సోమశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం కొండపికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన పచ్చాకు ట్రాక్టర్ల డ్రైవర్‌లకు ఆయన బస్టాండ్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. పచ్చాకు ట్రాక్టర్లు ట్రక్కుల డోర్‌లు తెరుచుకుని వాటిపై కూలీలు కూర్చుని వెళ్లడాన్ని గమనించిన సీఐ ఈ విధంగా ప్రయాణం వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని పచ్చాకు ట్రాక్టర్ల ట్రాలీల డోర్‌లు తెరవవద్దని కూలీలు కూడా డోర్‌లపై కూర్చోకుండా మరో వాహనంలో సురక్షిత ప్రయాణం సాగించాలని సీఐ సూచించారు.

పంటల పరిశీలన

కొండపి, జనవరి17 (ఆంధ్రజ్యోతి): 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో కంది పంటను, ఇలవర (నేతివారిపాలెం) గ్రామంలో మిరప పంటలను వ్యవసాయ అధికారులు శుక్రవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఏవో డి.విజయ్‌కుమార్ రైతులతో మాట్లాడుతూ మిరపలో కింది ముడత నివారణకు పోలీస్ అనేమందు ఎకరానికి 400 గ్రాములు పిచికారి చేసుకోవాలని సూచించారు. కందిలో పూత దశలో గూడు పురుగు, పిందె, కాయ దశలో కాయ ఈగ కనిపిస్తున్నదనీ, నివారణకు ఇండాక్సికాబ్ మందు 200 మి.లీ 200 లీటర్ల నీటికి కలిపి పూత, పిందె, కాయ తడిసేలా స్ప్రే చేసుకోవాలని రైతులకు సూచించారు.

వీరప్పకుంటలో చెత్తను తొలగించాలి



వీరప్పకుంట వద్ద ఉన్న చెత్తాచెదారం

మద్దిపాడు, జనవరి17 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని వంద సంవత్సరాల చరిత్ర ఉన్న వీరప్పకుంటలో చెత్తాచెదారం వేసి కాలుష్యం చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వర్షాల సమయంలో వీరప్పకుంటకు నీరు చేరి చుట్టుపక్కల 100 ఎకరాల్లో గతంలో రైతులు పంటలు సాగు చేసేవారు. అయితే గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో ఉన్న చెత్తాచెదారాన్ని ఆ కుంటలో వేసి పూడ్చివేయడంతో ఆ కుంట అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని ఉపసర్పంచ్ గుంటూరు కాశీరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది రైతులకు ఉపయోగమైన కుంట కొంతమంది స్వార్థపరులు రాజకీయ నాయకులు కలిసి దాదాపు ఏడు ఎకరాల చెరువుని అధ్వానంగా తయారు చేశారని చెప్పారు. ఈ చెరువును వినియోగంలోకి తెస్తే ఎంతో మంది రైతులకు ఉపయోగకరమని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువును బాగుచేసి రైతులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

రేపు జిల్లావ్యాప్తంగా నిరసనలు



మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమీత్‌షా వ్యాఖ్యలు నిరసిస్తూ ఈనెల 19న జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వామపక్షాల నాయకులు వెల్లడించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు ఎంఎల్.నారాయణ, ఎస్‌కే.మాబు, లలితకుమారి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరసన కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.వెంకట్రావు, కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

- తెల్లబాడు వద్ద రోడ్డులో ప్రమాదకరంగా గుంతలు



రోడ్డు మధ్యలో ఉన్న గుంతలు

మద్దిపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డులో అడుగుకో గుంత. వాహనదారులు ఆదమరిస్తే అంతే సంగతులు. ఆ గుంతలు అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. మద్దిపాడు మండలం తెల్లబాడు సమీపంలోని రోడ్డులో గల మలుపుల వద్ద అర కిలోమీటర్ పొడవునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. అవి వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు నడపలేని దుస్థితి తయారయ్యింది. ఒక గుంతను తప్పించబోయి మరో గుంతలో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొద్ది రోజుల కిందట ఇలపావులూరుకు చెందిన మోటార్‌సైక్లిస్టుకు మృతి చెందాడు. రాత్రి సమయాల్లో వాహనదారులకు తెలియక ఈ గుంతల్లో పడి గాయాలపాలవుతనాన్నరు. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధుడు మృతి.. పోలీసుల పరిశీలన

మద్దిపాడు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లిలో అనారోగ్యంతో వృద్ధుడు మరణించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం.. బెంగళూరుకు చెందిన వెల్లంపల్లి రామదాసు కొంత కాలం క్రితం గుండ్లాపల్లిలో సంచరిస్తూ సచివాలయ ఆవరణలో నిద్రిస్తుండేవాడు. అతను అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మరణించాడు. గ్రామ పంచాయతీ కార్యదర్శి లతీఫ్ ఫిర్యాదుమేరకు పోలీసులు మృతదేహాన్ని వెల్లంపల్లిలోని అతని బంధువులకు అప్పగించారు.

వాహనదారులకు జరిమానా

మద్దిపాడు, జనవరి17(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి చిన్నవంతెన ఎస్ఐ శివరామయ్య శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనదారులకు జరిమానా విధించారు.

క్రైం సమాచారం

రైలు కింద పడి యువకుడి మృతి

మార్కాపురం రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని రాయవరం పంచాయతీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన వెన్న తిమ్మారెడ్డి శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో మార్కాపురం వచ్చాడు. మార్కాపురం రైల్వేస్టేషన్ నుంచి గుంటూరు వెళుతున్న డోన్-గుంటూరు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన వైద్యశాలకు తరలించారు. ఆత్మహత్యకు కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇరువురి మధ్య ఘర్షణ

● ఒకరికి తీవ్ర గాయాలు

గిద్దలూరు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పాతకక్షల నేపథ్యంలో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అందిన సమాచారం మేరకు గిద్దలూరు మండలం దేవనగరం గ్రామానికి చెందిన కోటేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ మధ్యన ఘర్షణ నెలకొంది. దీంతో శ్రీకాంత్ కోటేశ్వర్‌రెడ్డిని తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన కోటేశ్వరరెడ్డిని గిద్దలూరు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అర్బన్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిమితికి మించి ఆటోల్లో అనుమతిస్తే కఠిన చర్యలు : సీఐ



ఆటో డ్రైవర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై సైదుబాబు

మార్కాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతిస్తే కఠినచర్యలు తప్పవని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు హెచ్చరించారు. తనను కలిసిన విలేకర్లతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రధానంగా రైతాంగం పనుల కోసం అప్పే, ట్రాలీ ఆటోల్లో ఇష్టారీతిన 20 నుంచి 50 మంది వరకు కూలీలు ప్రయాణిస్తున్నారన్నారు. అదేవిధంగా ట్రాక్టర్లలో కూడా ఎక్కువ సంఖ్యలో కూలీలు పొలాలకు కూలీ పనుల కోసం వెళ్తున్నారన్నారు. ఈ మధ్యకాలంలో పలుచోట్ల జరిగిన ప్రమాదాల్లో పలువురు కూలీలు మృత్యువాతపడినట్లు తెలిపారు. పరిమితికి మంచి ప్రయాణికులను అనుమతించడం నేరమన్నారు. ఆటోలు, ట్రాక్టర్లలో ఇకపై ఇలా ప్రయాణికులను, కూలీలను అనుమతిస్తే సహించేదిలేదని కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామన్నారు. ఆటో డ్రైవర్లతోపాటు కూలీలను తరలించే మేస్త్రీలపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

13 మంది ఆటో డ్రైవర్లపై కేసులు

మార్కాపురం : అధిక సంఖ్యలో ప్రయాణి కులను ఎక్కించుకుని నడుస్తున్న 13 ఆటోలపై పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో ఆటోలపై దాడులు నిర్వహించారు. ప్రధానంగా కూలీలను ఎక్కించుకుని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లివస్తున్న ఆటోల్లో సుమారు 20 మందికిపైగా ప్రయాణికులు ఉన్నట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఆటోల్లో ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు తప్పవని డ్రైవర్లను హెచ్చరించారు. ఆటోలను పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ప్రమాదభరిత ప్రయాణం వద్దు

ఎర్రగొండపాలెం రూరల్: వ్యవసాయ పనులకు ఒకే వాహనంలో కూలీలు అధిక సంఖ్యలో వెళ్లరాదని సీఐ ప్రభాకరరావు సూచించారు. వై.పాలెంలో ఆయన శుక్రవారం కూలీల ఆటోలను పరిశీలించారు. ప్రమాదకరంగా వెళుతూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. ఇటీవల ఇలాంటి ఇలా వెళుతూ అనేక మంది ప్రమాదాల బారిన పడ్డారన్నారు. అదిక సంఖ్యలో కూలీలను ఒకే వాహనంలో తీసుకెళితే ఆటో డ్రైవర్‌తో పాటు కూలీల మేస్త్రీలపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

21న జిల్లా స్థాయి రంగోత్సవ పోటీలు

ఒంగోలు విద్య, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పైనంపాడులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ఈనెల 21న జిల్లా స్థాయి రంగోత్సవ పోటీలు నిర్వహిస్తు న్నట్లు ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 6నుంచి 12 తరగతి వరకు చదువుతు న్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, చేతిరాత రంగోలి, జానపద నృత్యాలు, జాతీయ సమైక్యతపై డిజిటల్ పోస్టర్లు తయారీ, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్లోగన్ల తయారీ, భారతీయ సంస్కృతి, చరి త్ర విలువలపై రోల్ ప్లే పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒక విద్యార్థి ఒక పోటీలో పాల్గొనేందుకు మాత్రమే అర్హులన్నారు. ఈ పోటీలకు అవసర మైన సామగ్రిని స్వయంగా సమకూర్చుకోవాలని, జిల్లాస్థాయిలో ప్రథమంగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులని, వివరాలకు 9502043307 సెల్ నంబరులో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

మద్యం ప్రియులపై బెల్టు బాదుడు

● అధికారుల కనుసన్నలోనే బెల్టు దుకాణాలు ● గ్రామగ్రామాన మద్యం పరవళ్లు ● ప్రత్యేక ముద్రతో విక్రయాలు



మద్యం బాటిల్‌పై ఎస్‌పీ అని వేసిన ముద్ర

కొనకనమిట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మద్యం పరవళ్లు తొక్కుతోంది. గ్రామగ్రామాన బెల్టుదుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఎక్సైజ్ అధికారుల కనుసన్నలోనే మద్యం దుకాణదారులు బెల్టుషాపులను నిర్వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తు తున్నాయి.

గ్రామాల్లో మద్యం అమ్మకాలు మూడు బ్రాందీలు, ఆరు విస్కీలుగా అన్న చందంగా జోరుగా సాగుతున్నాయి. దీంతో గ్రామాలలో అశాంతి అలజడులు నెలకొంటున్నాయి. బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సాక్షత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరిస్తున్నప్పటికీ స్థానిక అధికారులు బేఖాతరు చేస్తున్నారు. మందుబాబులు మద్యంతో తూగుతుంటే అధికారులు లంచాల మత్తులో జోగుతున్నారు.

మండలంలో పెద్ద గ్రామాలైన కొనకనమిట్ల, పెదారికట్ల, గొట్లగట్టు గ్రామాల్లో లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే మద్యం దుకాణదారులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. అన్ని గ్రామాల్లో యథేచ్ఛగా బెల్ట్‌షాపులను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 45 వరకు బెల్ట్‌షాపులు ఉన్నట్లు సమాచారం. బెల్టు దుకాణాలకు అక్రమంగా ఆటోలలో



ఆటోలో బెల్ట్‌షాపులకు విక్రయిస్తున్న మద్యం

మద్యం తరలిస్తున్నారు. బెల్టు దుకాణాలకు వేసే మద్యంసీసాలపై ప్రత్యేకంగా ఎస్‌పీ అని ముద్ర వేసి విక్రయించడం గమనార్హం. అయితే అధికారులు ముద్ర వేయవద్దని లైసెన్స్ దారులకు చెప్పారు. దీంతో ఇటీవల ముద్రలేకుండా మద్యాన్ని బెల్టు దుకాణాలకు సప్లయ్ చేస్తున్నారు. ఇలా బెల్ట్‌షాపులకు వచ్చి మద్యానికి క్వార్టర్‌కు రూ.20 అదనంగా బెల్టుదుకాణదారుల వద్ద ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇక డిమాండ్‌ను బట్టి మరి కొంత అదనంగా బెల్ట్‌దుకాణం దారుడు విక్రయిస్తు న్నాడు. ఇలా వచ్చే అక్రమార్జనలో తిలపాపం తాపిడికెడు అన్నచందంగా స్థానిక అధికారులకు ముట్టచెప్తున్నారు. దీంతో గ్రామాల వైపు అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండడంతో రాత్రిబవళ్ళు మందుబాబులు గ్రామాల్లో తాగితూలుతూ అలజడులను సృష్టిస్తున్నారు. అధికారులు బెల్టు దుకాణాలను కట్టడి చేయకపోతే శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది.

సమాచారం ఇస్తే దాడి చేయిస్తారు!

ఇటీవల ఒక గ్రామంలో బెల్టుషాపుకు ఆటోలో మద్యం చేస్తున్నారు. దీన్ని ఓ వ్యక్తి విడియో చిత్రీకరించి అధికారులకు అందించారు. దీంతో అతనిపై బెల్టుదుకాణదారుడు దౌర్జన్యానికి పాల్పడ్డారు. అధికారులే ఉద్దేశ్యపూర్వకంగా దాడి చేయించినట్లు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు కూడా నిమ్మకునిరెత్తినట్లు వ్యహరించారు. దీంతో బెల్టుదుకాణదారుల ఆగడాలు మితిమీరి పోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో బెల్టుషాపులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హత ఉన్న దివ్యాంగులు భయపడవద్దు

భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే ముత్తుముల



దివ్యాంగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోకొరెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న దివ్యాంగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. శుక్రవారం పలువురు దివ్యాంగులు ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డిని కలిసి అర్హత లేకున్నా దొంగ సర్టిఫికేట్లు పొంది ఫించన్లు పొందుతుండడం వలన నిజమైన దివ్యాంగులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని దివ్యాంగుల సంఘం అధ్యక్షులు కోడూరి వెంకటస్వామి తదితరులు ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో రూ.15వేలు పొందుతున్న దివ్యాంగులు 266 మంది ఉన్నారని, వీరిలో అనేక మంది అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే అశోకొరెడ్డి కంటికి కనిపించే దివ్యాంగులకు మాత్రం ఎట్టి పరిస్థితిలో అన్యాయం జరుగద న్నారు. అర్హత ఉన్న వారు ఆందో ళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అర్హత లేకున్నా సర్టిఫికేట్లు పొంది ఫించన్లు పొందుతున్న నకిలీలను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో విరిగినేని గోపాల్, రమణయ్య, నరసయ్య పాల్గొన్నారు.

క్రీడలపై ప్రత్యేక దృష్టిపెట్టండి

పొదిలి సీఐ వెంకటేశ్వర్లు



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : క్రీడలపై ప్రత్యేక దృష్టిసారిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోవడం సులభతరమౌతుందని పొదిలి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పొదిలి విశ్వనాథపురం జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి జూనియర్ సెపక్‌తక్రా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశ నుంచి క్రీడలపై మక్కువ పెంచుకొని క్రీడలలో పట్టు సాధిస్తే భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. అంతేకాకుండా క్రీడల వలన ప్రతి ఒక్కరికి శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని చెప్పారు. అనంతరం ఈక్రీడాపోటీలను ప్రారంభించారు. ఎస్ వేమన, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్, టీడీపీ రాష్ట్రకార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ సర్పంచ్ జిలాని, సెపక్‌తక్రా నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



రైతులకు సూచనలిస్తున్న ఏవో వెంకటేశ్వర్లు

తర్లుపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కలుజువ్వలపాడు, ఓబాయపల్లెలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మిర్చి, మినుము, కంది, శనగ పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకోవటం వలన ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తిస్తాయన్నారు. ఫసల్‌బీమా చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ జె.సౌజన్య, గ్రామ వ్యవసాయ సహాయకులు బొర్రయ్య, మల్లికార్జున్, మనోజ్, రైతులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

గిద్దలూరు టౌన్ : రబీసీజన్‌కు సంబంధించి రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏవో విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కెఎస్‌పల్లె, ఉప్పలపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకోవడం ద్వారా అతివృష్టి, అనావృష్టి వచ్చినప్పుడు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ద్వారా అందించే నష్టపరిహారం, పంటలబీమా, మద్దతుధర, సున్నావడ్డీ, తదితర ప్రయోజనాలు అందాలంటే ఈ-పంట నమోదు చేసుకుని ఉండాలన్నారు. సూక్ష్మనీటి యాజమాన్య అధికారి మోహనకృష్ణ మాట్లాడు తూ నీటిఎద్దడి కారణంగా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణం, అధిక దిగుబడితో పంటలు పండించాలంటే తప్పనిసరిగా డ్రిప్ వినియోగించుకోవాలన్నారు. 90 శాతం రాయితీతో పరికరాలు అంది స్తున్నట్లు తెలిపారు. తొలుత ఆయా గ్రామాలలో సాగులో ఉన్న పంట పొలాలు మొక్కజొన్న, తదితర పంటలను పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పట్టుపరిశ్రమ, ఉద్యాన సహాయకులు సుబ్బారావు, ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని నికరంపల్లి గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం ఉద్యానవన శాఖ అధికారి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేస్తున్న బత్తాయి, నిమ్మ, మిరప పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మిరపలో వచ్చే తెగుళ్ల నివారణకు ఉపయోగించవలసిన పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ డీసీఎం ఓబయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు జక్కి గణేష్ సాగర్, పశుసంవర్ధక సహాయకులు దండా రవీంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

● కుమారుడికి గాయాలు

నాగులుప్పలపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా, ఆయన కుమారుడికి గాయాలైన సంఘటన చదలవాడలోని జాతీయరహదారిపై జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలం లోని ఒమ్మెవరం గ్రామానికి చెందిన అల్లంనేని ప్రతాప్‌కుమార్ (62), ఆయన కుమారుడు చంద్రఆదిత్య ద్విచక్రవాహనంపై శుక్రవారం ఉదయం ఒంగోలు వెళుతున్నారు. ఈక్రమంలో చదలవాడ ఎస్సీకాలనీ వద్దకు రాగానే అదేకాలనీకి చెందిన యువకులు అలవల పాటి శ్రీనివసరావు, దేవరపల్లి వేణు మోటార్‌సైకిల్‌పై వేగంగా వెళుతూ ఒక్కసారిగా ప్రతాప్‌కుమార్, చంద్రఆదిత్యలు ప్రయాణిస్తున్న వా హనాన్ని ఢీకొన్నారు. దీంతో ప్రతాప్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా అతని కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకొన్న 108 సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా అప్పటికే ప్రతాప్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పంటల పరిశీలన

కొండపి, జనవరి17 (ఆంధ్రజ్యోతి): 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో కంది పంటను, ఇలవర (నేతివారిపాలెం) గ్రామంలో మిరప పైరను ఏవో డి.విజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. తెగుళ్ల నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలి

నాగులుప్పలపాడు జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి కనపర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని రైతుల పొలాలకు సాగునీరు అందించాలని ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు కోరారు. ఈ మేరకు ఆయన కమిటీ సభ్యులు, రైతులతో కలిసి శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే గుండ్లకమ్మ ప్రాజెక్టు ఉన్నతాధికారులతో మాట్లాడారు. కనపర్తి ఎత్తిపోతల పథకం పరిధిలో వరిసాగు పొట్ట, వెన్నుదశలో ఉన్నందున రైతులకు నీటి సమస్యతో నష్టం వాటిల్లకుండా వెంటనే దిగువకు నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రాజెక్టు ఉన్నతాధికారులను సైతం కమిటీ సభ్యులు కలిశారు. నీటిని దిగువకు విడుదల చేసి రైతుల సమస్యను పరిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారన్నారు. కార్యక్రమంలో నడిపినేని శేషగిరి, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు శ్రీకృష్ణదేవరాయులు



శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి మరువని మహనీయుడు, ప్రజాపాలనలో ఆదర్శనీయుడు శ్రీకృష్ణ దేవరాయులు అని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు పిన్నిక లక్ష్మీప్రసాద్ అన్నారు. స్థానిక బీసీ భవన్‌లో శ్రీకృష్ణ దేవరాయల జయంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి బీసీ సంఘ నాయకులు నివాళులర్పించారు. కర్నాటక, తెలుగు రాష్ట్రాలలో శ్రీకృష్ణ దేవరాయలు అనేక ఆలయాలు నిర్మించారని, మార్కాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయం కూడా శ్రీకృష్ణ దేవరాయలు నిర్మించిందేన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు వీ.శ్రీనివాస్, ఐ.రంగస్వామి, ఏ.రాజగోపాల్, బి.చిన్న వెంకటేశ్వర్లు, పిన్నిక చక్రపాణి, ఓ.లక్ష్మీ నారాయణ, పృధ్వి, రామకృష్ణ, వెంకటేష్, అల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాలలో ఆధార్‌కేంద్రం ఏర్పాటు చేయాలి

● కలెక్టర్‌కు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి విజ్ఞప్తి

గిద్దలూరుటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాలలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విజ్ఞప్తి చేశారు ఆ మేరకు వినతిపత్రం అందచేశారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే అశోకొరెడ్డి కలెక్టర్‌ను కలిసి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించారు. ఆధార్‌కార్డులు లేకపోవడంతో పలువురు గిరిజనులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతాలలో అనేక కుటుంబాలు ప్రభుత్వ లబ్ధికి దూరం అవుతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి ఆధార్‌కార్డులు అందజేయాలని సూచించారు. నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీ కాలనీలలో సిమెంటు రోడ్లు, మురుగుకాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. పట్టణంలో సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఎస్‌టీపీ స్కీమ్ నిధులు మంజూరు చేయాలన్నారు. రానున్న వేసవికాలంలో నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అశోకొరెడ్డికి హామీ ఇచ్చారు.

నేడు ఎన్‌టీఆర్ వర్ధంతి

టీడీపీ వ్యవస్థాపకులు, నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు మహా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు భారీగా హాజరు కానున్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలి



బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ నరసింహులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 17 ఆంధ్రజ్యోతి : ఆర్టీసీ సిబ్బంది అంతా ఆర్టీసీ అభివృద్ధిలో తోడ్పడాలని మార్కాపురం డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సదందర్భంగా నరసింహులు మాట్లాడుతూ.. ప్రజల సేవకోసం ఆర్టీసీ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రయాణికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఆర్టీసీ అభివృద్ధికి కావాల్సిన నూతన పద్ధతులు అవలంభించాలన్నారు. బెస్ట్ ఈపీకే తీసుకొచ్చిన డ్రైవర్లు, కండెక్టర్లకు నగదు అవార్డు అందించారు. ఎస్.రాములు టి.వెంకటేశ్వర్లు, టీవీఎస్ రావు. జేఎస్ వాసులు, ఆర్‌సీహెచ్ పాపయ్య, ఎమ్ఎస్ వాసులు కండెక్టర్లు, వైవీ కాశయ్య, ఆర్ఎం నాయక్‌లకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ బలోపేతానికి కృషి చేయాలి

● జిల్లా అధ్యక్షులు ఐజక్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

మార్కాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగ సమాఖ్య (ఎంఈఎఫ్) బలోపేతానికి కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కత్తి ఐజక్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాదిగ ఉద్యోగులు, ఎంఆర్‌పీఎస్ , ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐజక్ మాట్లాడుతూ మాదిగ ఉద్యోగులు మరిత సంఘటితం కావాలన్నారు. ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో జరుగుతున్న పోరాటానికి సహకారాన్ని అందించాలన్నారు. మాదిగల చిరకాల కోరిక ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు అన్నివిధాలుగా అండదండలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ముందుగా మాజీ పార్లమెంటు సభ్యులు మంద జగన్నాథం మృతికి నివాళులు అర్పించారు. అనంతరం మాదిగ ఉద్యోగుల సమాఖ్య నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి శేషయ్య, రాష్ట్ర నాయకులు సిరిగిరి కుమార్, రామారావు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు పందిటి కాశీరావు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాచీటి సంజీవ్‌కుమార్, కోశాధికారి మంద ప్రసాద్, ఇ.అనోజిరావు, జేమ్స్ ప్రభాకర్, లూకా పోలయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కంభం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం తురిమెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవాసంఘం అధ్యక్షులు పగిడి రమణ తెలిపారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా నంద్యాల శాంతిరాం వైద్యబృందంతో తురిమెళ్లలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. చెవి, ముక్కు, గొంతు, ఆర్థో, చిన్నపిల్లలు, జనరల్ వైద్యనిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందచేశారు. 300 మందికి పైగా రోగులను పరీక్షించారు. అంతకుముందు కందులాపురంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బలిజ సేవాసంఘం కార్యదర్శి ఉదయగిరి మల్లికార్జునరావు, టి.వెంకటేశ్వర్లు, సోమిశెట్టి నారాయణ, గోవిందయ్య, పార్థ శంకర్, బెల్లంకొండ రాయుడు, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతికి విస్తృత ఏర్పాట్లు

దర్శి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతికి దర్శి నియోజకవర్గంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం అన్ని మండలాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నారు. పలు గ్రామాల్లో కూడా ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తాళ్లూరులో శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పాల్గొంటారని తెలిపారు. అలాగే, తూర్పుగంగవరంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు టీడీపీ గ్రామ అధ్యక్షుడు రామలక్ష్మయ్య తెలిపారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ముండ్లమూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసవాపురం గ్రామంలో టీడీపీ నాయకుడు కట్టా చినవెంకంబొట్లు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించనున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ పాల్గొంటారని తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

కనిగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ మనస్తాపానికి గురైన మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటన శుక్రవారం రాత్రి పట్టణ సమీపంలోని అర్బన్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బత్తుల అనంతమ్మ (55) మూడేళ్ళుగా చికిత్స పొందుతున్నా తగ్గకపోవడంతో మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు అజయ్ ఇంటికి వచ్చేసరికి తల్లి ఉరివేసుకున్న విషయాన్ని గమనించి కిందకుదించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి



యశ్వంత్(ఫైల్)

కురిచేడు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం కురిచేడులో చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. మండలంలోని నమశ్శివాయపురం గ్రామానికి చెందిన పాణ్యం యశ్వంత్(24) గురువారం స్నేహితులతో కలసి పొట్లపాడులోకి రామయోగి స్వామి తిరునాళ్ళకు వెళ్ళి రాత్రికి ఇంటికి తిరిగి వచ్చాడు. రాత్రి 11 గంటల సమయంలో ఫోన్ రావడంతో స్నేహితులను వదిలి యశ్వంత్ ఒక్కడే తన ద్విచక్రవాహనంపై కురిచేడు వెళ్లాడు. శుక్రవారం తెల్లవారు జామున యశ్వంత్ తండ్రి ఫోన్ చేస్తే రింగ్ అయినా ఎవరూ జవాబు చెప్పలేదు. మరలా ఉదయం 6 గంటల సమయంలో ఫోన్ చేయగా ఓ మహిళ ఫోన్ ఎత్తి మా ఇంటి మీద పడి ఉన్నాడని తెలిపారు. దీంతో ఆందోళనతో కుటుంబ సభ్యులు వచ్చి చూడగా యశ్వంత్ మృతి చెంది ఉన్నాడు. మృతిపై అనుమానాలు ఉన్నట్లు యశ్వంత్ తండ్రి వీరయ్య పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని తెలిపారు. మృతదేహం పక్కనే పురుగు మందు డబ్బా ఉందని తెలిపారు. పురుగు మందు తాగాలంటే పక్కన గ్లాసు కానీ, కూల్ డ్రింక్ కానీ ఉంటుందని, అలాంటి ఆనవాళ్ళు లేవన్నారు. తన కుమారుడు మృతిపై ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. నిజానిజాలు పోలీసులు వెలికితీయాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు. సంఘటనా స్థలాన్ని త్రిపురాంతకం సీఐ అసన్ పరిశీలించారు.

బెల్ట్ షాపులు తొలగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆవులమంద మహిళలు

» మహిళల వినతి

కురిచేడు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులను తొలగించాలని మండలంలోని ఆవులమంద గ్రామ మహిళలు శుక్రవారం తహసీల్దార్, సీఐకి వినతిపత్రాలు అందజేశారు. మద్యం దుకాణానికి వెళ్ళి తమ గ్రామానికి మద్యం పంపవద్దంటూ హెచ్చరించారు. ఆవులమంద గ్రామంలో 8 బెల్ట్ షాపులు ఉన్నాయి. తమ భర్తలు మద్యం తాగివచ్చి ఇబ్బందులు పెడుతున్నారంటూ శుక్రవారం ఉదయం ఆవులమంద గ్రామ మహిళలు పెద్దసంఖ్యలో కురిచేడుకు వచ్చారు. తహసీల్దార్ రజనీకుమారి, త్రిపురాంతకం సీఐ అసన్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఓ మద్యం దుకాణానికి వెళ్ళి మా గ్రామానికి మద్యం పంపవద్దంటూ హెచ్చరించారు.

ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

ఆవులమందలో శుక్రవారం సాయంత్రం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆగ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో కురిచేడుకు వచ్చి తమ గ్రామంలో బెల్ట్ షాపులను తొలగించాలని తహసీల్దార్, సీఐలకు వినతి పత్రాలు ఇచ్చారు. ఈక్రమంలో ఎక్సైజ్ పోలీసులు ఆవులమందలో తనిఖీలు నిర్వహించారు. ఈవిషయాన్ని ముందే ఊహించిన బెల్ట్ షాపుల నిర్వాహకులు ఎవరికి వారే సర్దుకున్నారు దీంతో ఎక్సైజ్ పోలీసులకు మద్యం పట్టుబడలేదు. త్వరలో మరలా తనిఖీలు నిర్వహిస్తామని దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.



బండ లాగుతున్న ఎడ్లు

కోలాహలంగా ఎడ్ల బలప్రదర్శన

కురిచేడు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్లపాడు గ్రామంలో రామయోగి స్వామి తిరునాళ్ళ సందర్భంగా శుక్రవారం ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన నిర్వహించారు. సీనియర్ విభాగంలో పోటీలు నిర్వహించారు. మొత్తం 9 ఎడ్ల జతలు పోటీలలో పాల్గొన్నాయి. కోలాహలంగా జరిగిన ఎడ్ల బలప్రదర్శన ప్రజలకు ఆకట్టుకున్నాయి. శనివారం ఆరుపళ్ళ విభాగంలో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

పామూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వరి పైరును సాగుచేసిన రైతులు చీడ పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చునని కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు ఈవీ రమణ సూచించారు. శుక్రవారం మండలంలోని కోడిగుంపుల, చింతలపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా చీడపీడల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏలు సుబ్బారావు, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

కందిలో ఆకుచుట్టు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

పీసీపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కందిలో ఆకుచుట్టు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏవో కె.ప్రకాశరావు అన్నారు. మండలంలోని చింతగుంపల్లిలో శుక్రవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాయదశలో ఉన్న కందిలో అక్కడక్కడా ఆకుచుట్టు పురుగు, కాయతొలుచు పురురులు కనిపిస్తున్నాయన్నారు. ఈ పురుగుల నివారణకు 100ఎంఎల్ పరిమాణం గల యాంప్లిగో అనే రసాయనిక మందు, ఒక కేజీ 19-19-19ను కలిపి స్ప్రే చేస్తే పురుగులను నిర్మూలించవచ్చునని చెప్పారు.

ఐఆర్ ప్రకటించకపోతే ఉద్యమం

పామూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడి వెంటనే 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ని ప్రకటించక పోతే ఉద్యమం తప్పదని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు రఘునాధరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఒమెగా కళాశాలలో జరిగిన శిక్షణ తరగతులకు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ 11వ వేతన సవరణ గడువు ముగిసి 18 నెలలు కావస్తున్నా ఇంతవరకు 12వ వేతన సవరణ ఊసేలేదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పి.రమణారెడ్డి, బి.వెంగళరెడ్డి, చల్లా శ్రీనివాసులు, నాగేంద్రకుమార్, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

తాళ్లూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులతో చేతికి వచ్చిన పంటలు దెబ్బతిని రైతులు ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. శుక్రవారం నాగంబొట్ల పాలెం, తూర్పుగంగవరం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాల సాగుతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రకృతి కషాయాలను వాడి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి సాగు ఇన్‌చార్జ్ పి.నరసింహం, ఐసీఆర్‌పీ వాణి, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడికి రిమాండ్

పామూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పామూరులో ఇటీవల జరిగిన ఆలయాల హుండీల చోరీ కేసుల్లో నిందితుడికి కనిగిరి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ టి.కిశోర్‌బాబు తెలిపారు. ఇటీవల పామూరు పట్టణంలోని ఆలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఆలయ కమిటీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. చోరీలకు పాల్పడిన నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం కొండ్రాజుపల్లె గ్రామానికి చెందిన అల్లూ బాలకృష్ణను శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.18,790ను స్వాధీనం చేసుకొని కనిగిరి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించడంతో, దర్శి సబ్‌జైలుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

వైద్యశాల అభివృద్ధికి విరాళం

పామూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి చూపిస్తున్న చొరవకు మద్దతుగా పామూరు మండలం పుట్టనాయుడుపల్లి గ్రామానికి చెందిన రాయవరపు మాల్యాద్రిచౌదరి దంపతులు తమ వంతుగా రూ.10,116 విరాళం ప్రకటించారు. శుక్రవారం కనిగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఉగ్రను మర్యాదపూర్వకంగా కలిసి విరాళం నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాయవరపు ఝన్సీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం

దొనకొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం దొనకొండ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆసంఘం మండల అధ్యక్షుడు కాళ్ల హనుమంతరావు అధ్యక్షతన శుక్రవారం స్థానిక రామాలయంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పరుచూరి రమేష్, ఉపాధ్యక్షుడిగా చీరెళ్ల శేషుకుమార్, కార్యదర్శిగా మాడిశెట్టి రాజు, సహాయ కార్యదర్శిగా చీతిరాల సురేష్, కోశాధికారిగా నూరె సాయి, మరికొందరు సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

మానవత్వం చాటుకున్న టీడీపీ నాయకుడు

దర్శి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కాళ్లకు గాయాలై వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేక, ఆకలితో యాచిస్తున్న ఒక నిరుపేదపై టీడీపీ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి మానవత్వం చాటుకున్నాడు. దర్శిలోని ఒక టీస్టాల్ వద్ద కాలికి గాయంతో బాధపడుతున్న వ్యక్తిని, దీనంగా యాచిస్తున్న అతని తల్లిని గుర్తించిన వెంకన్నచౌదరి వెంటనే స్పందించాడు. మెడికల్ షాప్ నుంచి మందులు తెచ్చి స్వయంగా అతని గాయాలకు ప్రథమ చికిత్స చేశాడు. వారిద్దరికీ భోజనం పెట్టించి, ఇద్దరికీ కొత్త బట్టలు కొనుగోలు చేసి అందజేశారు. ఖర్చులకు కొంతమేర ఆర్థికసాయం చేశారు.

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం

దర్శి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం వద్ద శుక్రవారం వరిగడ్డి ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధమైంది. పొదిలి మండలం చిదామరపల్లి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి దర్శిలో వరిగడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తీసుకెళుతున్నాడు. ఈక్రమంలో రామచంద్రాపురం గ్రామం వద్ద విద్యుత్ తీగలు వరిగడ్డిని అంటుకోవటంతో మంటలు లేచాయి. ప్రమాదం గుర్తించిన ట్రాక్టర్ డ్రైవర్ వరిగడ్డిని కింద పడేశాడు. ట్రాక్టర్‌ను పక్కకు తప్పించాడు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించటంతో దర్శి నుంచి హుటాహుటిన సిబ్బంది వెళ్లి మంటలు ఆర్పటంతో ప్రమాదం తప్పింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 18-1-2025 | Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | బాపట్ల సిటీ

21 నుంచి యూజీ డిగ్రీ వన్ టైం ఆపర్చునిటీ పరీక్షలు

పెదకాకాని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో యూజీ డిగ్రీ ఇయర్ ఎండ్ కోర్సులకు సంబంధించి వన్ టైం ఆపర్చునిటీ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాద రావు శుక్రవారం తెలిపారు. బీఏ, బీకాం(జనరల్), బీకాం (రీస్ట్రక్చర్), బీకాం (ఒకేషనల్), బీబీఎం, బీసీఏ, బీఎస్సీ, బీఏవోఎల్ పరీక్షల షెడ్యూలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాలకు సంబంధించిన అభ్యర్థులకు గుంటూరులోని ఏసీ కళాశాల, అలాగే ఉమ్మడి ప్రకాశం జిల్లా కళాశాలల విద్యార్థులు ఒంగోలులోని రాఘవ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా ప్రాక్టికల్, ఇంటర్నల్స్, వైవా, ప్రాజెక్ట్ వంటి పరీక్షలు ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు గుంటూరులోని ఏసీ కళాశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాక్టికల్ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణ, ఉమ్మడి ప్రకాశం జిల్లాల అభ్యర్థులు హాజరు కావాలని ఆయన సూచించారు.

73 రోజులు.. రూ. 363.25 కోట్లు

పురాల్లో పన్ను బకాయిలు రూ.363.25 కోట్లు.. 73 రోజుల్లో వసూలు చేయాలి. సెలువు దినాల్లోనూ మున్సిపల్ ఉద్యోగులు పని చేస్తే రోజుకు రూ.4.97 కోట్లు వసూలు చేయాలి. లేదంటే నూరు శాతం పన్నుల వసూళ్ల లక్ష్యం నెరవేరదు. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో అధికారుల పనితీరు చూస్తే నిర్దేశించిన లక్ష్యాల మేర పన్నుల వసూళ్లపై అనుమానాలు వస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా అధికారులు అలసత్వం వీడకపోవడం వల్లే బకాయిలు పేరుకుపోతున్నాయని అర్థమవుతోంది. తాజాగా మున్సిపల్ పరిపాలన డైరెక్టర్(డీఎంఏ) నూరు శాతం పన్ను వసూలు చేయాలని పుర అధికారులకు లక్ష్యాలు నిర్దేశించారు. అయినా వారిలో ఆశించిన మేర స్పందన కానరావడంలేదన్న ఆరోపణలున్నాయి. పన్ను వసూలు జరుగుతున్న తీరు నూరు శాతం సాధించేదిగా లేదనే చెప్పాలి. మున్సిపాల్టీలలో రెవెన్యూ విభాగం, వార్డు సచివాలయ కార్యదర్శులు ఇలా సిబ్బంది పుష్కలంగా ఉన్నా పన్ను వసూళ్లలో చతికిల పడుతున్నారన్న విమర్శలున్నాయి.



రాష్ట్రంలోనే అత్యధికంగా పన్ను వసూలుచేసిన వినుకొండ మున్సిపాలిటీ

ఆస్తి పన్ను వసూళ్లు(రూ.కోట్లలో)..

మున్సిపాలిటీ	వసూలు	వసూలు	శాతం
పల్నాడు జిల్లా :-			
నరసరావుపేట	17.86	7.14	40.01
చిలకలూరిపేట	17.21	4.82	28.03
వినుకొండ	5.14	4.56	88.58
సత్తెనపల్లి	7.71	3.21	41.61
మాచర్ల	5.98	2.71	45.33
పిడుగురాళ్ల	5.72	3.56	62.17
దాచేపల్లి	2.14	1.18	55.07
గురజాల	1.56	0.72	46.27
బాపట్ల జిల్లా :-			
రేపల్లె	5.71	3.31	57.85
బాపట్ల	13.18	4.36	33.10
అద్దంకి	5.01	3.11	61.97
చీరాల	12.41	6.82	54.92
గుంటూరు జిల్లా :-			
గుంటూరు కార్పొరేషన్	296.11	89.26	30.14
పొన్నూరు	6.12	3.39	55.40
మంగళగిరి-తాడేపల్లి	37.24	26.88	72.18
తెనాలి	26.85	12.07	44.95

- పురాల్లో పన్ను వసూలు సాధ్యమేనా
- రోజుకు రూ.4.97 కోట్లు వసూలు లక్ష్యం
- పన్నుల వసూళ్ల తీరుపై డీఎంఏ ఆగ్రహం
- బకాయిలపై మున్సిపల్ అధికారుల సాగదీత
- వసూళ్లలో రాష్ట్రంలోనే వినుకొండ ప్రథమ స్థానం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పన్నులు.. పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు. ఆరు నెలలకు ఒకసారి ప్రజల నుంచి ఆస్తి, నీటి పన్నుల రూపంలో వసూలు చేయాల్సిన బాధ్యత మున్సిపాలిటీలదే. ఆయా పన్నులను సకాలంలో బకాయిలు లేకుండా వసూలు చేసి అభివృద్ధి పనులకు, సిబ్బంది జీతాలకు వినియోగించుకోవాలి. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పుర పాలకులు పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నా వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలున్నాయి. పురాల్లో పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తాండవిస్తోందనేందుకు ప్రస్తుతం పేరుకుపోయిన బకాయిలే నిదర్శనం. మార్చి 31వ తేదీ కల్లా అంటే 73 రోజుల్లో రూ.363.25 కోట్లు పన్ను వసూలు చేయాలి. ఈ మేరకు పన్ను వసూలు సాధ్యమేనా అంటే..

(మిగతా 2వ పేజీలో)

సమీక్షిస్తున్నా.. సాచివేత

మార్చి 31వ తేదీ సమీపిస్తున్నా పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు సాచివేత ధోరణి అవలంబిస్తున్నారు. వసూళ్లలో అలసత్వంపై మున్సిపల్ పరిపాలన డైరెక్టర్(డీఎంఏ) ఇటీవల జరిగిన సమీక్షలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా స్పందన కానరావడంలేదు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో పన్నుల వసూలు నామమాత్రంగా కూడా లేదు. ఇక్కడ 28.03 శాతమే వసూలైంది. గుంటూరు కార్పొరేషన్, బాపట్ల మున్సిపాల్టీలలో పన్ను వసూలు 33 శాతంలోపే ఉంది.

వసూలు.. 35.04%

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఆస్తి, నీటి పన్నులను మార్చి 31వ తేదీకి రూ.559.24కోట్లు వసూలు చేయాలి. శుక్రవారానికి రూ.195.99కోట్లు పన్ను వసూలు కాగా అది 35.04 శాతంగా ఉంది. ఆస్తిపన్ను రూ.465.95 కోట్లకు ఇప్పటివరకు రూ.177.08కోట్లు వసూలు చేశారు. వసూలుశాతం 38గా నమోదైంది. నీటిపన్ను వసూలు నామమాత్రంగా కూడా లేదు. రూ.93.29 కోట్లకు రూ.18.91కోట్లు మాత్రమే వసూలైంది. వసూలు 20.27 శాతంగా ఉంది. పన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే వినుకొండ ప్రథమ స్థానంలో ఉంది.

రూ.కోట్లలో ప్రభుత్వ బకాయిలు..

మున్సిపాల్టీలకు పన్నుల బకాయిలు పెద్దగుదిబండగా మారుతున్నాయి. ఈ బకాయిల్లో ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలవే అధికంగా ఉంటున్నాయి. కొన్ని సంస్థలు, విభాగాలు అయితే ఏళ్లుగా పన్నులు చెల్లించడంలో తాత్సారం చేస్తు న్నాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధి లోని ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన పన్ను బకాయిలు రూ.20.85 కోట్లు ఉన్నాయి. సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఎఫ్‌సీఐ రూ.5.47కోట్లు పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. అయినా బకాయిల చెల్లింపుల్లో తీవ్రజాప్యం జరు గుతున్నది.

మూడు జిల్లాల్లో అత్యల్పంగా పన్ను వసూలుచేసిన చిలకలూరిపేట మున్సిపాలిటీ



చెల్లింపులపై.. కసరత్తు

- పది రోజుల్లో రూ.33.77 కోట్లు మంజూరు
- ఐదేళ్ల క్రితం బకాయిలపై ప్రభుత్వం దృష్టి
- బిల్లులను అప్‌లోడ్ చేసిన డ్వామా అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పనులు చేసి ఏళ్ల గడుస్తున్నా వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఉపాధి హామీ బిల్లుల చెల్లింపులు జరగలేదు. వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టేసిన పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. 2019 మార్చికి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం కింద గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పెద్దసంఖ్యలో ప్రగతి పనులు జరిగాయి. అయితే ఆయా బిల్లులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన బిల్లులను చెల్లించాలని అధికారులకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2019 మార్చికి ముందు పనులకు బిల్లుల చెల్లింపులను పది రోజుల్లో మంజూరు చేసేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఈ మేరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల డ్వామా అధికారులు పెండింగ్ బిల్లుల నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. రానున్న పది రోజుల్లో బిల్లుల చెల్లించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి రూ.33.77 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించనున్నది. ఈ క్రమంలో రూ.లక్షల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసి బిల్లుల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూస్తున్న వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పెద్దఎత్తున ఉపాధి పనులు

ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలను 2019కి ముందు నిర్మించారు. పాడి రైతులు మినీ గోకులాలను కూడా ఉపాధి హామీ పథకంలో పెద్దసంఖ్యలో నిర్మించుకున్నారు. వీటికి సంబంధించిన బిల్లులు బకాయిలు పేరుకుపోయాయి. అయినా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. పనులు చేసిన వారు బిల్లులు చెల్లించాలని కోర్టుకు కూడా వెళ్లారు. కోర్టు ఆదేశాలు జారీ చేసినా బిల్లులు చెల్లింపులు జరగలేదు. బిల్లులు నిలిచిపోవడంతో వందలాది మంది ఆర్థికంగా నష్టపోయారు. ఆయా బిల్లులను వడ్డీతో కలిపి చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఆ హామీని ప్రస్తుతం అమలు చేసేందుకు సిద్ధమైంది. పనులు చేసిన బాధిత వ్యక్తులకు ప్రభుత్వ ప్రకటన ఊరటనిచ్చింది. సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వలు, మినీ గోకులాలు తదితర పనులకు సంబంధించి ఇంజనీర్లు రికార్డులు నమోదు చేశారు. ఆయా ఇంజనీర్లు పనుల జాబితాలను జిల్లాల వారీగా డ్వామా పీడీలకు అందజేశారు. ఈ మేరకు పీడీలు బిల్లులను అప్‌లోడ్ చేసినట్లు సదరు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో అత్యధికంగా రూ.26.65 కోట్లు బకాయిలు చెల్లించాలి. గుంటూరు జిల్లాలో రూ.87 లక్షలు, బాపట్ల జిల్లాలో రూ.6.22 కోట్లు విలువైన బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



సీసీ రహదారి

కదిలించిన.. నా శత్రువు

- ప్రేక్షకులను రంజింప చేస్తున్న నాటికలు

యద్దనపూడి(మార్టూరు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం అనంత వరం గ్రామంలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు ప్రేక్షకులను రంజింప చేస్తున్నాయి. మూడోరోజు శుక్రవారం రాత్రి ప్రదర్శించిన నా శత్రువు, కొండంత అండ నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ వారిచే ప్రదర్శించిన నా శత్రువు నాటిక.. సమాజంలో సెల్‌ఫోన్ల మోజులో పడిన మనుషుల మధ్య అనుబంధాలు కరువై ఒంటరిగా మిగిలిపోతున్నారని, అవసరానికి వినియోగిస్తే టెక్నాలజీ మిత్రుడిగా, అంతకుమించి వాడితే శత్రువుగా కీడు చేస్తుందనే ఘటనలను ఉదహరిస్తూ సాగింది. స్నేహ ఆర్ట్స్ వింజనంపాడు వారిచే ప్రదర్శించిన కొండంత అండ నాటికలో నాలాగా ఎందరో అనుకునేదానికంటే.. నలుగురి కోసం నేను, అనే సిద్ధాంతాన్ని నమ్మి తన కోసం కాకుండా, సమాజంలో నలుగురి కోసం బతుకుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఒక రైతు కథను నాటిక రూపంలో ప్రదర్శించారు.

నేటి నాటికలు

ముగింపురోజు శనివారం రాత్రి మూడు నాటికలను ప్రదర్శిస్తారు. మొదట అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే విడాకులు కావాలి నాటిక, చైతన్య కళాస్రవంతి విశాఖ వారిచే (అ)సత్యం నాటిక, చివరగా శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే జనరల్ బోగీలు నాటికను ప్రదర్శిస్తారు.



కొండంత అండ నాటిక లోని సన్నివేశం

సత్తాచాటిన.. పల్నాడు గిత్తలు

- ముగిసిన జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన



జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలో తలపడుతున్న ఎడ్లు

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా శుక్రవారం నిర్వహించిన పాలపళ్ల విభాగంలో 20 జతల ఎడ్లు పోటీలో తలపడ్డాయి. గొట్టిపాటి హనుమంతురావు మెమోరియల్ ప్రాంగణంలో పాలపళ్ల విభాగం ముగింపు పోటీల్లో పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన శైలేంద్రయాదవ్ ఎడ్లు 4800 అడుగుల దూరం లాగి జాతీయ స్థాయి విజేతగా నిలిచాయి. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన కన్నెబోయిన హనుమంతరావు ఎడ్లు 4770 అడుగుల దూరం లాగి ద్వితీయస్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా కోటకాడపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు గిత్తలు 4515 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం పొందాయి. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు ప్రోత్సాహక నగదుతో పాటు, షీల్డ్‌ను బహూకరించారు.

25 సవర్ల బంగారం చోరీ

రేపల్లె, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రేపల్లెలో 25 సవర్ల బంగారం చోరీ జరిగింది. పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన అల్లపర్తి లావణ్య ఈ నెల 2న పుట్టింటికి వెళ్లారు. ఇద్దరు పిల్లలు హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని ఈ క్రమంలో దొంగలు బుధవారం తాళాలు పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని 25 సవర్లు బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు విషయాన్ని తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆ గేదెలు మాకొద్దు

- కొనుగోళ్లకు పొదుపు సంఘాలపై ఒత్తిడి
- కమీషన్ల కోసమే అంటగడుతున్నారని ఆరోపణ
- స్థానికంగా తక్కువకు వస్తున్నా ఇతర జిల్లాల్లో అధిక ధర
- వాతావరణ ప్రభావంతో పాల దిగుబడి తగ్గుతుందని లబ్ధిదారుల ఆందోళన

బల్లికురవ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాతావరణానికి అలవాటు పడి.. తక్కువ ధరకు వస్తున్నా.. పాలు దిగుబడి ఉన్నా.. పొరుగు జిల్లాల గేదెలను కొనుగోలు చేయాలని తమపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారని పొదుపు సంఘాల మహిళలు ఆరోపిస్తున్నారు. పొరుగు జిల్లాల పాడి గేదెలు మాకొద్దు అని తేల్చి చెప్తున్నారు. అయితే గ్రామానికి రెండు గేదెలు కొనాల్సిందేనంటూ వెలుగు అధికారులు మహిళలపై ఒత్తిడి తెస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి కొని తీసుకొచ్చే గేదెలు ఇక్కడ వాతావరణ ప్రభావంతో పాలను తక్కువగా ఇస్తున్నాయని దీనివల్ల తాము నష్టపోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. పైగా ఇతర ప్రాంతాలలో గేదెల ధరలు అధికంగా ఉన్నా.. పలానాచోట కొనుగోలు చేయాలని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పొదుపు సంఘాలకు గేదెలు ఇస్తామంటే ఆనందించే వారు ఇప్పుడు ఆ గేదెలు మాకొద్దు బాబోయ్ అంటూ గగ్గోలు పెడుతున్నారు. కేవలం కమీషన్ల కోసమే వెలుగు అధికారులు గేదెలను బలవంతంగా అంటగడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలోని 25 మండలాల్లో ఉన్న వెలుగు కార్యాలయాల పరిధిలో ఉన్న గ్రామ సంఘాల ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులు బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా ఒక్కో మహిళకు గేదె కొనుగోలు కోసం రూ.లక్ష వరకు రుణాలను అందిస్తున్నారు. మహిళలకు ఎక్కడైనా కొనుగోలు చేసుకోవచ్చని చెపితే బాగుండేది కానీ అధికారులు తాము చెప్పిన చోటే గేదెలను కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇవ్వడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కంకిపాడు, తణుకు, భీమవరం ప్రాంతాల్లోని ఓ డెయిరీ ఫాంలోనే గేదెలు కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఆ డెయిరీ ఫాం వారు కారులో తీసుకెళ్లి మరీ గేదెలు చూపించి అధిక ధరకు కొనుగోలు చేయిస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. అక్కడ ఎక్కువ పాలను ఇచ్చే గేదెలు ఇక్కడకు వచ్చాక తక్కువ పాలను ఇస్తున్నాయని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటున్నారు. తమకు జిల్లా అధికారుల నుంచి ఒత్తిడి ఉందని, గ్రామానికి రెండు గేదెలైనా కొనాల్సిందేనని అధికారులు బెదిరిస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇతర ప్రాంతాల వారితో ముందుగా మాట్లాడుకుని, వారిచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి ఒప్పందాలు చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఇలా అయితే ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు వస్తుందని మహిళలు తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేసి నేరుగా డెయిరీ ఫాంల వారికే చెక్కులను ఇస్తున్నారని అంటున్నారు. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించి, పొదుపు సంఘాలపై ఒత్తిడి లేకుండా చూడాలని కోరుతున్నారు.

జిల్లా నుంచి వచ్చిన ఆదేశాల మేరకే కొనుగోలు

జిల్లా అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే తాము మహిళలకు రుణాలు మంజూరు చేయించి గేదెలను ఇతర జిల్లాలో కొనుగోలు చేయిస్తున్నాం. బల్లికురవ మండలానికి కనీసం 40 గేదెలు కొనుగోలు చేయాలని టార్గెట్ ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లాకు పది మంది రైతులు వెళ్లి రెండు గేదెలను గత వారంలో కొనుగోలు చేశారు. మహిళలు ఇతర జిల్లాల గేదెలు వద్దంటున్నారు. ఈ విషయాన్ని తాము పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- రాజారావు, వెలుగు ఏపీఎం

పొరుగు జిల్లాల నుంచి కొనుగోలు చేసి తీసుకు వచ్చిన గేదెలు



పంట నమోదుతోనే పథకాల వర్తింపు

అద్దంకి టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఈ-పంట నమోదు తోనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ అన్నారు. దేనువకొండ, గోపాలపురం గ్రామాలలో శుక్రవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనరాజ్ మాట్లాడుతూ గ్రామాలలో పంటలను సాగు చేసే రైతులు తమ పంట వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయఅధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ మంచు కారణంగా వరి పంటలో కంకులలో మానికాయ ఏర్పడిందని, తద్వారా పంట దెబ్బతినకుండా రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివ రించారు ఉద్యాన అధికారి దీప్తి మాట్లాడుతూ రాయితీపై తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వీరేష్, జొన్నలగడ్డ కృష్ణ, యర్రా రాఘవయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టండి

పంగులూరు : మొక్కజొన్నలో కత్తెర పురుగు అధికంగా ఉందని దాని నివారణకు రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని రామకూరు, భగవాన్‌రాజుపాలెం గ్రామాలలో శుక్రవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో పృథ్వీసాయి, రైతులు పాల్గొన్నారు.

తెల్లబాడు పాఠశాల ఆట స్థలం పరిశీలన

ఆంధ్రజ్యోతికి స్పందన



తెల్లబాడు గ్రామస్థులతో చర్చిస్తున్న తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ సిబ్బంది

దొనకొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లబాడు జడ్పీ పాఠశాలకు కేటాయించిన ఆట స్థలాన్ని తహసీల్దార్ బి.రమాదేవి పరిశీలించారు. కబ్జాకోరల్లో ఆటస్థలం శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ రమాదేవి తన సిబ్బందితో తెల్లబాడు గ్రామంలోని సర్వేనెంబర్ 178/2లోని ప్రభుత్వ భూమిని రికార్డుల మేరకు పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక వారి ఆదేశాల మేరకు త్వరలో పాఠశాలకు ఆటస్థలం కేటాయించేలా తగిన చర్యలు చేపడతామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి గ్రామాల్లో రీసర్వే



సమావేశంలో మాట్లాడుతున్న జేసి గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 38 మండలాల్లో ఒక్కొక్క గ్రామంలో ఈనెల 20వతేదీ నుంచి రీసర్వేను ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో శుక్రవారం రీసర్వేపై సర్వేయర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 38 గ్రామాల్లో 136 బ్లాకులుగా ఏర్పాటుచేసి 64,904.04 ఎకరాలను సర్వే చేయనున్నట్లు తెలిపారు. అందుకోసం 126 మందితో ఫీల్డ్ వర్క్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సర్వే గ్రామాల్లో విస్తీర్ణాన్ని బట్టి నాలుగైదు బృందాలను కేటాయిస్తామన్నారు. ఒక్కొక్క బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏ ఉంటారన్నారు. సర్వే జరిగే గ్రామానికి చెందిన రైతులకు, గ్రామంలో లేకుండా ఇతర ప్రాంతాల్లో ఉండే భూయజమానులందరికి నోటీసులు ఇచ్చి రశీదులు తీసుకుంటామన్నారు. సర్వే జరిగే గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సభలు, ర్యాలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రైవేటు భూముల సర్వే ఉమ్మడి ల్యాండ్ పార్శిల్ మ్యాప్‌గా కాకుండా ప్రతి రైతుకు ఒక ఎల్‌బీఎం వచ్చేలాగా రోవర్ ద్వారా సర్వే చేస్తామని తెలిపారు. సర్వేకు ముందు గ్రామసభ ఏర్పాటు చేసి అందులో వచ్చే సమస్యలను రికార్డులను నమోదు చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవగాహన సదస్సులకు సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలతోపాటు తహసీల్దార్లు కూడా పాల్గొంటారని వెల్లడించారు. ప్రతి రైతుకు సంబంధించిన భూమి రికార్డుల్లో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి షేక్ గౌస్‌బాషా పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

భారీ ఏర్పాట్లలో తెలుగు తమ్ముళ్లు

ఒంగోలు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు తెలుగు తమ్ముళ్లు సిద్ధమయ్యారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి కాగా ఆ కార్యక్రమానికి కేడర్ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది కావడంతో కార్యకర్తలు మరింత ఉత్సాహంగా కనిపిస్తున్నారు. నియోజకవర్గం యూనిట్‌గా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వర్ధంతి కార్యక్రమాలపై దృష్టిసారించి గ్రామగ్రామాన కార్యక్రమాలు జరిగేలా సిద్ధమయ్యారు. అన్నిచోట్ల ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నివాళులతోపాటు సభలు, ఆ సందర్భంగా రక్తదాన శిబిరాలు, భారీగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలోని పలుచోట్ల ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలను కూడా టీడీపీ శ్రేణులు చేపడుతున్నారు. టంగుటూరు మండలం కందులూరులో ఎన్టీఆర్, దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహావిష్కరణ జరగనుంది. కార్యక్రమానికి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆహ్వానంతో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామి, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఇతర ప్రముఖులు హాజరవుతున్నారు.



వర్ధంతి సభ కోసం సిద్ధం చేసిన వేదిక

శీనారెడ్డి ఇష్టారాజ్యం



శీనారెడ్డిని విచారిస్తున్న త్రిసభ్యకమిటీ సభ్యులు

- త్రిసభ్య కమిటీ విచారణలో వెలుగులోకి అక్రమాలు
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్
- స్వప్రయోజనాలు, అక్రమార్జనే లక్ష్యంగా పాలన
- కొందరు ఉద్యోగుల భాగస్వామ్యం
- కలెక్టర్ పరిశీలనలో నివేదిక
- చర్యలపై డ్వామా సిబ్బందిలో ఆందోళన

డ్వామా పీడీగా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో పెద్ద ఎత్తున అవకతవకలు, అక్రమాలు జరిగాయి. ప్రభుత్వనిబంధనల బేఖాతర్ చేస్తూ తన స్వప్రయోజనం, అక్రమార్జనే లక్ష్యంగా నాలుగున్నరేళ్లు పీడీగా ఆ సంస్థలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. తనకు నమ్మకస్తులైన ఉద్యోగులను కొందరిని కేంద్రంగా చేసుకొని జిల్లా కార్యాలయంలో పెద్ద ఎత్తున సాగించిన ఆయన అక్రమాలలో పలువురు సిబ్బంది కూడా భాగస్వామ్యులయ్యారు. భారీగా ప్రజాధనం దుర్వినియోగం, అక్రమార్జన జరిగింది. శీనారెడ్డి పీడీగా ఉన్న కాలంలో జరిగిన వ్యవహారాలపై విచారణ చేపట్టిన త్రిసభ్య కమిటి తమ విచారణలో అనేక అక్రమాలు, అవినీతి, అవకతవకలును గుర్తించింది. ప్రధాన అశాల వారీగా కమిటి సభ్యులు ఇటీవల తమ నివేదికను కలెక్టర్‌తమీమ్ అన్సారియాకు అందజేయగా శీనారెడ్డి తో పాటు అక్రమాలకు బాధ్యులపై చర్యలుకోసం సదరు నివేదికను కలెక్టర్ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఒంగోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో నాటి ప్రజాప్రతినిధులు, కీలక నేతల కన్నా మిన్నగా జిల్లానీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీ శీనారెడ్డి వ్యవహరించాడన్న ఆరోపణలు అప్పట్లోనే వచ్చాయి. అంతేకాకుండా ఇతర పలు శాఖల వ్యవహారాల్లో నాటి అధికారపార్టీ కీలక నేత అండతో జోక్యం చేసుకోవడమే కాక డ్వామాలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి వైసీపీ నేతలకు లాభం చేకూర్చారన్న ప్రచారం ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాలను పట్టించుకోకుండా సిబ్బంది నియామకాలు, బదిలీలు, సామాజిక తనిఖీలను చేశారు. నచ్చని ఉద్యోగులను వేధించడంతోపాటు నచ్చిన వారిని వెనుకేసుకొచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక శీనారెడ్డి అవినీతి, అక్రమాలు, అవకతవకలు, ప్రజాధనం దుర్వినియోగం నిబంధనలకు విరుద్ధంగా ఆయన సాగించిన వ్యవహారాలపై విచారణ కోరుతూ పలువురు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో శీనారెడ్డి వ్యవహారంపై విచారణ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి శివనారాయణరెడ్డి, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణతో కూడిన త్రిసభ్య కమిటీని కలెక్టర్ తమీమ్ అన్సారియా నియమించారు. సదరు కమిటీ దాదాపు నెలన్నర రోజులపాటు డ్వామా కార్యాలయం కేంద్రంగా విచారణ సాగించింది. 70 వరకు ఫిర్యాదులు అందగా వాటిలో ఇంచుమించు 25 నుంచి 30 వరకు అందరూ ఫిర్యాదులలో ఉన్నట్లు గుర్తించిన త్రిసభ్య కమిటీ అధికారులు వాటి మీద ప్రధాన దృష్టి సారించారు.

అంతా దాటవేత ధోరణే

అందుబాటులో ఉన్న ఫైళ్లను పరిశీలించిన అనంతరం శీనారెడ్డితో పాటు ఫిర్యాదులో భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలు ఉన్న ఉద్యోగులు, ఆయా విభాగాల సిబ్బంది అలాగే ఫిర్యాదుదారులను వ్యక్తిగతంగా విచారించారు. ఈక్రమంలో శీనారెడ్డికి లిఖిత పూర్వకంగా రెండుసార్లు నోటీసులు ఇచ్చి ఆయన కోరిన గడువును కూడా ఇచ్చి ఈనెల 2న వ్యక్తిగతంగా విచారణ చేశారు. కొన్ని అంశాలపై మౌఖికంగా, కొన్నింటిపై రాతపూర్వకంగా ఆ సమయంలో ఆయన వివరణ ఇచ్చినా కమిటీ సభ్యులు ప్రశ్నించిన పలు అంశాలపై దాటవేత ధోరణితో వ్యవహరించారని గుర్తించిన వారు అయా అంశాలపై మరింత వివరంగా స్టేట్‌మెంట్ ఇవ్వాలని సూచించగా ఇవ్వలేదని సమాచారం. ఇక ఫిర్యాదుదారులు ఐదుగురుకి, డ్వామా ఉద్యోగులు, పూర్వ ఉద్యోగులు 44మందికి విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చిన కమిటీ ఈనెల 8, 9 తేదీల్లో విచారణ చేసింది. అందులో నలుగురు ఫిర్యాదుదారులు, 39మంది ఉద్యోగులు విచారణకు హాజరు కాగా వారిని విచారించి వారి నుంచి కూడా లిఖిత పూర్వకంగా వివరణలు తీసుకున్నారు.

కలెక్టర్‌కు నివేదిక అందజేత

దాదాపు పది రోజులకు పైగా డ్వామా కార్యాలయంలో ప్రత్యక్షంగా ఫైళ్ల పరిశీలన, ఉద్యోగులను విచారించిన వారు ఇతర సమయాల్లో తమ వద్ద ఉన్న ఫిర్యాదులు, ఉద్యోగులు ఇచ్చిన వివరణలు, రికార్డుల పరిశీలన చేసి సంక్రాంతికి ముందే తమ నివేదికను కలెక్టర్ అన్సారియాకు అందజేశారు. ఆ విచారణ కమిటీ పలు అంశాలపై సమగ్రంగానే విచారణ చేపట్టడంతోపాటు శీనారెడ్డి పీడీగా ఉన్న కాలంలో అనేక అక్రమాలు, అవకతవకలు జరిగిన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. వాటన్నింటిని సవివరంగా వారు కలెక్టర్‌కు నివేదించడంతో ప్రస్తుతం వాటిని కలెక్టర్ నిశిత పరిశీలన చేస్తున్నారు. దీంతో తమపై ఎలాంటి చర్యలు ఉంటాయోనన్న ఆందోళన గతంలో శీనారెడ్డితో అంటకాగిన డ్వామా ఉద్యోగులలో కనిపిస్తోంది. త్రిసభ్య కమిటీ గుర్తించి కలెక్టర్‌కు నివేదించిన కొన్ని అంశాలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

- జిల్లాలో ఉపాధి పనులలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని, కూలీలతో కాకుండా దొంగ మస్టర్లతో, యంత్రాలతో పనులు చేసి బిల్లులు డ్రా చేశారన్న ఫిర్యాదులపై డ్వామా పీడీగా శీనారెడ్డి ఉన్న కాలంలో రాష్ట్ర కమిషన్ కార్యాలయం నుంచి వచ్చిన ప్రత్యేక తనిఖీ బృందాలు కొండపి. అర్ధవీడు, పెద్దారవీడు, కేకేమిట్ల, దోర్నాల మండలాల్లో పరిశీలన చేసి అక్రమాలు గుర్తించారు. అందుకు బాధ్యులుగా 25మంది అప్పట్లో సస్పెండ్ అయ్యారు. అయితే రాష్ట్ర బృందాలు తనిఖీ చేసిన పనులను శీనారెడ్డి రీవెరిఫికేషన్ పేరుతో ఒక ఏపీడీ నేతృత్వంలో పరిశీలన చేయించి సస్పెండైన వారికి తిరిగి పోస్టింగులు ఇచ్చారు. రీ వెరిఫికేషన్ అధికారం లేకున్నా చేయించడం, సస్పెండైన వారికి పోస్టింగ్‌లు ఇవ్వడాన్ని విచారణ కమిటీ తప్పుబట్టింది. కనీసం రీవెరిఫికేషన్‌కు అటు కమిషనర్ నుంచి కాని ఇటు కలెక్టర్ నుంచి కాని అనుమతి తీసుకోలేదని గుర్తించారు.
- జగనన్న కాలనీల్లో లెవలింగ్, అంతర్గత రోడ్ల నిర్మాణం, ఇతర పనులకు భారీగా ఉపాధి నిధులు ఖర్చుచేయగా వాటిలో అనేక అక్రమాలు జరిగి నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. చేసిన పనులకు రికార్డులు లేకపోవడాన్ని కమిటీ గుర్తించింది. ఉదాహరణగా ఒంగోలు మండలం చేజర్ల కాలనీ పనులు రికార్డులు పరిశీలించగా అక్రమాలు నిజమని తెలినట్లు సమాచారం. ఒంగోలుకు సంబంధించి యరజర్ల వద్ద తొలుత వేసిన లే అవుట్‌కు ఉపాధి నుంచి నిధులు ఇవ్వడానికి అవకాశం లేదని శీనారెడ్డి లిఖితపూర్వకంగా ఇవ్వగా, రూ.34కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. అక్కడ ఇళ్ల స్థలాలు పంపిణీ నిలిచిపోగా అప్పటి వైసీపీ నేతల లబ్ధికోసం శీనారెడ్డి అలా లెటర్ ఇచ్చినట్లు కమిటీ గుర్తించింది. ఆ లేఖకు సంబంధించి డ్వామా కార్యాలయంలో ఎలాంటి ఉత్తర, ప్రత్యుత్తరాలు కూడా లేవని గమనించారు.
- ఒంగోలు ఏపీడీ కాత్యాయిని కొంత కాలం అనారోగ్యంతో సెలవులో, మరికొంతకాలం కార్యాలయంలో లేని సమయంలో వెంకటస్వామిని ఇన్‌చార్జిగా నియమించారు. అతని అద్దెకారు వాడుకునే ప్రొవిజన్ లేకపోగా కాత్యాయినితో టూర్ డైరీపై సంతకాలు చేయించి వెంకటస్వామికి బిల్లులు ఇచ్చారు. శీనారెడ్డి ఆదేశాలతో తాను అలా సంతకాలు పెట్టినట్లు కాత్యాయిని కమిటీ ముందు చెప్పినట్లు సమాచారం. కిందిస్థాయి ఉద్యోగికి పైస్థాయి అధికారి ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చేటప్పుడు కమిషనరేట్ లేదా కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సి ఉండగా ఒంగోలు ఏపీడీగా వెంకటస్వామి, కందుకూరు ఏపీడీగా సుభాషిణిలను ఇన్‌చార్జిగా నియమించడమే కాక వారికి లేని వాహన ప్రొవిజన్ కల్పించారు. తద్వారా తమపై స్థాయి అధికారులైన ఎంపీడీవోలను అజమాయిషీ చేసే అధికారాన్ని, నిబంధనలకు విరుద్ధంగా వారికి కట్టబెట్టారు.
- ఏపీడీగా పనిచేస్తున్న వెంకటస్వామి వాస్తవానికి జడ్పీలో సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగికాగా డ్వామా విజిలెన్స్ విభాగం పర్యవేక్షకునిగా తొలుత డిప్యుటేషన్‌పై తీసుకొని కొంతకాలం తర్వాత ఏకంగా జిల్లా విజిలెన్స్ అధికారిగా, మరికొంతకాలం తర్వాత పది మండలాలకు పర్యవేక్షణ ఉండే ఒంగోలు ఏపీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఆ సమయంలో విజిలెన్స్ విభాగంలో పలు అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఇప్పటికి కూడా సదరు వెంకటస్వామి ఏపీడీగానే కొనసాగుతున్నారు.
- ఒంగోలు క్లస్టర్ శిక్షణ కేంద్రం నిధుల వినియోగంపై ఏపీడీ కేంద్ర డైరెక్టర్‌లకు జాయింట్ చెక్ పవర్ కాగా వారికి సంబంధం లేకుండా అటెండర్ రూ.14లక్షలు బ్యాంకు నుంచి ఆరునెలల వ్యవధిలో డ్రా చేశాడు. ఆ విషయాన్ని ఏపీడీ కాత్యాయిని, డైరెక్టర్ లలితాదేవిలు పీడీ శీనారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. క్రిమినల్ కేసు నమోదు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ ఇద్దరిని సస్పెండ్, అలాగే అటెండర్‌ను డిస్మిస్ చేయాల్సి ఉండగా తాత్కాలికంగా అటెండర్‌ను సస్పెండ్ చేశారు. తర్వాత నగదు తిరిగి కట్టాడని చెప్పి మళ్లీ అటెండర్‌కు ఉద్యోగం ఇచ్చారు. ఇందులో ఏపీడీ వెంకటస్వామిని విచారణ అధికారిగా పెట్టి నామమాత్రంగా చేపించినట్లు కమిటీ గుర్తించింది.
- డ్వామాలో పీడీ కన్నా ముందు గతంలో కొంతకాలం ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేసిన శీనారెడ్డి ఆ సమయంలో ప్రభుత్వ ఉద్యోగి అయిన తన భార్య పేరుతో అద్దె వాహనం పెట్టుకొని బిల్లులు డ్రా చేశారు. ఇక పీడీ అయ్యాక నిబంధనల ప్రకారం నెలకు రూ.45వేలు అద్దె చెల్లింపు చేయాల్సి ఉండగా ఏకంగా రూ.60వేలు డ్రా చేశారు.
- సామాజిక తనిఖీలు అంతా ప్రహసనంగా ఆయన కాలంలో సాగాయి. బృందాలు ఒక మండలంలో రూ.2కోట్లు అక్రమాలు జరిగాయని గుర్తిస్తే ప్రజావేదికలో దానిని తగ్గించి కొందరు సిబ్బందిని సస్పెండ్ చేశారు. అనంతరం వ్యక్తిగత విచారణ పేరుతో పిలిచి మాట్లాడుకొని మరింత తగ్గించి రికవరీలు చేయకుండా తిరిగి పోస్టింగ్‌లు ఇచ్చారు. దోర్నాల మండలంలో ఒక వ్యక్తి అనేకమంది వేలిముద్రలు వేసి అక్రమంగా ఉపాధి డబ్బులు స్వాహా చేయడాన్ని గుర్తించిన కమిటీ ఈ వ్యవహారాల్లో శీనారెడ్డితోపాటు నాటి విజిలెన్స్ విభాగం సిబ్బంది కూడా ఉన్నట్లు తేల్చింది.
- కొన్నిచోట్ల ఆడిట్ నివేదికల ఆధారంగా సిబ్బందిపై చర్యలు తప్పని పరిస్థితి ఎదురైతే కలెక్టర్‌కు నివేదించి సస్పెండ్ చేయించి తర్వాత తనకు నచ్చిన వారికి గుట్టుచప్పుడు కాకుండా తానే పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇష్టం లేని వారిని డిస్మిస్ చేయడం, కనీసం వారికి సంజాయిషీ ఇచ్చుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. ఈ విషయం కమిటీ గ్రహించడంతో పాటు కలెక్టర్ అనుమతి లేకుండా పోస్టింగ్‌లు ఇచ్చారని గుర్తించారు.
- డ్వామాలో నిరంతరం వివిధ అంశాలపై శిక్షణా కార్యక్రమాలు నడుస్తుంటాయి. అలాగే స్టేషనరీ వాడకం కూడా అధికంగా ఉంటుంది. వీటికి సంబంధించి కార్యాలయంలో శీనారెడ్డికి నమ్మకస్తుడిగా ఉండే ఒక ఉద్యోగి భార్య పేరుతో ఉన్న క్యాటరింగ్, స్టేషనరీకి ఏజెన్సీల ద్వారా ఖర్చుచేసినట్లు కమిటీ గుర్తించింది. ఆ బిల్లులు కూడా కమిటీ ముందు ప్రస్తుత ఉద్యోగులు సమర్పించకపోవడంతో అక్రమాలు జరిగినట్లు తేల్చారు.
- డ్వామాలోని విజిలెన్స్ విభాగం, సోషల్ ఆడిట్, హెచ్‌ఆర్‌తోపాటు పలు సెక్షన్లలో అవినీతి వేళ్లూనుకుపోయినట్లు, కొందరు ఉద్యోగుల పాత్ర అందులో ఉన్నట్లు కమిటీ గుర్తించి వారి పేర్లతో సహా తమ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. లంచాలు కూడా ఫోన్ పే ద్వారా జరిగాయని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన కమిటీ శీనారెడ్డి అలాగే విజిలెన్స్ విభాగంలోని ఉద్యోగి మొబైల్ నెంబర్లకు ఉన్న బ్యాంకు అకౌంట్లను కూడా పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.
- డ్వామాలో వాడిన అద్దె వాహనాలు, చెల్లించిన బిల్లులు, స్టేషనరీ, క్యాటరింగ్ బిల్లులు, జలసిరి, ఈజీఎస్ బిల్లుల ఫైళ్లు అనేకం అందుబాటులో లేవంటూ సిబ్బంది కమిటీకి సమర్పించలేదు. దీంతో మరోసారి సమగ్రంగా వివరణ ఇవ్వాలని శీనారెడ్డికి సూచించినా రాకపోవడం, కమిటీకి సహకరించాలని ప్రస్తుత పీడీ రాతపూర్వకంగా ఉత్తర్వులు ఇచ్చినా కొందరు ఉద్యోగులు దాటవేత వైఖరితో ఉండటం వంటి అంశాలను కూడా కమిటీ తమ నివేదికలో పేర్కొంటూ బాధ్యులపై చర్యలతోపాటు డ్వామా కార్యాలయంలో సిబ్బంది మార్పులు, చేర్పులు చేయడం అవసరంగా సూచించినట్లు తెలిసింది.

నాటక రంగానికి ప్రాణం పోస్తున్న కళాపరిషత్‌లు

మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



కళాపరిషత్ వేదికపై మాట్లాడుతున్న మాజీ మంత్రి పుల్లారావు

యద్దనపూడి (మార్టూరు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కళలు, కళాకారులకు, నాటక రంగాలకు కళాపరిషత్‌లు ప్రాణం పోస్తున్నాయని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు అన్నారు. ఆరికంగా ఎంతకష్టమైనా కళాపరిషత్‌లను నిర్వహిస్తున్నవారిని ప్రజలు ప్రోత్సహించాలని కోరారు. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో మూడోరోజు శుక్రవారం రాత్రి ప్రదర్శించిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలకు పుల్లారావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు సభాధ్యక్షునిగా వేదికపైకి ఆహుతులను కందిమళ్ల సాంబశివరావు ఆహ్వానించారు. ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎంతోమంది కళాకారులు రాష్ట్ర స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన వారున్నారన్నారు. ప్రేక్షకుల చప్పట్లతో రంగస్థల కళాకారులు ఎంతోమంది తమ జీవితాలను నాటక రంగానికి అంకితం చేశారన్నారు. మనందరం కళలను బతికించుకోవాలి, కళాకారులను ప్రోత్సహించాలి, భావి తరాలకు కళాపరిషత్‌లను నిర్వహించాలన్న ఆసక్తిని పెంపొందించాలన్నారు. ఇంకా ఆత్మీయ అతిథులుగా టీవీ విశ్లేషకులు కందుల రమేష్, తెలుగు టీవీ నిర్మాతల మండలి అధ్యక్షుడు ఆరికట్ల ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమం చివరగా టీవీ విశ్లేషకులు ఇడుపులపాటి సాంబశివరావును కళాపరిషత్ సభ్యులు ఎమ్మెల్యే పుల్లారావు, తదితర అతిథులతో కలిసి దుశ్శాలువ, పూలమాలలో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

73 రోజులు.. రూ.363.25 కోట్లు

(1వ పేజీ తరువాయి)

మున్సిపాల్ అధికారుల తీరు పరిశీలిస్తే కష్టమనిపిస్తోంది. చిలకలూరిపేట, గుంటూరు కార్పొరేషన్, బాపట్ల మున్సిపాల్టీలలో పన్ను వసూళ్లు దారుణంగా ఉంది. మంగళగిరి-తాడేపల్లి, పిడుగురాళ్ల, అద్దంకి మున్సిపాల్టీల్లో మాత్రం పన్ను వసూలు మెరుగ్గా ఉంది. ఆదాయ వనరులను పెంచుకోవడంలో మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనేందుకు పన్నుల వసూళ్లే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. మున్సిపాల్టీల్లో ఆస్తి, నీటి పన్ను బకాయిలు పేరుకుపోతున్నా అధికారుల్లో స్పందన లేదు. ప్రకటనలు, తాత్కాలిక ఆక్రమణల పన్నులు పక్కదారి పడుతున్నాయి.

జీతాల చెల్లింపుల్లో జాప్యం

పన్నుల వసూళ్లు, ఆదాయ వనరులు అంతంత మాత్రంగా ఉండటంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల నిర్వాహణ, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది. సకాలంలో పన్నుల వసూళ్లు కాకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకుంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పర్చూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి) పర్చూరు మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 10గంటలకు ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డీసీసీబీ ఎవరికో?



- పర్సన్ ఇన్‌చార్జి నియామకంపై కసరత్తు
- పరిశీలనలో ముందున్న డాక్టర్ సీతారామయ్య, వీరయ్య పేర్లు
- భవిష్యత్తులో ఎన్నికల వ్యయభారాన్ని మోయాలని ఆంక్ష
- డాక్టర్ పేరును ప్రతిపాదించిన ఎమ్మెల్యే దామచర్ల
- ఎక్కువ మంది ఎమ్మెల్యేలు

ఇద్దరి సిఫార్సు లేఖలపై సంతకాలు చేసిన వైనం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లా పరిధిలో జిల్లా పరిషత్ తర్వాత ఆ స్థాయి ప్రాధాన్యత గల జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) పూర్తిస్థాయి ఆధిపత్యం కోసం అధికార టీడీపీ నాయకులు దృష్టిసారించారు. అందులోభాగంగా మున్ముందు రాబోయే సహకార ఎన్నికలు కూడా దీటుగా ఎదుర్కొనే వారితో పాలకమండలిని నియమించే విషయంపై కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుతం సెంట్రల్ బ్యాంక్ పాలకమండలిలో కిందిస్థాయి సొసైటీల్లో అధికారులతో కూడిన త్రీమెన్ కమిటీలు ఉన్నాయి. వాటి స్థానే రాజకీయ నేతలతో కూడిన త్రీమెన్ కమిటీలు నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు కిందిస్థాయిలో సొసైటీల త్రీమెన్ కమిటీ నియామకాలపై ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జులు కుస్తీ పడుతున్న విషయం తెలిసిందే. సొసైటీలతోపాటు జిల్లా బ్యాంకుకు కూడా ఒక పర్సన్ ఇన్‌చార్జిని ఇద్దరు లేక ఐదుగురు సభ్యులుగా ఉండే పాలకమండలిని నియమించాలని భావిస్తుంది. ఆ మేరకు ఇప్పటికే ఈ విషయంపై టీడీపీ నాయకులు దృష్టిపెట్టి పరిశీలన చేస్తున్నారు.

ఎన్నికల బాధ్యత తీసుకోవాల్సిందే

కొంతకాలం క్రితం డీసీసీబీ విషయమై తాడేపల్లిలోని మంత్రి రవికుమార్ నివాసంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ఇతర ముఖ్య నాయకులు సమావేశమై చర్చించారు. అంతకుముందు ఒంగోలులో జరిగిన ఒక సమావేశంలో కూడా ఈ విషయంపై వారి మధ్య చర్చలు జరిగాయి. ప్రస్తుతం సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జిని ఎవరిని నియమించినా వారే భవిష్యత్తు సహకార ఎన్నికల బాధ్యత తీసుకునే విధంగా చూసుకోగలగాలని తదనుగుణంగానే ప్రస్తుత ఎంపిక జరగాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల సమయంలో వ్యయాన్ని భరించగలిగిన వారే ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జి పదవి కోసం ముందుకు రావాలని టీడీపీ నాయకులు ఆశావాహులకు సూచించారు.

పరిశీలనలో ముందున్న ఆ ఇద్దరు

ప్రస్తుతం పీడీసీసీబీ కోసం పలువురు ప్రయత్నం చేస్తున్నారు. అలా ప్రయత్నించే వారిలో ప్రస్తుతానికి ఒంగోలుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యల పేర్లు పరిశీలనలో ముందున్నట్లు తెలుస్తోంది. ఒంగోలులోని వెంకటరమణ వైద్యశాల యాజమాన్య భాగస్వామి అయిన డాక్టర్ సీతారామయ్య పేరును ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రతిపాదించారు. డాక్టర్ సీతారామయ్య తండ్రి డాక్టర్ రమణారావు 1989 ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత సీతారామయ్య వైద్య వృత్తిలో వచ్చినప్పటి నుంచి టీడీపీలో కొనసాగుతూ తన వంతు పాత్ర పోషిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఒంగోలు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2014 నుంచి ప్రతి ఎన్నికల్లో దామచర్లకు మద్దతుగా పనిచేశారు. అయితే సెంట్రల్ బ్యాంకులో తక్కువ సింగిల్ విండోలు ఉన్న నియోజకవర్గం ఒంగోలు. దీంతో ఈ విషయాన్ని కొందరు ప్రస్తావించగా ఎమ్మెల్యే దామచర్ల తన ప్రతిపాదనను అంగీకరించాలని కోరటంతో మిగిలిన వారు సైలెంట్ అయ్యారు. ఆయన పేరును దామచర్ల ప్రతిపాదించగా ఆ సిఫార్సు లెటర్‌పై కొత్త ప్రకాశం జిల్లాలోని ముఖ్య నాయకులు, మంత్రి స్వామితో సహా అందరూ సంతకాలు చేయగా మిగిలిన నాయకులు కూడా మద్దతు ఇచ్చినట్లు తెలిసింది. కాగా మరోవైపు మాజీ ఎంపీపీ వీరయ్య కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయన కూడా సంతకాల సేకరణ జరిపినట్లు తెలిసింది. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో సహా ప్రకాశం జిల్లాలోని ఎక్కువ మంది నాయకులు ఆయన సిఫార్సు లేఖపై కూడా సంతకాలు చేశారు. దామచర్ల మాత్రం సీతారామయ్యవైపే ఉన్నారు. మంత్రులు రవికుమార్, స్వామిలు అధిష్ఠానం నిర్ణయాన్ని కాదనలేమని ఎవరి ప్రయత్నం వారు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది.

బాబు, లోకేష్‌లను కలిసి విన్నపం

ఇటు సీతారామయ్య అటు వీరయ్య ఇద్దరు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను కూడా కలిసి సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జిగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ ఇద్దరు నాయకులు కూడా లోకేష్ దృష్టిలో ఉన్నారనేది సమాచారం. ఈ ఇరువురు కాకుండా మరికొందరు నాయకులు కూడా తమకు అవకాశం ఇవ్వాలని అటు బాబును ఇటు లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య కూడా ఆప్కాబ్ చైర్మన్ పదవికి తన పేరును పరిశీలించాలని కోరారు. ఆప్కాబ్ చైర్మన్ కావాలంటే ముందుగా సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికవ్వాలి. ఆ రకంగా ఆయన కూడా సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆప్కాబ్ చైర్మన్ పదవిని గోదావరి జిల్లాలో ఒకరికి కేటాయించాలని మంత్రి లోకేష్ ఆలోచిస్తున్నట్లు కూడా సమాచారం.

కన్నెర్ర కట్టడి చేస్తారా?



వాడరేవు తీరంలో సీఆర్‌జడ్ పరిధిలో జరుగుతున్న రిసార్ట్ నిర్మాణం



వాడరేవు తీరంలో సీఆర్‌జడ్ పరిధిలో జరుగుతున్నరొయ్యల ప్రాసెసింగ్ షెడ్లకు వేసిన పిల్లర్లు

- సీఆర్‌జడ్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించేనా
- ఆ కందిరీగల తుట్టెను కదిలించే సాహసం ఆయా శాఖల అధికారులు చేస్తారా?
- ఉన్నతాధికారుల ప్రొటోకాల్ పేరుతో పరస్పర సహకారం అందించుకుంటున్నారనే ఆరోపణలు
- అనధికారిక నిర్మాణాలు పరిశీలించిన ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : విస్తారమైన సముద్రతీరం జిల్లా సొంతం. పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు అనుకూలమైన వనరులు. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ ప్రత్యేక దృష్టి. నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇచ్చే కోణంలో ప్రభుత్వ ఆలోచనలు. సానుకూల అంశాలు. జిల్లా పరిధిలో తీరప్రాంతం అత్యధికంగా చీరాల నియోజకవర్గంలో ఉంది. ఇదిలావుంటే తీరంలో సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించడం, అసైన్డ్, పట్టా భూములు అనే తేడా లేకుండా ఆఖరికి తీరానికి రక్షణ కవచంగా ఉండాల్సిన మడ చెట్లను కూడా మాయం చేసి, సంబంధిత శాఖల నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు లేకుండా చేపట్టిన, చేపడుతున్న (రిసార్ట్స్, హోటల్స్) నిర్మాణాలు ప్రతికూల అంశాలు.

క్రమబద్ధీకరిస్తారా..

కన్నెర్ర చేస్తే అనుమతులు పొందనివారు అనుమతి పొందుతారు. కట్టడి చేస్తే కొంతగా అనుమతులు లేకుండా మరొకరు ముందడుగే వేయరు. క్రమబద్ధీకరిస్తే కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమవుతాయి. మూడు చేస్తే ప్రక్షాళన జరుగుతుంది. లేదంటే ఒకరిని చూచి మరొకరు సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించడం కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ, మండల పరిషత్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సీఆర్‌జడ్, కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, ఒడా తదితర శాఖల నుంచి పక్కాగా అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టాలి. ఆ తరువాత నిర్వహణ కూడా నిబంధనల మేరకు చేపట్టాలి. నియోజకవర్గ పరిధిలోని తీర ప్రాంతంలో చిన్నా, పెద్దా రిసార్ట్స్, హోటల్స్ సుమారు 50 వరకు ఉన్నాయి. వీటిలో పూర్తి స్థాయి అనుమతులు ఎవరికున్నాయో సంబంధిత అధికారులే చెప్పాలి.

రాజుగారి పాలల్లో నీళ్లు

తీరప్రాంతంలో రిసార్ట్స్, హోటల్స్ నిర్మాణాలు, నిర్వహణకు సంబంధించి పక్కాగా నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని అనుమతులు



సీఆర్‌జడ్ పరిధిలోని నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ రాఘవరెడ్డి, తహసీల్దార్ గోపీకృష్ణ

ఇవ్వాల్సిన, పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖల అధికారులు రాజుగారి పాలల్లో నీళ్లు అన్న చందంగా తమ విధులను నిర్వహిస్తున్నారని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. జరుగుతున్న పరిణామాలు అందుకు దర్పణం పడుతున్నాయి. ఇదిలావుంటే మేము అన్ని శాఖల వారికి వారు కోరినపుడు ఉచితంగా రూములు, మంచి, చెడులు చూస్తుంటాం కదా అందుకని చూసీచూడనట్లు వ్యవహరిస్తుంటారని పలువురు వ్యాఖ్యానించటం వారి గడసరి తనానికి నిదర్శనమని వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

కందిరీగ తుట్టెను కదలించినట్లే

తీరప్రాంతంలో రిసార్ట్‌లు, హోటల్స్‌కు సంబంధించిన నిర్వాహకులలో సింహభాగం బడాబాబులే. వారు పాలక, ప్రతిపక్షాలలో కీలక భూమిక పోషించే వ్యక్తులే. అధికారంలో ఏ పార్టీ ఉన్నా డైరెక్ట్‌గా మేము సీఎం పేషీ నుంచి చెప్పించుకుంటామని కొందరు బహిరంగంగానే వ్యాఖ్యానించడం వారి లేక్కలేని తనానికి పరాకాష్ట. ఇదిలావుంటే అనుమతులు లేకుండా ముందు నిర్మించినవారిని ఏదన్నా చేస్తేనే కదా మాపై కూడా చర్యలు చేపట్టేది, కదిలిస్తే కందిరీగల తుట్టెను కదిలించేనట్లేనని కొందరు అంటున్నారు. గత ఎన్నికల ఫలితాల ముందు వరకు వైసీపీలో ఉండి, తాజాగా టీడీపీతో జతకట్టిన ఓ నాయకుడు వేటపాలెం మండలం రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం మధ్య, మరో ఇద్దరు చీరాల మండలం వాడరేవు తీరం సమీపంలో వేర్వేరుగా సీఆర్‌జడ్ పరిధిలో నిర్మాణాలు చేపట్టడం విశేషం. అయతే నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులు ఎందుకు మాట్లాడరో వారే చెప్పాలి.

వాడరేవులో పరిశీలించిన అధికారులు

వాడరేవు తీరంలో అనధికారికంగా, అనుమతులే లేకుండా చేపడుతున్న నిర్మాణాలను శుక్రవారం ఆర్డీవో చ్రందశేఖర్‌నాయుడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, చీరాల మండల తహసీల్దార్ గోపీకృష్ణ తదితరులు శుక్రవారం పరిశీలించారు. రెవెన్యూ, పంచాయతీ రికార్డుల ప్రకారం స్థానికంగా చేపట్టిన నిర్మాణాల వివరాలు, వారికున్న అనుమతులు తదితరాలపై విచారణ జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఏ నిర్మాణాలు చేపట్టినా తొలగిస్తామని, పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు. ప్రాథమికంగా వారికి నిర్ణీత నిర్మాణాలకు అనుమతులు లేవని తేలిందని తెలిపారు. ఈ క్రమంలో నియోజకవర్గ పరిధిలోని సంబంధిత రెవెన్యూ, మండల పరిషత్ తదితర బాధ్యులతో సీఆర్‌జడ్ ఉల్లంఘనలపై పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టేందుకు శనివారం ఆర్డీవో కార్యాలయంలో రివ్యూ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.



జాతీయ రహదారికి ఇరువైపులా స్ట్రక్చర్లను తొలగిస్తున్న అధికారులు

బీఆర్‌పాలెం వద్ద డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు

ఎన్‌హెచ్-16లో స్ట్రక్చర్ల తొలగింపు

పంగులూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామం వద్ద శుక్రవారం 16వ నెంబరు జాతీయ రహదారి స్థలంలో ఇరువైపులా ఉన్న గృహాలు, రేకుల షెడ్లు, ఇతర నిర్మాణాలను తొలగించే చర్యలు చేపట్టారు. 2010-11 సంవత్సరంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నష్ట పరిహారం చెల్లించి సేకరించిన స్థలంలో ఉన్న కట్టడాలను తొలగిస్తున్నట్లు తహసీల్దార్ సింగారావు, హైవే సైట్ ఇంజనీర్ హస్సాన్ తెలిపారు. జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లేని కారణంగా గ్రామం నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగు నీరు వెలుపలకు వెళ్లే పరిస్థితి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నివాస గృహాల ముందు నీరు నిలిచి పడుతున్న ఇబ్బందులను గ్రామస్థులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వివరించారు. దీనిపై మంత్రి రవికుమార్ స్పందించారు. వెంటనే కచ్చా డ్రైన్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు ఈ నెల 8న రోడ్డుకు ఇరువైపులా సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించామని, తదుపరి చర్యల నిమిత్తం అడ్డుగా ఉన్న స్ట్రక్చర్లను క్రేన్ ద్వారా తొలగిస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వినోద్‌బాబు, టోల్ మేనేజర్ ఆనందరావు, రూట్ ఆపరేటర్ నర్సింగరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలబడదాం

వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : ప్రజల పక్షాన నిలబడి.. మనవంతు పాత్ర పోషిద్దామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి బాధ్యతతో ముందుకు సాగుదామని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిధిలో వైసీపీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

అద్దంకిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా శనివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉదయం 10 గంటలుకు జాగర్లమూడివారిపాలెం, తరువాత 11 గంటలకు శింగరకొండపాలెం గ్రామాలలో జరగనున్న కార్యక్రమాలలో పాల్గొంటారని టీడీపీ నాయకులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

బస్టాండ్‌లో స్వచ్ఛ ఆంధ్ర

ఇంకొల్లు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంకొల్లు బస్టాండ్‌లో శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి పరిసరాలు శుభ్రం చేసారు. ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొని పనులు పర్యవేక్షించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సబ్సిడీపై ఇచ్చే రుణాలు ఆన్‌లైన్‌లో అర్హులైనవారు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం(చీరాల), జనవరి 17(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం దేశాయిపేటలో శనివారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మేళతాళాలతో అమ్మవారి గ్రామోత్సవం

- వేలాదిగా పాల్గొన్న భక్తులు
- పూలతో పసుపు మయంగా పురవీధులు



చందలూరు పురవీధుల్లో ఊరేగుతున్న మహాలక్ష్మి అమ్మవారు

పంగులూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి పాలవెల్లి మహోత్సవం తొమ్మిదవ రోజు శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మేళతాళాలతో సాగిన అమ్మవారి గ్రామోత్సవంలో వేలాది మంది భక్తులు అమ్మవారికి అభిముఖంగా వెనుకకు నడుస్తూ పూలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భక్తి పారవశ్యంతో అమ్మవారికి సమర్పించిన పూలతో పురవీధులు పసుపు మయమాయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల మూలమంత్ర జపం చేసి 11 మంది ముత్తయిదువులకు పూలు, గంధం, కుంకుమలు అర్పించి బాల భోగం నిర్వహించారు. పొంగించిన పాలపై నెయ్యితో కలిపిన మధుర పదార్థం అమ్మవారికి నివేదన గావించి ముత్తయిదువులకు ఆ పదార్థాలను ఒడ్డించారు. అనంతరం ముత్తయిదువులు జల బిందెలతో పురవీధులలో అమ్మవారి గ్రామోత్సవం వెంట రాగా, మేళ తాళాలతో సాగిన ఈ గ్రామోత్సవంలో చందలూరు, పరిసర గ్రామాల ప్రజలు, బంధుమిత్రులు వేలాదిగా పాల్గొని అమ్మవారికి నమస్కరిస్తూ, పూలు చల్లుతూ సాగిన ఉత్సవం తిలకించేందుకు ప్రధాన రహదారికి ఇరువైపులా భక్తులు బారులుతీరారు. కిక్కిరిసిన జన సందోహంతో సాగిన గ్రామోత్సవం తిరునాళ్లను తలపించింది. అమ్మవారు పురంలో కొలువుదీరారు. రాత్రివేళ విద్యుత్ దీపాలతో రూపుదిద్దుకున్న ప్రభవతో పుల్లెల, తాటి వంశస్థులు పుర వీదులలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భరత నాట్యం, వీధి డ్యాన్స్‌లతో గ్రామంలో కోలాహలం నెలకుంది.



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీభద్రావతి సమేత భావన్నారాయణస్వామి కల్యాణం

చీరాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పేరాలలో వేంచేసి ఉన్న శ్రీ భద్రావతి సమేత శ్రీ భావన్నారాయణ స్వామి కల్యాణం వేభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి చీరాల, పేరాల పురవీధుల్లో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవం నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ జం జనం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయలానికి 100 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఆలయ పుట్టుపుర్వోత్తరాలను వివరించారు. నగరోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, నిర్వాహక ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు.



వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య, మున్సిల్ ఛైర్మన్ జంజనం తదితరులు

ప్రేమసాగర్‌ను అభినందించిన ఎంపీ దగ్గుమళ్ల

చీరాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రం జలంధర్ లౌలీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలలో 81 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిన దేవరకొండ ప్రేమ సాగర్‌ను చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం అభినందించారు. ప్రేమ సాగర్ చీరాల వాసి కావడం చీరాల ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశం గర్వించేస్థాయికి ప్రేమ సాగర్ ఎదగాలని ఆకాంక్షించారు. అందుకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రోత్సహించారు.





రాజనర్తకి నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

అలరించిన నాటిక పోటీలు

బోడవాడ (పర్చూరు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పౌరాణిక కళాకారులు, నటప్రతాప్ చెరుకూరి శ్రీరాములు చౌదరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మండలం బోడవాడలో గురువారం రాత్రి ప్రదర్శించిన నాటిక పోటీలు ప్రేక్షకులను రంజిపచేశాయి. నేటి సమాజంలో తరగిపోతున్న మానవ విలువలు, సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు అందించాలన్న సంకల్పంతో సాగిన నాటిక ప్రదర్శనలో కళాకారుల అద్భుతమైన నటను చూపించారు. నాటిక పోటీల అనంతరం భీమినేని యుక్తా చౌదరి నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన మంత్రముగ్ధులను చేసింది. టీడీపీ నాయకుడు చెరుకూరి శ్రీధర్(చింపయ్య) సారథ్యంలో ఈ పోటీలను ఏర్పాటు చేశారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

వాహనదారులకు ఎస్ఐ కౌన్సెలింగ్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులకు ఈపూరుపాలెం ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. శుక్రవారం స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన దారులతో ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం యజమానిపై ఆధారపడి ఉంటుందని, ఈక్రమంలో ప్రయాణాలు సాగించే ముందు కుటుంబాల గురించి ఆలోచించి జాగ్రత్తలు తీసుకోవాలని ఈపూరుపాలెం ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మనపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబ సభ్యులు బాధ్యతలు మనవని అవి నెరవేర్చాలంటే నిర్లక్ష్యం వదలాలని సూచించారు. ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాలను వివరించి, జాగ్రత్తలు సూచించారు. ఎస్సై వెంట ఏఎస్సై శివ కుమారి, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

నేడు ఏలూరి క్యాంప్ ఆఫీస్‌లో జాబ్ ఫెయిర్

మార్టూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుకున్న నిరుద్యోగులైన యువతీ యువకుల కోసం శనివారం ఉదయం 8 గంటలకు మండల పరిధిలో ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో జాబ్ ఫెయిర్‌ను ఏర్పాటు చేసినట్లు శుక్రవారం ఏలూరి క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే ఏలూరి సారథ్యంలో గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ హెచ్‌ఆర్‌కో కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో టెకమహీంద్ర కంపెనీ ఈ జాబ్‌ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు వల్లాపల్లిలో పారిశుధ్య పనులు

బల్లికురవ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని వల్లాపల్లి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నేడు శనివారం ప్రత్యేక ప్రారిశుధ్య కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఎంపీడీవో కుసుమకమారి తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం ఒక గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఎంపీడీవో తెలిపారు.

ఖాజున్నీసా బీబీ మృతిపై ఏలూరి సంతాపం



ఖాజున్నీసా బీబీ

చినగంజాం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామానికి చెందిన టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ కలాం అజాద్ సతీమణి సయ్యద్ ఖాజున్నీసా బీబీ(50) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నీలాయపాలెం, చినగంజాం, చింతగుంపల్లి గ్రామ సర్పంచ్‌లు తూమాటి శ్రీనివాసరావు, రాయని ఆత్మారావు, యార్లగడ్డ సత్యనారాయణ, నాయకులు సందు శ్రీనివాసరావు, చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, కే.భాస్కరరెడ్డి, నరహరి శ్రీనివాసరావు, దేవతోటి నాగరాజు పలు గ్రామాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు ఖాజున్నీసా బీబీ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అబ్దుల్‌కలాం అజాద్‌ని పరామర్శించారు.

రూ.4లక్షలతో మరుగుదొడ్ల ఆధునికీకరణ

ఇంకొల్లు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు బస్టాండులో 1993లో నిర్మించిన మరుగుదొడ్లు అధ్వానంగా శిథిలావస్థ చేరడంతో రూ.4 లక్షలతో వాటిని ఆధునికీకరణ పనులు చేస్తున్నట్లు చీరాల ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యామల తెలిపారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని మరో వారం రోజులలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మరుగుదొడ్లలో సీట్లు, టైల్స్, నూతన పైపులైన్లు ఏర్పాట్లతో పాటు అధునాతన సౌకర్యాలతో పనులు చేయిస్తున్నట్లు చెప్పారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

మార్టూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గురువారం అర్ధరాత్రి పెట్రోలు బంకు వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులపై ఆరుగురు వ్యక్తులు దాడిచేసి గాయపరచిన ఘటన జరిగింది. గ్రామంలో గురువారం తిరునాళ్ల జరుగుతుండడంతో అర్ధరాత్రి సమయంలో మండలంలోని జొన్నతాళి గ్రామానికి చెందిన దేసిబోయిన శ్రీనివాస్, చిట్టిబోయిన వెంకటేష్‌తో పాటు మరో నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై పెట్రోలు బంకు వద్దకు వచ్చారు.ఈ సమయంలో వారు పెట్రోలు పోయించుకునే విషయంలో ఘర్షణ పడుతూ పెట్రోలు బంకుకు చెందిన ముగ్గురు వ్యక్తులు పెంట్యాల నాగేశ్వరరావు, బోలే నరసింహారావు, ముప్పవరపు ఉదయ భాస్కర్‌పై దాడి చేసి గాయపరచారు. దాంతో పెంట్యాల నాగేశ్వరరావు స్టేషన్‌లో 6 గురు యువకులపై ఫిర్యాదు చేశారు. అనంతరం గాయపడిన ముగ్గురినీ పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషగిరిరావు శుక్రవారం తెలిపారు.

ద్విచక్రవాహనదారుడు మృతి

అద్దంకి టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వస్తున్న మాగంటి గురవయ్య (29) అనే వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అతను మృతిచెందిన సంఘటన శుక్రవారం ఉదయం అద్దంకి మండల పరిదిలోని చక్రాయపాలెం వద్ద జరిగింది. గురవయ్యకు రెండేళ్ల కిందట వివాహం జరిగింది. అతను భార్య, తల్లితో చినకొత్తపల్లిలో నివాసం ఉంటున్నాడు. అద్దంకి లోని ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం అద్దంకి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంపై సమాచారం అందడంతో ఘటనా స్థలానికి సీఐ సుబ్బరాజు, ఎస్ఐ ఖాదర్‌బాషా వచ్చి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురవయ్య భార్య హేమలత ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఖాదర్‌బాషా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కదిలే రైలులో చోరీకి యత్నం

- దుండగుడిని పట్టుకునేందుకు రైలు నుంచి దూకిన తండ్రీ, కూతురు
- తండ్రికి స్వల్ప గాయాలు, తప్పిన ప్రమాదం

చీరాలటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుడే కదులుతున్న రైలులో సెల్‌ఫోన్‌ను అపహరించి బయటకు దూకాడు ఓ దుండగుడు. అయితే అతనని పట్టుకునేందుకు కూతురు, తండ్రి ఒకరి తరువాత ఒకరు దూకారు. అయితే రైలు చిన్నగా కదులుతుండడంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలుకు చెందిన మల్లికార్జునరావు, కుమార్తెను తీసుకుని శుక్రవారం బాపట్లలోని బంధువుల వద్దకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఒంగోలు వచ్చేందుకు పూరీ - తిరుపతి రైలు ఎక్కారు. ఈక్రమంలో వారిని అప్పటికే గమనిస్తున్న ఓ దుండగుడు రైలు చిన్నగా కదులుతూ చీరాల ఫైర్ గేటు సమీపానికి రాగానే కుమార్తె చేతులో ఉన్న ఫోన్ లాక్కుని బయటకు దూకాడు. బిగ్గరగా కేకలు వేసిన కుమార్తె అతడిని పట్టుకునేందుకు ఆమె కూడా బయటకు దూకింది. దీంతో కుమార్తె కోసం తండ్రి మల్లికార్జునరావు కూడా బయటకు దూకాడు. దుండగుడి కోసం పదిమీటర్లు వరకు కుమార్తె వెంబడించగా దుండగుడు ఫోన్ వదిలేసి పరారయ్యాడు. కుమార్తెకు సురక్షితంగానే ఉండగా, తండ్రి కాలికి రాయి గుచ్చుకుని రక్త గాయమైంది. దీంతో చీరాల ఏరియా వైద్యశాలలో చేరి, చికిత్స పొందగా, రైల్వే పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



సింహపురి భగీరథుడు ఎన్టీఆర్

అభిమానులకు ఆరాధ్య దైవం, రాజకీయ నాయకులకు అన్న, రైతాంగానికి సింహపురి భగీరథుడిగా జిల్లావాసుల్లో చిరస్థాయిగా నిలిచిన మహనేత, విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు. సిరుల పంటలకు నిలయమైన కృష్ణా, గోదావరి జిల్లాల్లో ఒకటి కాకపోయినా పెన్నా నదిని జిల్లావాసుల జీవనాడిగా మార్చి నెల్లూరును ఆ జిల్లాలతో సరితూగేలా చేసిన దార్శనికుడు ఎన్టీఆర్. తన రాజకీయ అరంగేట్రం ద్వారా ఎందరికో రాజకీయ భవిష్యత్తును ఇచ్చిన ఆయన ముఖ్యమంత్రిగా కృష్ణా, పెన్నా నదుల అనుసంధానంతో జిల్లాను సస్యశ్యామలం చేశారు. జిల్లావాసులకేకాక చెన్నై నగరవాసుల దాహార్తిని తీర్చి, జిల్లాలో సమృద్ధిగా పంటలు పండేలా చేలకు గంగమ్మను పారించారు.

శనివారం | 18-1-2025
Nellore | Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు సిటీ

పక్షుల పండుగ వచ్చేసింది..



- నేటి నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్
- సూళ్లూరుపేటలో ఏర్పాట్లు పూర్తి

అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం వద్ద ఆహ్వానం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెమింగో సైకత శిఖరం



మైదానంలో ఎమ్మెల్యే విజయశ్రీతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట/తడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో సంక్రాంతి, ఏటి పండుగ ముగియగానే పక్షుల సంబరాలు వచ్చేశాయి. పులికాట్, నేలపట్టులకు వచ్చే వలస పక్షుల ప్రాముఖ్యతను తెలుపుతూ శనివారం నుంచి మూడు రోజుల పాటు పక్షుల పండగ అంగరంగ వైభవంగా జరగనుంది. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. శనివారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర టూరిజం, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ జూనియర్ కళాశాల మైదానంలో ఈ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఉదయం చెంగాళమ్మ ఆలయం నుంచి శోభాయాత్రలో మంత్రులు పాల్గొని కళాశాల మైదానంలో జరిగే ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. కళాశాల మైదానంలో స్టేజీ, స్టాల్స్, డిజిటల్ గ్యాలరీలు సిద్ధం చేశారు. భీములవారిపాళెంలో పడవషికారుకు 35 పడవలను సిద్ధం చేశారు. లైఫ్ జాకెట్‌లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. అక్కడే స్టేజీ నిర్మించి స్థానిక కళాకారుల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అటకానితిప్ప, శ్రీసిటీలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 22 మంది ఎస్‌ఐలతో సహా 400 మందితో భద్రతా ఏర్పాట్లు చేశారు. పర్యాటకులను అటకానితిప్ప, నేలపట్టు, భీములవారిపాళెంలకు తీసుకువెళ్లేందుకు ఆర్టీసీ బస్సులతో పాటు కొన్ని ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేశారు.

వలస పక్షులకు ఆహ్వానం పలుకుతూ..

ఏటా శీతాకాలంలో పులికాట్ సరస్సు, నేలపట్టు ప్రాంతాలకు వలస వచ్చే విదేశీ విహంగాలకు ఆహ్వానం పలుకుతూ వాటి విశిష్టతను తెలియజేసేందుకు 2001లో తొలిసారిగా పక్షుల పండగకు అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పటి ఉమ్మడి నెల్లూరు కలెక్టర్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో ఈ పండగ నిర్వహించారు. పులికాట్‌కు వచ్చే వలస పక్షుల్లో అరుదైన ఫ్లెమింగో పేరుతో ఈ పండగను ఏటా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు కూడా ఈ పండగను ఆట్టహాసంగా చేస్తూ వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది చేసి తర్వాత ఆపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ఫెస్టివల్‌ను అట్టహాసంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంది. ఈ ఏడాది మొత్తం 5 చోట్ల పండగ నిర్వహిస్తున్నారు. నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం, సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానం, అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం, బీవీపాలెం, శ్రీసిటీలో నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

పక్షుల పండుగ కార్యక్రమాల వివరాలు ఇలా..

తొలిరోజు..
- చెంగాళమ్మ ఆలయం నుంచి శోభాయాత్ర
- బెలూన్ల విడుదల
- ప్రారంభోత్సవం
- సాయంత్రం 4 గంటలకు పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు
- 5 గంటలకు సాంస్కృతిక వేడుకలు
- రాత్రి 7 గంటలకు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు

రెండవ రోజు
- మధ్యాహ్నం వరకు క్రీడా పోటీలు
- సాయంత్రం 4 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక పోటీలు
- రాత్రి 7 గంటలకు ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు

మూడవ రోజు
- ఉదయం 10 గంటలకు వంటల పోటీలు
- సాయంత్రం 4 గంటలకు ముగింపు వేడుక
- 5 గంటలకు సంప్రదాయ సంస్కృతి వేడుక
- 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు

నేడు స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛత దివస్!

- ప్రతి మూడో శనివారం నిర్వహించాలి
- అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతినెల మూడో శనివారం జిల్లా అంతటా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛత దివస్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి స్వచ్ఛతా కార్యక్రమాల్లో చేపట్టవలసిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. పట్టణాలు, గ్రామాల్లో వీధులను, డ్రైనేజీలను, తాగునీటి వనరులను, ఓహెచ్‌ఎస్ఆర్‌లను శుభ్రం చేయాలని ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛత కార్యక్రమాలపై ర్యాలీలు నిర్వహించి, అందరిచేత ప్రతిజ్ఞ చేయించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి, డ్వామా, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో కీలకపాత్ర వహించాలని, ప్రజలను ప్రజాప్రతినిధులను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలన్నారు. ప్రతి శాఖలో ఈ కార్యక్రమాలను సమన్వయపరచడానికి ఒక నోడల్ అధికారిని నియమించినట్లు చెప్పారు. కాగా, శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించి, వీఆర్సీ కూడలిలో ప్రతిజ్ఞ చేయనున్నారు.

అవన్నీ రద్దు!

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పులు నేటికీ శాపాలుగా వెంటాడుతూనే ఉన్నాయి. నాడు అవకాశం ఉన్నా ఉపయోగించుకోలేని అసమర్థత నేడు ప్రత్యక్షంగా ప్రజలపై ప్రభావం చూపుతోంది. జిల్లాలో కీలకమైన రోడ్డు పనులను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా లెక్కకు మించి అనుమతులు మంజూరు చేసిన ఫలితంగా ఇప్పుడు రద్దు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. అనుమతులు మంజూరు చేసినా ఆ పనులను కాంట్రాక్టర్లు చేపట్టకపోవడంతో తదుపరి కొత్త వర్కులు మంజూరు చేయడం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. వీటన్నింటి నేపథ్యంలో గత ప్రభుత్వంలో మంజూరై ప్రారంభం కాని వర్కులను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు 25 శాతంలోపు పనులు జరిగిన వర్కులను కూడా రద్దు జాబితాలోకి చేర్చింది. జిల్లాలో మూడు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) రోడ్లతో పాటు పలు ఎండీఆర్ రోడ్లు, రాష్ట్ర రహదారులు కూడా రద్దయ్యాయి.

- కీలకమైన రోడ్డు పనులు కేన్సల్ చేసిన ప్రభుత్వం
- ప్రారంభంకాని రోడ్లు, 25 శాతంలోపు వర్కులే
- ఈ జాబితాలో ముఖ్యమైన మూడు సీఆర్ఐఎఫ్ రోడ్లు
- రద్దు లిస్టులో ఎండీఆర్, స్టేట్ హైవేఎస్ వర్కులు
- గత ప్రభుత్వంలో లెక్కకు మించి అనుమతులివ్వడమే కారణం

నెల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు-మైపాడు రోడ్డు, నెల్లూరు-పొదలకూరు-సైదాపురం రోడ్డు, గూడూరు-తురిమెర్ల రోడ్లు రద్దు జాబితాలో ఉన్నాయి. ఈ మూడూ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టినవి కావడం గమనార్హం. నెల్లూరు-మైపాడు రోడ్డును రూ.48 కోట్ల అంచనాతో 2023 చివర్లో టెండర్లు పిలిచి అప్పగించారు. రెండేళ్లలో పని పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఏడాది పాటు కాంట్రాక్టర్ పని మొదలుపెట్టలేదు. గతేడాది అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వం వర్కులను రద్దు చేసేందుకు ప్రోగ్రెస్ రిపోర్ట్ తీసుకున్న తర్వాత హడావిడిగా పనులు ప్రారంభించారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం నుంచి విడుదలైన జాబితాలో ఈ వర్కు అసలు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. కానీ ఇటీవల ఆ రోడ్డు విస్తరణ చేపట్టేందుకు గతంలో వేసిన గ్రావెల్‌ను తవ్వి తరలించడంతో రోడ్డు గందరగోళంగా మారింది. మరి ప్రభుత్వానికి నివేదిక పంపాక కాంట్రాక్టర్ చేత ఆర్అండ్‌బీ అధికారులు ఎలా పనులు చేయించారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అలానే నెల్లూరు-పొదలకూరు-సైదాపురం రోడ్డును 2023లో టెండర్లు పిలిచి అప్పగించారు. కానీ ఈ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికి సుమారు 7 శాతం పనులు మాత్రమే జరిగాయి. గూడూరు-తురిమెర్ల రోడ్డును కూడా 2023లోనే టెండర్లు పిలిచి అప్పగించినప్పటికీ పనులు ఆశించిన స్థాయిలో జరగలేదు. ఇప్పటికి 13.61 శాతమే పనులు జరిగినట్లు అధికారులు నివేదికలు చెబుతున్నాయి. రద్దయిన ఈ మూడు సీఆర్ఐఎఫ్ వర్కుల విలువ రూ.123 కోట్లుగా ఉండడం గమనార్హం.

రద్దు జాబితాలో ఇంకా..

వెంకటాచలం మండలం తిరుమలమ్మపాలెం వద్ద ఉప్పుకాలువపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 కోట్లు, ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం-పొట్టేంపాడు మధ్య నక్కలవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ 2023లో జీవో విడుదల చేశారు. అయితే ఈ రెండు పనులకు ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. తిరుమలమ్మపాలెం రోడ్డు అభివృద్ధికి 2023లో రూ.3 కోట్లు, కొలనకొదురు రోడ్డు అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు చేసినప్పటికీ వాటికి ఇంత వరకూ టెండర్లు పిలవలేదు. కావలి మెయిన్ రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.55 కోట్ల అంచనాలతో 2020లో టెండర్లు పిలిచారు. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ చాలా కాలం పాటు పనులు చేయలేదు. ఆ తర్వాత కొద్దిగా పనులు చేసి ఆపేశారు. ఇప్పటివరకూ 12.3 శాతం మాత్రమే పనులు జరిగాయి. దీంతో ఈ వర్కులన్నిటినీ రద్దు చేస్తూ ఆర్అండ్‌బీ సెక్రటరీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వీటన్నింటి విలువ రూ.82 కోట్ల వరకూ ఉంది. మొత్తంగా జిల్లాలో రూ.200 కోట్ల విలువైన వర్కులు రద్దయ్యాయి. కాగా ఈ అంశంపై ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్‌ను వివరణ కోరగా ప్రారంభం కాని వర్కులు, 25 శాతంలోపు పనులు జరిగిన వర్కులను రద్దు చేసిన మాట వాస్తవమేనని చెప్పారు. ఈ ఉత్తర్వులు సెక్రటరీ నుంచి ఈఎన్‌సీకు అందాయని, వారు తమకు వాట్సాప్ ద్వారా పంపారని పేర్కొన్నారు. ఫిజికల్ కాపీలో ఒకటి, రెండు రోజుల్లో అందుతాయని ఎస్ఈ చెప్పారు.

ఇరిగేషన్ ఎస్ఈగా దేశా నాయక్

- టీజీపీ, సోమశిలకు రెగ్యులర్ ఎస్ఈలు

నెల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ రెగ్యులర్ ఎస్ఈగా ఎస్ దేశా నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ ఆయన డ్రైనేజీ డివిజన్ ఈఈగా ఉంటూ ఇన్‌చార్జ్ ఎస్ఈగా కొనసాగుతున్నారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగోన్నతులు కల్పించగా అందులో దేశానాయక్ ఎస్ఈగా ఉద్యోగోన్నతి పొందారు. తాజాగా ఆయన్ను నెల్లూరు సర్కిల్‌కే రెగ్యులర్ ఎస్ఈగా ప్రభుత్వం నియమించింది. ఇక సోమశిల ప్రాజెక్టు రెగ్యులర్ ఎస్ఈగా ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా ఉన్న బీవీ రమణారెడ్డి నియమితులయ్యారు. ఆయన కూడా ఇటీవల ఉద్యోగోన్నతి పొందారు. అలానే కడప జిల్లా జమ్మలమడుగులో జీఎన్ఎస్ఎస్ సర్కిల్‌లో ఈఈగా పనిచేస్తున్న ఎన్ రాధాకృష్ణారెడ్డిని ఉద్యోగోన్నతిపై నెల్లూరు టీజీపీ ఎస్ఈగా ప్రభుత్వం నియమించింది. చాలా కాలంగా ఇన్‌చార్జ్‌ల పాలనలో సాగుతున్న మూడు సర్కిళ్లకు ఎట్టకేలకు రెగ్యులర్ ఎస్ఈలు వచ్చారు.

పురుషులకూ పొదుపు సంఘం

- 'డ్వాక్రా' తరహాలో ఏర్పాటుకు కసరత్తు
- వివరాలు సేకరిస్తున్న మెప్మా అధికారులు
- లక్ష్యం 200 గ్రూపులు.. ఇప్పటిదాకా 21

నెల్లూరు (హరనాథపురం) జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటివరకు మహిళల పొదుపు సంఘాల (డ్వాక్రా) గురించి విన్నాం. మరి పురుషుల పొదుపు సంఘాల గురించి ఎప్పుడైనా విన్నారా!?. అయితే, కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. మహిళలతో సమానంగా వివిధ అసంఘటిత రంగాల్లో ఉన్న పురుషులతో గ్రూపులను ఏర్పాటు చేయించి.. వారి చేత కూడా పొదుపు చేయించి వారూ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి చర్యలు చేపట్టింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఈ పురుషుల పొదుపు సంఘాలు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే అసంఘటిత రంగాల్లో ఉన్న పురుషుల వివరాలను మెప్మా అధికారులు సేకరిస్తున్నారు. జిల్లాలో 200 గ్రూపులు ఏర్పాటు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు 21 గ్రూపులను ఏర్పాటు చేశారు. తెలుగుదేశం పార్టీ తొలుత డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయగా, 10 మంది మహిళా సభ్యులతో ఒక్కో సంఘాన్ని నెలకొల్పి పొదుపు చేయించారు. పొదుపు ఆధారంగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లించే వారికి రుణం పెంచుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ఒక్కో సంఘానికి రూ.20లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. జిల్లాలో 15,024 మహిళా సంఘాలు ఉండగా, 1.5 లక్షల మంది సభ్యురాళ్లు ఉన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొంది చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇదే తరహాలో పురుషుల గ్రూపులను ఏర్పాటు చేయించి తొలి విడతలో ఒక్కో గ్రూపునకు రూ.50 వేల నుంచి లక్ష వరకు రుణం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించిన గ్రూపులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకర్లు రుణం మొత్తాన్ని పెంచి ఇస్తారు.



పురుషుల పొదుపు గ్రూపు సభ్యులకు వివరాలు తెలియజేస్తున్న మెప్మా అధికారి

ఈ రంగాల వారికి..

భవన నిర్మాణ కార్మికులు, రిక్షా కార్మికులు, వాచ్‌మెన్, డెలివరీ బాయ్స్, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న వారు ఇలా 18 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఉన్న పురుషులు, పురుషుల గ్రూపులుగా (వనరు లబుల్ గ్రూప్స్) చేరవచ్చు. గ్రూపుల ఏర్పాటుకు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉండాలి.

200 గ్రూపుల లక్ష్యం

జిల్లాలో 200 పురుషుల పొదుపు గ్రూపులు ఏర్పాటు చేయడానికి మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు, బుచ్చి మున్సిపాలిటీలలో ఈ గ్రూపులను ఏర్పాటు చేయిస్తున్నారు. ఇప్పటికే నెల్లూరులో 21 గ్రూపులను ఏర్పాటు చేయించారు. ఈ నెలాఖరులోగా మిగిలిన గ్రూపుల ఏర్పాటుకు మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ గ్రూపులలోని సభ్యులతో పొదుపు అలవాటు చేయించడమేగాక వారికి రుణాలు ఇచ్చేలా బ్యాంకర్లతో మాట్లాడుతున్నారు.

21 గ్రూపులు ఏర్పాటు చేయించాం



జిల్లావ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల పరిధిలో 200 పురుషుల పొదుపు గ్రూపులను ఈ నెలాఖరులోగా ఏర్పాటు చేయించాలని నిర్ణయించాం. ఇప్పటికే 21 గ్రూపులను ఏర్పాటు చేయించాం. మహిళా పొదుపు సంఘాల మాదిరిగానే పురుషుల చేత పొదుపు సంఘాల ఏర్పాటు చేయించి, వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి, వారు ఆర్థికంగా నిలదొక్కుకుని జీవనోపాధి పొందేలా చర్యలు తీసుకుంటున్నాం.

- రాధమ్మ, మెప్మా పీడీ

ఇప్పుడేం చేద్దాం!?

- వైసీపీ హయాంలో అడ్డగోలు బదిలీలు
- 49 మంది టీచర్లకు దొడ్డిదారిన స్థానచలనాలు
- ఆ ఉత్తర్వులను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- కమిషనర్ చుట్టూ ఉపాధ్యాయుల ప్రదక్షిణలు

వైసీపీ హయాంలో కౌన్సెలింగ్‌తో సంబంధం లేకుండా అడ్డదారుల్లో బదిలీలు చేయించుకున్న ఉపాధ్యాయుల్లో ఇప్పుడు వణుకు మొదలైంది. జిల్లాలో రెండు విడతలుగా 49 మంది టీచర్లకు సిఫారసు బదిలీలను నాటి విద్యాశాఖాధికారులు చొరవ చూపి బ్లాక్ చేసిన వేకెన్సీలు, పదోన్నతుల్లో ఏర్పడిన ఖాళీల్లో పోస్టింగ్‌ల ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ప్రస్తుతం ఆ ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో సదరు ఉపాధ్యాయులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.



నెల్లూరు(విద్య), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొంతమంది ఉపాధ్యాయులు వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటూ నాటి మంత్రులు, నేతలను నమ్ముకుని సిఫారసు బదిలీలకు రూ.లక్షల్లో ఖర్చు చేశారు. దీంతో ఎన్నికలకు ముందు హడావుడిగా ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు వెలువడడంతో జిల్లాలో నాడు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నాడు ఎస్‌జీటీలు, ఎస్ఏలు కలిపి 49 మంది బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు సీల్డ్‌కవర్‌లో జిల్లా విద్యాశాఖకు చేరాయి. జిల్లాలో గత ఏడాది జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో దాదాపు 4వేలమంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది. జీఓ నెం 117 ఉత్తర్వులు, పాఠశాలల విలీనం, రేషనలైజేషన్ తదితర కారణా లతో పలువురు టీచర్లకు అప్పటివరకు పనిచేసిన ప్రాంతం, మండలం, డివిజన్ దాటి సుమారు 100 నుంచి 200 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు బదిలీ కావాల్సి వచ్చింది. ఈ నిబంధనలను సవరించాలని దూరప్రాం తాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు నాటి వైసీపీ ప్రభుత్వాన్ని వేడుకున్నా పట్టించుకోలేదు. కానీ సిఫారసు బదిలీలకు మాత్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ముడుపులు ఇచ్చిన వారికి నచ్చిన స్థానాలను కేటాయించింది.

బదిలీల రద్దుపై సందిగ్ధత

వైసీపీ ప్రభుత్వంలో అడ్డదారుల్లో వెళ్లిన కొంతమంది ఉపాధ్యాయులు ప్రస్తుతం సందిగ్ధంలో ఉన్నారు. నాడు పోటాపోటీగా క్యూలు కట్టడంతో పాటు రూ.లక్షలు చెల్లించి తెచ్చుకున్న ఆర్డర్‌లను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. వీరిలో కొంతమంది న్యాయస్థానా లను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో విద్యాశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం వారు పని చేస్తున్న ప్రాంతాల నుంచి తొలగిం చడంతో తమకు పాఠశాలలు కేటాయించాలని విద్యాశాఖ కమిషనర్‌ను కలిసినట్లు సమాచారం. మెడికల్ లీవ్‌లు పెట్టుకుని వెళ్లాలని, వచ్చే విద్యాసంవత్సరంలో జరిగే సాధారణ బదిలీల్లోనే తిరిగి అవకాశం కల్పిస్తామని చెప్పడంతో పలువురు టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఉత్తర్వులు ఇచ్చిన సమయంలో జిల్లాలో పనిచేసిన డీఈఓతోపాటు ఆయనకు సహకరించిన సిబ్బంది వివరాలను కూడా ఉన్నతాధికా రులు రహస్యంగా సేకరిస్తున్నారు. దీంతో నాడు జేబులు నింపుకున్న అధికారులు, సిబ్బంది ఈ సమస్యను ఎలా అధిగమించాలన్న ఆలోచనలతో కమిషనర్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. అక్రమ బదిలీలపై ఎప్పుడు ఎలాంటి ఉత్తర్వులు జిల్లాకు వస్తాయోనని అందరిలో ఉత్కంఠ నెలకొని ఉంది.

అనుమతులెందుకు... కట్టేయ్!


బాలాజీనగర్‌లో అనుమతులు లేని భవనం

నెల్లూరు నగరంలో అక్రమ నిర్మాణదారులు ఎంతగా బరితెగించారో చెప్పడానికి ఈ చిత్రంలోని నిర్మాణమే నిదర్శనం. బాలాజీనగర్ ప్రాంతం చీపురకట్ట వీధి మలుపు వద్ద ఓ వ్యక్తి ఏకంగా రెండంతస్తుల భవనాన్ని దుకాణాలతో కట్టేశాడు. దీనికి కార్పొరేషన్ నుంచి అనుమతులు లేవు. అయినా.. మనల్ని ఎవరు అడుగుతాడు?, అడిగినా సొమ్ములిచ్చేస్తే సరిపోద్దనుకున్నాడో ఏమో తెగించి కట్టేశాడు. దీని విలువ సుమారు రూ.2కోట్ల పైమాటే. కానీ ఇదికాస్తా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ నోటీసుకెళ్లింది. వెంటనే కూల్చేయమని ఆయన ఆదేశించారు. ఈ నిర్మాణం జరుగుతున్న సమయంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని గురువారం కార్పొరేషన్‌లో జరిగిన సమీక్షలో సిటీ ప్లానింగ్ అధికారులను మంత్రి నిలదీశారు. దీంతో యంత్రాంగం రంగంలోకి దిగింది. రోడ్ల పక్కన నిలువ నీడకోసం పేదలు వేసుకునే గుడిసెలను ఉన్నపళంగా కూల్చేసే అధికారులు నడిరోడ్డుపై ఇలాంటి నిర్మాణాలను ఎందుకు అడ్డుకోరని నగర వాసులు ప్రశ్నిస్తున్నారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

'కుష్ఠు' నివారణకు సహకరించాలి

- స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కుష్ఠు వ్యాధి నివారణకు స్వచ్ఛంద సంస్థలు పూర్తి సహకారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత పిలుపునిచ్చారు. శుక్రవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి జరిగే కుష్ఠు వ్యాధి సర్వేకు తగిన సహకారం అందించాలని కోరారు. సర్వేలో ఏ విధంగా పాల్గొనాలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేంద్రబాబు, నరసింహులు, ప్రసాద్ ఆచారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కాగా, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో ఆవిష్కరించారు. ప్రభుత్వ వైద్య పథకాల అమలుకు పీహెచ్‌పీలు సహకరించాలని కోరారు.


పీహెచ్‌పీల క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు, పీహెచ్‌పీ నాయకులు

ఆ రిజిస్ట్రేషన్లు రద్దు చేయండి

నెల్లూరు(సిటీ), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థకు చెందిన రిజర్వు స్థలాలను కొందరు వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నందున వాటి రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని కమిషనర్ సూర్య తేజ రిజిస్ట్రారుకు లేఖ రాసిన విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నెల్లూరు బిట్-1లోని 2006లో వేసిన లేఅవుట్‌లో సర్వే నెం. 140, 141లో ప్రజాప్రయోజనాలకు వదిలిన 250 అంకణాల స్థలాన్ని కొందరు వ్యక్తులు అక్ర మంగా తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, వాటి తాలూకు పత్రాలు రద్దు చేయాలని ఆయన రిజిస్ట్రేషన్ శాఖ అధికారు లను కోరారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పక్షుల కిలకిలలే పులికాట్ భాష!

కథనం: దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

మంచు కురిసేవేళ పక్షుల కిలకిలరావాలతో పులికాట్ కొత్త అందాలు సంతరించుకుంది. బాల భానుడి లేలేత కిరణాలతో సంగమించి పుత్తడి పులికాట్‌లా సాక్షాత్కరిస్తోంది. కదిలే పడవలు.. వలలు విసిరే జాలర్లు.. బిలబిలమంటూ వాలే వలస పక్షులు.. సుందర మనోహర దృశ్యం ఆవిష్కృతమవుతోంది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే దారికి ఇరువైపులా పక్షులు సందడి చేస్తుంటాయి. తడ సమీపంలోని భీములవారిపాళెం నుంచి ఇరకం దీవి వైపునకు పడవలో వెళ్తే ఆ అనుభూతి మరోలా ఉంటుంది. ఫ్లెమింగో పండుగకు జిల్లా సిద్ధమవుతున్న వేళ పులికాట్ సందర్శన పర్యాటకులకు ఈ ఏడాది అద్భుత ఆనందాన్ని ఇస్తుంది. పర్యాటకులకు స్వాగతం పలుకుతూ పులికాట్ అందాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ ఇలా వడ్డిస్తున్నారు...


ఫ్లెమింగో

గ్రేట్ ఎగ్రేట్ (పెద్ద తెల్ల కొంగ)

ఎర్రకాళ్ల కొంగల జపం

పక్షుల గణాంకంలో అటవీశాఖ సిబ్బంది



పులికాట్‌లో దొరికే అరుదైన ముక్కోలాసు చేపలు


పెలికాన్స్ (గూడబాతులు)


రెడ్ క్రస్టెడ్ పోచ్ఛ్ (ఎర్ర తల చిలువ)


కామన్ కూట్ (నామాల కోడి)


పక్షులూ.. పడవలూ

ఇదీ ఈ ఏడాది పక్షుల లెక్క..

చెన్నై నుంచి వచ్చిన నిపుణులు పక్షుల పోబడిని గమనిస్తూ లెక్కలు కడుతున్నారు. శక్తిమంతమైన బైనాకులర్లు, వీడియో కెమెరాలతో వీరు పక్షులను లెక్కకడుతున్నారు. వీరి అంచనా ప్రకారం ఈ ఏడాది ఇప్పటిదాకా పులికాట్‌ను ఆశ్రయించిన వలస పక్షుల వివరాలు ఇవీ...

పక్షి పేరు	వాటి సంఖ్య
గ్రేటర్ ఫ్లెమింగో(రాజహంస) :	27,153
గ్రే పెలికాన్ (గూడబాతు) :	425
పెయింటెడ్‌స్టార్క్స్(ఎర్రకాళ్ళ కొంగ) :	2616
లిటిల్‌ఈగ్రేట్స్(చిన్న తెల్లకొంగ) :	7962
లిటిల్ కార్మోరెంట్స్(చిన్న నీటికాకులు):	9862
లార్జీకార్మోరెంట్స్(పెద్ద నీటికాకులు) :	211
లార్జీఈగ్రేట్స్(తెల్ల కొంగ) :	1929
గ్రేహెరాన్(నారాయణపక్షి) :	280
పాండ్ హెరాన్(గుడ్డి కొంగ) :	595
నైట్‌హెరాన్(చింత వాఖి) :	347
ప్రొపెల్ హెరాన్(ఎర్రనారాయణపక్షి):	16
కర్లెవ్(ఉల్లంకి పిట్ట) :	44
గ్లోస్‌సి ఐబీస్(తాటి కంకణం) :	4323
కాటిల్ ఈగ్రేట్(పశువుల కొంగ) :	6589
ఇండియన్ మూర్హెన్(తెల్లబొర్ర నీటి కోడి) :	988
యురేషియన్ కూట్(నామాల కోడి) :	4487
కామన్ కింగ్ ఫిషర్(చిన్న నీల బుచ్చిగాడు) :	176
పర్పల్ స్విమ్‌ఫెన్(సుల్తాన్ పక్షి) :	637
డాబ్ చిక్(బుడ్డకోడి) :	1086
సీగల్స్(సముద్రపు గౌరుకాకి) :	893
రెడ్ వాటిల్ లాప్వింగ్(ఎర్ర తీతువు పిట్ట) :	86
వైట్ బ్రెఆస్టేర్డ్ కింగ్ ఫిషర్(తెల్లచుక్కల నీల బుచ్చిగాడు) :	41
స్పాట్ బిల్ డక్(చుక్కమూతిబాతు) :	211
బ్లాక్ వింగ్డ్ స్టిల్(నల్ల రెక్కల ఉల్లంకి) :	2482
పైడ్ కింగ్ ఫిషర్(నీళ్ళ బుచ్చిగాడు) :	28
26. గ్రాబ్ ప్లోవర్(వాడర్ పక్షి) :	196
కామన్ టర్న్(రివ్వు పిట్ట) :	211
కాస్పియన్ టర్న్(సముద్రపు కాకి) :	373
రివర్ టర్న్(రామదాసు) :	440
వింబ్రెల్ (పెద్ద ఉల్లంకి) :	13
ఓపన్ బిల్ స్టార్క్స్(నత్తగుల్ల కొంగలు) :	8165
వైట్ ఐ బీస్(తెల్లకంకణాయి) :	5556
మార్ష్ హారియర్(చిత్త నేల గద్ద) :	03
ఫాసియానాస్ టిల్లేడ జాకనా(నెమలి తోక కొంగ) :	720
లెసర్ విజిలింగ్ డక్(సన్న ఈల చిలువ) :	200
రింగ్ ప్లోవర్ (పెద్ద బైతు ఉల్లంకి) :	353
బ్లాక్ టైల్డ్ గాడ్విట్(తొండు ఉల్లంకి) :	353
ప్లామ్ స్విప్ట్స్(చటక పక్షి) :	114
ఫ్లై క్యాచర్స్ (పిగిలి పిట్ట) :	96
బ్లాక్ డ్రోంగో (పసల పోలిగాడు) :	62
గ్రీన్ బీ ఈటర్స్(చిన్న పస్సిరికి) :	289
పిన్టైల్ (సూదితోక బాతు) :	2450
కెంటిష్ ప్లోవర్(చిన్న బైతు ఉల్లంకి):	98
కామన్ రెడ్షాంక్(ఎర్రకాళ్ళ ఉల్లంకి) :	129
కామన్ గ్రీన్షాంక్(పచ్చకాళ్ళ ఉల్లంకి):	268
గ్రీన్ శాండ్ పైపర్(నల్ల ఉల్లంకి) :	342
సూపన్‌బిల్(తెడ్డు మూతి కొంగ) :	122
డార్టర్(పాము మెడ బాతు) :	08
మొత్తం :	117216



అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాల్సిందే

- మరో 337 అనధికార లేఅవుట్ల గుర్తింపు
- ప్రత్యేక బృందాలతో తొలగిస్తాం
- నుడా చైర్మన్ కోటంరెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(జడ్పీ), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) పరిధిలోని లేఅవుట్లలో 10శాతం రిజర్వుడు స్థలం వదిలి నుడా అనుమతులు పొందకుంటే వాటన్నింటినీ తొలగిస్తామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. అక్రమ లేఅవుట్లపై నుడా టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన నుడా కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆనంతరం మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని, లేకుంటే వాటిని తొలగించేందుకు మంత్రి నారాయణ ఆదేశాల మేరకు నుడా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఇప్పటికే అక్రమ లేఅవుట్ దారులకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. నుడా పరిధిలో ఇప్పటికే 260 అక్రమ లేఅవుట్లను గుర్తించామని, ఇవికాక కొత్తగా 77 లేఅవుట్లను గుర్తించినట్లు తెలిపారు. వారంతా లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోకపోతే లేఅవుట్లలో రోడ్లు, హద్దురాళ్లని తొలగిస్తామన్నారు. ప్రజలు కూడా అవగాహనతో మెలగాలని కోరారు. ఈ సమావేశంలో టీపీవో హిమబిందు, కార్యదర్శి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర డీఎస్పీగా సింధుప్రియ



నెల్లూరు(క్రైం), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర డీఎస్పీగా పెసర సింధుప్రియను నియమిస్తూ శుక్రవారం రాత్రి రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నగర డీఎస్పీగా పనిచేస్తున్న డీ శ్రీనివాసరెడ్డిని పోలీసు కేంద్ర కారాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన 2022 నవంబరులో నగర డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. కాగా, పెసర సింధుప్రియ తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా వీరారెడ్డిపల్లిలో జన్మించారు. సీడీపీవోగా పనిచేస్తూ 2022లో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష రాసి డీఎస్పీగా ఎంపికయ్యారు. ప్రొబేషన్ పూర్తిచేసుకోవడంతో ప్రభుత్వం నెల్లూరు నగర డీఎస్పీగా తొలి పోస్టింగ్ ఇచ్చింది.

ఉమ్రా యాత్ర పేరుతో మోసం


నెల్లూరు(క్రైం) : ఉమ్రా యాత్ర పేరుతో చెన్నైకు చెందిన ఓ ట్రావెల్స్ సంస్థ ముస్లింల నుంచి రూ.లక్షలు తీసుకుని బోర్డు తిప్పేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని వెంగళరావు నగర్ ఎన్‌సీసీ కాలనీకి చెందిన సయ్యద్ ఖాదర్ షరీఫ్ తన భార్య బంధువు రిజ్వాన్ ద్వారా నగరానికి చెందిన జబ్బార్ మౌలానాను కలిశారు. ఉమ్రా యాత్రకు వెళ్లాలని తెలిపారు. ఆయన ద్వారా వెంగళరావు నగర్‌కు చెందిన అబ్దుల్ ముజీర్‌ను, అతని ద్వారా ట్రావెల్ నిర్వాహకుడు జాఫర్, అతని పీఏ సలాంతో మాట్లాడారు. యాత్రకు ఒక్కొక్కరికి రూ.55 వేలు ఖర్చు అవుతుందని, ఆలస్యం అయితే రూ.60 వేలు చెల్లించాల్సి వస్తుందని జాఫర్ నమ్మబలికాడు. దీంతో షరీఫ్, రిజ్వాన్ కుటుంబ సభ్యులు ముజీర్ ద్వారా రూ.3.40 లక్షలు ట్రావెల్ సంస్థకు పంపారు. వారి ఒరిజనల్ సర్టిఫికెట్లను సైతం అందజేశారు. త్వరలో వీసాలు పంపుతామని ట్రావెల్ సంస్థ తెలిపింది. రోజులు గడుస్తున్నా వీసాలు రాకపోవడం, సంస్థ ఫోన్లు పనిచేయకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది. ఈ నెల 6వ తేదీ చెన్నైకు వెళ్లి చూడగా సంస్థ మూసివేసి ఉంది. దీంతో మోసపోయామని గ్రహించి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో చెన్నైలో నిందితుల కోసం గాలిస్తున్నారు.

సింహపురి భగీరథుడు ఎన్టీఆర్

- 'సోమశిల', 'తెలుగు గంగ'తో జలసిరి
- జిల్లాతో ప్రత్యేక అనుబంధం
- పార్టీ రూపకల్పనకు మంతనాలు ఇక్కడే!
- నేడు వర్ధంతి

సోమశిల వద్ద జలాశయం నిర్మించాలనేది 1920 కాలం నుంచే ప్రజల ఆకాంక్ష. 1975లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సోమశిల ప్రాజెక్టు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అయితే ఎలాంటి పురోగతి లేదు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక కృష్ణా నదికి పెన్నమ్మను అనుసంధానించి 78 టీఎంసీల సామర్థ్యంతో 1988లో 'సోమశిల'కు పురుడు పోశారు. నాటి ఎంపీ బెజవాడ గోపాలరెడ్డి కోరిక మేరకు ఉత్తర కాలువ నిర్మాణంతో కావలి, సంగం, అల్లూరు, దగదర్తి, బోగోలు, జలదంకి మండలాల్లో లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించారు. తన మానస పుత్రికగా 'తెలుగు గంగ' ప్రాజెక్టును తీర్చిదిద్దారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మట్టి కట్ట కలిగినదిగా కండలేరు రిజర్వాయర్‌ను నిర్మించారు. 68 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాతోపాటు, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు, తమిళనాడు రాష్ట్రానికి నీటిని తరలించారు.

- నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)



దశాబ్దాల అనుబంధం

రామారావుకు జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. 1951 మార్చి 15న విడుదలైన పాతాళభైరవి చిత్రం శతజయంతి వేడుకలకు తొలిసారి నెల్లూరు జిల్లాకు వచ్చారు. 1960లో కోట ప్రాంతంలో ఎన్టీఆర్‌కు ప్రజలు గండపెండేరం తొడిగి సత్కరించారు. నెల్లూరు కనకమహల్‌లో అడవి రాముడు చిత్రం శతజయంత్యుత్సవం, అక్కినేని నాగేశ్వర రావు ప్రేమాభిషేకం విజయోత్సవం జరిగిన పోలీసు పరేడు మైదానానికి తన సతీమణి బసవతారకంతో కలిసి హాజరయ్యారు. ఆ దంపతులకు నాడు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బెజవాడ పాపిరెడ్డి తదితర ఉద్ధండులతో పొగతోటలోని పాపిరెడ్డి బంధువుల గృహంలోనే మంతనాలు సాగించి తెలుగుదేశం పార్టీకి రూపురేఖలు తీర్చిదిద్దారు. నటుడిగా, రాజకీయవేత్తగా ముఖ్య మంత్రి గా విశ్వవిఖ్యాతం చెందడానికి ఎన్టీఆర్‌కు బలం, బలగం అభిమానులే. 1960లోనే ఎన్టీఆర్ అభిమానులు సంఘంగా ఏర్పడ్డారు. 1962లో దానిని నందమూరి ఫ్యాన్స్‌గా రిజిస్టర్ చేశారు. వ్యవస్థాపక కార్యదర్శిగా కత్తుల వెంకటరత్నం (అయ్యప్పగుడి దేవస్థానం కార్యదర్శి, వెంకటరత్నం విజయా ప్రెస్ అధినేత) నెల్లూరు కాపువీధి కుర్రాళ్లతో అభిమాన సంఘం ఏర్పాటు చేశారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యే వరకు ఎన్టీఆర్ అభిమానులుగా ఆయనతోపాటు బండారు వేణుగోపాల్‌రెడ్డి, నజీర్ బాషా, బాలకృష్ణారెడ్డి, భూపతి రాజు, పుల్లయ్య, సుధాకర్, దశయ్య, తదిత రులు ఎన్టీఆర్‌ని ఆరాధి స్తూ ఎన్నో కార్యక్రమాలు చేశారు. అనంతరం తాళ్లపాక రమేష్‌రెడ్డి అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం ఏర్పాటు చేశారు.

పదవులు ఆశించలేదు..

అభిమానం పొందాం నందమూరి తారక రామారావు చలనచిత్ర రారాజుగా, ప్రజా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అభిమానిగా ఏనాడూ పదవులు ఆశించలేదు. ఆయన జీవించి ఉన్నంత వరకు ఆయన అభిమానాన్ని చూరగొన్నాం. అదే మాకు సంతృప్తి నిచ్చింది.

- కత్తుల వెంకటరత్నం, నందమూరి ఫాన్స్ (1962) వ్యవస్థాపక కార్యదర్శి,

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే కళాకారుడిగా..

నాకు ఊహ తెలిసిన నాటి నుంచి ఎన్టీఆర్ అంటే అభిమానం. ఆయన స్ఫూర్తితోనే కళాకారుడిగా ఈ వృత్తిని ఎంచుకున్నాను. ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలోనే ఉన్నాను. 1982లో పార్టీ ఆవిర్భావ సందర్భంగా నవాబుపేట నుంచి జరిగిన చైతన్య రథం ర్యాలీలో ఎన్టీఆర్‌ను ప్రత్యక్షంగా చూశాను. ఆ తర్వాత ప్రేమాభిషేకం శత జయంతి వేడుక, ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా విజయవాడలో నిర్వహించిన మహానాడులో, 1989లో ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు చూశాను.

- దోర్నాల హరిబాబు, టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం మాజీ అధ్యక్షుడు

నేటి కార్యక్రమాలు

ఎన్టీ రామారావు 29వ వర్ధంతి శనివారం ఉదయం 9.30 గంటలకు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జరుగుతుందని, పార్టీ శ్రేణులు అందరూ హాజరు కావాలని జిల్లా కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది. కాగా, నగరంలోని నర్తకీ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉదయం 10.30గంటలకు వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ దంపతులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

పెదపవనిలో ఉద్రిక్తత

- వివాదాస్పద స్థలంలో ఇరువర్గాల ఘర్షణ
- అదుపుదాటిన పరిస్థితి.. లాఠీలకు పనిచెప్పిన పోలీసులు

లింగసముద్రం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పెదపవనిలోని వివాదాస్పద స్థలంపై శుక్రవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని పీర్లచావిడి స్థలం విషయమై గత ఏడాది నుంచి జడ్పీటీసీ సీహెచ్ నళినీ పద్మ, షేక్ రఫీ వర్గీయుల మధ్య పలుమార్లు ఘర్షణ జరిగింది. అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో షేక్ రఫీ ఆధ్వర్యంలో భారీగా చేరుకున్న జనం స్థలంలో ఇనుప కంచె వేసేందుకు ప్రయత్నించారు. అయితే ఈ స్థలం తాము కొనుగోలు చేశామంటూ జడ్పీటీసీ నళినీ పద్మ తమ వర్గీయులు వచ్చి అడ్డుకున్నారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య మాటలు పెరిగి ఒకరినొకరు నెట్టుకున్నారు. సిబ్బందితో సహా అక్కడకు చేరుకున్న ఎస్ఐ మహబూబ్ సుబానీ వారిని విడదీసేందుకు ప్రయత్నించినా వినకపోవడంతో లాఠీలతో పని చెప్పించారు. ఈ విషయాన్ని ఎస్ఐ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. గుడ్లూరు సీఐ మంగారావు, వలేటివారి పాలెం, గుడ్లూరు ఎస్ఐలు, తహసీల్దార్ ఎస్.సీతా మహాలక్ష్మి వచ్చి సర్ది చెప్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ స్థలాన్ని తాను 2020లో ముస్లిం పెద్దల నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని, ప్రస్తుతం ఈ సమస్య కోర్టు పరిధిలో ఉందని నళినీ పద్మ అధికారులకు తెలిపారు. ఈ స్థలాన్ని అక్రమంగా కొనుగోలు చేశారని, అవన్నీ నకిలీ పత్రాలు అని అసలు పత్రాలను బయటకు తీసుకొని రావాలని రఫీతోపాటు మిగిలిన వారు డిమాండ్ చేశారు. ఈ స్థలంలో నుండి వారు బయటకు వెళ్లక పోవడంతో నళినీపద్మ తన అనుచరులతో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు.


పెదపవని పీర్లచావిడి స్థలంలో గుమికూడిన జనం

వ్యవసాయ పనులకు కూలీల కొరత

- రైతులకు తప్పని ఇబ్బందులు
- సుదూర ప్రాంతాల కూలీల తరలింపు
- వ్యవసాయానికి 'ఉపాధి' పనులు

అనుసంధానం చేయాలంటున్న రైతులు

కొండాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):వర్షాలు ఒక్కసారిగా పడటం.. అన్నిరకాల వ్యవసాయ పనులు ఒకేసారి రావడంతో కూలీలకు డిమాండు ఏర్పడింది. సకాలంలో జరగాల్సిన పనులు కూలీల కొరతతో జరగడం లేదు. ఎక్కు వ నగదు చెల్లించినా కూలీలు దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదీ మండలంలోని రైతుల పరిస్థితి.

● 5వేల ఎకరాలలో వరి సాగు..

మండలంలోని 19పంచాయతీల పరిధిలో చెరువులు, బోర్ల కింద 5వేల ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. నార్లు పూర్తి చేసుకొన్న పంట పొలాల్లో కంకి దశకు చేరుకున్నాయి. ఎక్కువభాగం భూముల్లో వరినాట్లు పూర్తయి కలుపు దశకు చేరుకున్నాయి. కలుపులు తీసేం దుకు ఎకరానికి 5నుండి 8మంది వరకు అవస రం ఉన్నా తీయడానికి కూలీలు దొరకడం లేదు.

● రోజు కూలీ రూ.500 నుంచి 700 వరకు..

కూలీలు అడిగిన మొత్తాన్ని భరించేందుకు రైతు సిద్ధంగా ఉన్నా కూలీలు రెండురోజులు తర్వాత వస్తామని చెబుతున్నారు. చేసేదేమిలేక రైతు వారి చుట్టూ తిరుగుతున్నారు. రోజుకు రూ.500 నుండి రూ.7వందలు వరకు కూలీలు డిమాండు చేస్తున్నారు. అలాగే పొగాకు సాగుచేసిన రైతులు సదరు భూమిలో గడ్డిని తొలగించేందుకు కూలీలు తప్పనిసరి అవసరం అయ్యింది.

ఎక్కువ కూలి చెల్లించి తరలింపు..

వరి, పొగాకుతో పాటు శనగ, మిరప సాగు చేసిన రైతులు తమ భూముల్లో గడ్డిని తొలగించేందుకు కూలీలు అవసరం అయ్యింది. అన్ని వ్యవసాయ పనులు ఒకే సమయంలో రావడంతో కూలీలకు డిమాండు పెరిగింది. ఎలాగైనా తమ పనులను పూర్తి చేసుకోవాలని రైతులు ఇతర గ్రామాలకు వెళ్లి అధిక కూలీ చెల్లించి ఆటోలలో తరలిస్తున్నారు. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతున్నాయిని వాపోతున్నారు. ప్రభుత్వాలు అన్ని పంటలకు మద్దతు ధరను పెంచాలని కోరుతున్నారు.



పొగనాట్లు వేస్తున్న కూలీలు

ఉపాధి పనులను అనుసంధానం చేయాలి



కూలీలకు ఉన్న డిమాండుతో వ్యవసాయం చేయాలంటే రైతులు ముందుకు రావడం లేదు. ఉపాధి హామీ కింద ప్రభుత్వం వ్యవసాయ పనులను అనుసంధానం చేయాలి. కానీ అలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

-మచ్చా ప్రసాదు, సాయిపేట

కూలీల కొరత ఉంది



5 ఎకరాల వరకు వరి సాగు చేశా. వరి విత్తనాలు చల్లిన భూమిలో వరి నాట్లు వేసేందుకు కూలీల చుట్టూ తిరగాల్సి వస్తుంది. రోజుకు రూ.500 చెల్లించినా పనులకు రావడం లేదు. కూలీల కొరతతో తీవ్ర ఆందోళన చెందుతున్నాం.

- మామిళ్లపల్లి శ్రీనివాసులు, మవరప్పాడు

చెరువు కట్టల పటిష్టతకు ప్రత్యేక చర్యలు

శ్రీనాథ్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ, కలిగిరి



ఇంటర్వ్యూ...

కలిగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చెరువు కట్టల పటిష్టతకు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మండల ఇరిగేషన్ ఏఈ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. చిన్నపాటి మరమ్మతులు తలెత్తిన వెంటనే స్థానిక రైతుల సహాయంతో సరిచేస్తామన్నారు.

? ఎన్ని చెరువులున్నాయి.

! 48చెరువులున్నాయి. ఈ ఏడాది కురిసిన వర్షాలకు 12 చెరువుల కింద పొలాలకు సాగునీటి సమస్య ఉండదు.

? మరమ్మతులకు గురైన చెరువుల వద్ద చేపట్టిన చర్యలు.

! చిన అన్నలూరు, క్రాకుటూరు, గుడ్లదొన చెరువు తూముల వద్ద లీకుల నివారణకు ఇసుక బస్తాలు వేసి లీకేజీలు నివారించాం.

? గ్రామకొలను పనుల్లో పురోగతి.

! గత ప్రభుత్వంతో 30శాతం మేర పనులు మాత్రమే జరిగాయి. కూటమి ప్ర భుత్వంలో మిగిలిన పనులు జరుగుతున్నాయి.

? ప్రపంచ బ్యాంకు నిధులతో చేస్తున్న పనులు ఏ దశల్లో ఉన్నాయి.

! పెదఅన్నలూరు పాతచెరువు, కుడుమలదిన్నెపాడు, తెల్లపాడు చెరువుల అభివృద్ధి పనులు ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టారు. 50శాతం మేర మాత్రమే పనులు జరిగాయి. బిల్లులు రాకపోవడంతో ప్రస్తుతం ఆ పనులు ఆగిపోయి ఉన్నాయి.

అభివృద్ధి పనులతో మారుతున్న గ్రామాల రూపురేఖలు

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సీసీరోడ్డు శిలాఫలకంను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, జనవరి17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులతో గ్రామాల రూపురేఖలే మారిపోతున్నాయని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన రావులకొల్లులో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. రోడ్డుకిరువైపులా మొక్కలు నాటి, సీసీరోడ్లు, గోకులం షెడ్డు ప్రారంభోత్సవం చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిని పూర్తిగా విస్మ రించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు పరిగెడుతున్నాయని చెప్పారు. ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, ఎంపీపీ మెట్టుకూరు శిరీష, సర్పంచ్ వెంగపనాయుడు, కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దళిత రైతుల ఆందోళన

దగదర్తి (బిట్రగుంట) జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనంతవరం గ్రామానికి చెందిన దళితులు గాలి ప్రభుదాసు, వీర దాసు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్లు సాల్మన్‌రాజ్ సంఘం సభ్యులతో కలిసి నిరసనలో పాల్గొని మాట్లాడారు. దళితులు వారి సొంత పొలంలో వేసుకున్న వరినాటుపై గడ్డి మందు కొట్టడంతో పైరు ఎండిపోయిందని వాపోయారు. అదే గ్రామానికి చెందిన కొందరు పెద్దలు వారి భూములపై కన్నేసి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న కావలి రూరల్ సీఐ పాపారావు అక్కడికి చేరుకుని న్యాయం జరిగేలా చూస్తానని సర్ది చెప్పడంతో వారు ధర్నా విర మించారు. సతీష్, సుధాకర్, నరేంద్ర, దానం మాల్యాద్రి పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న దళితులు, ఎల్లు సాల్మన్‌రాజు

CHANGE OF NAME

I, SHAIK AYESHA (Old Name) Resident of 7-6-6B, Vayunandana Press Street, Kavali Town & Mandal, SPSR Nellore District, AP. Here by declare that I have changed my name as **SHAIK AYESHA BEGAM** (New Name) W/o. SHAIK KHADER BASHA here by declare that both names are one and the same person.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా,

చిట్టాబత్తిన బాలకృష్ణ, S/o. కల్లయ్య, కావలి పట్టణం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వాస్తవ్యులు అను వారితో, నా క్లయింట్ అయిన **శ్రీ కంచర్ల ఆనందరావు, S/o.** రామయ్య ఏకైక కుమార్తె అయిన గాయత్రితో తేది. **17-02-2012** న హిందూ సంప్రదాయం ప్రకారం, ఒంగోలులో ఘనముగా పెళ్లి జరిగింది. ప్రస్తుతం నా క్లయింట్ కుమార్తె USA లోఉంది. తదుపరి నా క్లయింట్ కుమార్తె పైన సదరు చిట్టాబత్తిన బాలకృష్ణ ఒంగోలు ఫ్యామిలీ కోర్టులో **FCOP No.149/2023** గా విడాకుల కొరకు కేసు దాఖలు చేసి **expartee** డిక్రీ పొందగా, సదరు డిక్రీని రద్దు చేయమని పిటిషన్ దాఖలు చేయగా, ప్రస్తుతం పిటిషన్ నిల్వలో ఉంది. కానీ మా క్లయింట్‌కి తెలియకుండా సదరు **చిట్టాబత్తిన బాలకృష్ణ** రెండవ పెళ్లి చేసుకొనుటకు ప్రయత్నాలు చేయుచున్నాడని తెలియవచ్చింది.

కావున ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా, **చిట్టాబత్తిన బాలకృష్ణ, S/o.కల్లయ్య**తో ఎవరు కూడా పెళ్లి సంబంధం పెట్టుకోరాదని, ఒకవేళ ఎవరైనను సంబంధం పెట్టుకొనిన యెడల రద్దు చేసుకోమని, ఒకవేళ అయినను పెళ్లి సంబంధం పెట్టుకోవాలి అనుకొంటే, వారు చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు అర్హులని యావన్మందికి ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము.

ఒంగోలు.
తేది: 16-01-2025

ఇట్లు: సగరికంటి శ్రీనివాసరావు, అడ్వకేట్, ఒంగోలు, సెల్: 9393077780.

అక్రమ లేఅవుట్లపై కొరడా

- హద్దురాళ్లు, రోడ్లు, కాలువల తొలగింపు
- ప్లాట్ల కొనుగోలుదారుల ఆందోళన



ఎక్స్‌కవేటర్‌తో కాలువలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

కావలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమ లేఅవుట్లపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం మద్దూరుపాడు 204, 208 నుంచి 211వరకు ఉన్న సర్వే నంబర్లలో 19.91 ఎకరాల్లో పెనుశిల గ్రీన్‌సిటీ పేరుతో అక్రమ లేఅవుట్ వేసినట్లు మున్సిపల్ అధికారులు గుర్తించి వాటి సరిహద్దు రాళ్లు, కాలువలు, రోడ్లను తొలగించారు. అలాగే ముసునూరు టీచర్స్ కాలనీలోని దిగువన పాపిరెడ్డి చెరువు పక్కన ఉన్న 1919 సర్వే నంబరులో 2.5ఎకరాల అక్రమ లేఅవుట్‌లోని సరిహద్దు రాళ్లు, రోడ్లు తొలగించారు. వీటికి ఎలాంటి అనుమతులు లేవని ఈ విషయాన్ని ప్రజలు ఈ విషయం గమనించాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. రాళ్లు, రోడ్లు తొలగిస్తుండటంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందారు. పట్టణంలో ఉన్న అన్ని అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటారా లేక ఈ రెండు లేఅవుట్లతో సరిపెట్టుకుంటారా అని రియల్‌ఎస్టేట్ రంగంలో చర్చనీయాంశమైంది.

ఓటమితోనే గెలుపును నేర్చుకుంటాం: ఎమ్మెల్యే దగుమాటి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగుమాటి

కావలి, జనవరి 17 (ఆంధ్ర జ్యోతి): క్రీడలలో గెలుపోట ములు సహజమని, గెలిస్తే గర్వపడటం, ఓటమి చెందితే కుంగిపోకుండా ఓటమితోనే ఎలా గెలవాలో నేర్చుకోవాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. కేకేఆర్ యూత్ ఆధ్వర్యంలో కావలిలో నిర్వహించిన మినీ క్రికెట్ టెన్నీ స్‌బాల్ టోర్నీ విజేతలకు గురువారం రాత్రి బహుమతులు అందజేశారు. తొలుత విజేతలైన టీమ్ సభ్యులతో పొలిటికల్ టీమ్ కొంతసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టాన్ని ఇష్టంగా ఉంచుకుంటే దేనినైనా సాధించవచ్చని కష్టపడందే విజయం దక్క దన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్ బాబు, నేతలు గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, ప్రళయకావేరి మల్లికార్జున , టీడీపీ.జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం

కావలి: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా సభ్యత్వ కార్డును పమిడి అందుకున్నారు.

పలుకూరు యువకుడి మృతిపై అనుమానాలు

- తల్లి ఫిర్యాదుతో

మృతదేహానికి రీ పోస్టుమార్టం

కందుకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పలుకూరులో ఈ నెల 7న మృతిచెందిన గుంటూరు ప్రేమ్ కుమార్ అనే యువకుడి మృతిపై ఆయన తల్లి మరియమ్మ అనుమానం వ్యక్తం చేస్తూ ఈ నెల 13న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పదిరోజుల తర్వాత శుక్రవారం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టరు వెంకటేశ్వర్లు నేతృత్వంలో కందుకూరు తహసీల్దారు ఇక్బాల్, సీఐ వెంకటేశ్వరరావులు దగ్గరుండి పోస్టుమార్టం చేయించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి విచారణ పూర్తిచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని తహసీల్దారు ఇక్బాల్, సీఐ వెంక టేశ్వరరావులు తెలిపారు.

అభివృద్ధికి ప్రాధాన్యత

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని కందు కూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం రాత్రి 8గంటల సయమంలో ఎర్రారెడ్డిపాలెం పంచాయతీ ఉట్లవారిపాలెంలో రూ.18.30లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.6.50లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంటును ప్రారంభించారు. అనంతరం టీడీపీ మండలాధ్యక్షుడు వేముల గోపాలరావు ఇతర నాయకులతో కలిసి గ్రామంలోని ఆలయాన్ని సందర్శించి స్వామి వార్లకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీని వాసులు, మాలకొండయ్య, సోంపల్లి మనోహర్, బొల్లినేని నాగేశ్వరరావు, ప్రసాద్, నారాయణ, ప్ర సాద్, బాలకోటయ్య పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేస్తాం: ఎంపీపీ

కలిగిరి, జనవరి17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీపీ మెట్టుకూరు శిరీష తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి అధ్యక్షతన పీహెచ్‌సీ కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. సదుపాయాల కల్పనకు అవసరమైన పనులను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీడీఓ ప్రత్యూష, ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి వేడుకలు

బిట్రగుంట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బోగోలు కుమ్మరవీధిలో నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా యుత్ ఆర్గనేజషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులు నిర్వహించిన ఆటలపోటీలు శుక్రవారంతో ముగిశాయి. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామ పెద్ద బోగిరి యోహాను అధ్యక్షత వహించారు. బహుమతుల ప్రదానోత్సవంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, పార్టీ బోగోలు ఇంచార్జి ముంతాల వెంకయ్య, ఎల్.సుధీర్‌బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బోగిరి ప్రభాకర్, మేకల కిరణ్‌కుమార్, మురళీ, రమేష్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కందుకూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం 2007-09 ఇంటర్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రిన్సిపాల్ నాగూర్‌వలికి రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెవరు వేసుకున్నారు. కార్యక్రమంలో పీడీ తొట్టెంపూడి సుబ్బారావు, అధ్యాపకులు చుండూరి బాబూరావు, కలగట్ల హజరత్తయ్య, కాశీరత్నం, అక్రమ్, మాధవరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిని విజయవంతం చేయాలి

ఉదయగిరి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో శనివారం నిర్వహించే మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతిని జయప్రదం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించే ఎన్టీఆర్ వర్ధంతిని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ చంద్ర మధుసూధన రావు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్యాలయ ప్రాంగణంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుతామన్నారు. కూట మి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల బాధ్యు లు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీడీపీవో బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవోగా టీ శారద శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కావలి ఏసీడీపీవోగా పనిచేస్తున్న ఆమెను ఉదయగిరికి ఇన్‌చార్జి సీడీపీవోగా ఉన్నతాధికారులు నియమించడంతో బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలు సక్రమంగా అందేలా కృషి చేస్తానన్నారు.

వ్యవసాయాధికారుల తనిఖీలు

కందుకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ కె.కన్నయ్య, మండల వ్యవసాయాధికారి వి.రాముతో కలిసి పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. వ్యాపారులంతా ఎంఆర్పీలకే ఎరువులు విక్రయించటంతో పాటు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, ఆయా డీలర్లకు ఎరువులు సరఫరా చేసే లైసెన్సీల ఉత్పత్తుల వివరాలను బహిరంగపరచాలని సూచించారు. యూరియా, డీఏపీ అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులకు వారికున్న భూమి ఆధారంగా బయోమెట్రిక్ విధానంలో మాత్రమే ఎరువులు విక్రయించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బయోమెట్రిక్ నిల్వలు, గోదాముల్లో భౌతికంగా ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

బిట్రగుంట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఇదివరకు జరిగిన వివాదాన్ని మనసులో పెట్టుకుని పాతకక్షలతో ఉద్దేశపూర్వకంగానే తనపై దాడి చేశారని బాధితుడు పల్లిబోయి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఏనుగులబావి పంచాయతీలోని ఒంటేరు తిరుపతి శుక్రవారం దాడి చేశాడన్నారు. రక్తగాయాలైన ఆయన్ను గ్రామస్థులు ఆటోలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వృద్ధాప్యంలో ఉన్న తాము గామంలో ఉండలేకపోతున్నామని బాధితుని భార్య ఆదిశేషమ్మ తెలిపింది.

ఉదయగిరి పట్టణ రూపురేఖలు మారుస్తా : ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభు త్వ డిగ్రీ కళాశాలకు పీఎం ఉష పథకం కింద రూ.5 కోట్లు నిధులు మంజూరు కావడంతో నూతన భవన నిర్మాణాలకు అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాటా ్లడుతూ నియోకవర్గంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎంఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దనున్నామన్నారు. మరో ఏడాదిన్నర కాలంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సిమెంట్‌రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, టీడీపీ నాయకులు గడ్డం శ్రీనివాసులు, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, బొజ్జా శ్రీనివాసులు, ఓబులరెడ్డి, సందానీ, నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈ సుబ్బారావు, ఏఈ శ్రావణకుమార్ పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వాల స్వీకరణ

ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయగిరిలో పలువురు టీడీ పీ నాయకులు శాశ్వత సభ్యత్వాలను స్వీకరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, నాయకులు రెడ్డి బత్తిన నరసింహా రావు, రావులపల్లి వెం కట నరసయ్య ఎమ్మెల్యే చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వాలను స్వీకరించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

● వింజమూరు: మండలంలోని బొమ్మరాజుచెరువు గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ చేతుల మీదుగా బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు రూ.21.35లక్షల విలువ గల 16 చెక్కులను బాధితులకు అందించినట్లు తెలియజేశారు.

పారిశుధ్యం మెరుగుపరచాలని వినతి

కలువాయి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని తోపుగుంట అగ్రహారం గ్రామానికి చెందిన పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు శుక్రవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందచేశారు. సంక్రాంతికి సొంత ఊరికి వచ్చిన పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, యువకులు కలిసి గ్రామంలోని సమస్యలను తెలుసుకుని అధికారులు దృష్టికి తీసుకుపోయారు.

కిశోరి వికాసంపై అవగాహన

ఆత్మకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీడీపీవో కార్యాలయంలో శుక్రవారం ఆత్మకూరు సీడీపీవో సునీలత ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, సీఐ జి గంగాధర్, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తదితరులు మాట్లాడుతూ వ్యక్తిగత పరి శుభ్రత, లైంగిక దాడి, అక్రమ రవాణ, బాల్య వివాహాలు తదితర తొమ్మిది అంశాలపై అవగాహన కల్పించారు. కిశోరి వికాశం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అస్మా, డాక్టర్ అనూష, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

సీతారామపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బెస్త కాలనీలో సంక్రాంతి సందర్భంగా టీడీపీ మండల నాయకుడు తోట మనోజ్‌బాబు, బిజెపి నాయకుడు ముడమల రమేష్‌ల సహకారంతో క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు శుక్రవారం బహుమతులు అందచేశారు. బిజెపి నేత బాల చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ఐక్యతకు దోహదపడతాయని డాక్టర్ బిఎస్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలు శుక్రవారం ముగిసాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు, సీఐటీయు జిల్లా నాయుకులు జి శివప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ షేక్ సందాని, రెడ్‌క్రాస్ ఛైర్మన్ సాధిక్‌హుస్సేన్, డీవైఎఫ్ఐ నాయకులు నందా శ్రీను, అళ్ల హజరత్తయ్య, రిచర్డ్, మహేష్, వాగాల శ్రీహరి, యుటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, కె నరేష్ పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత కరటంపాడు జట్టు

మండలంలోని కరటంపాడు పంచాయతీ పరిధిలోని సాతానుపల్లిలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు కరటంపాడు, వాశిలి జట్లు మధ్య పోటీ హోరాహోరిగా జరిగింది. కరటంపాడు జట్టు విజేతగా నిలిచింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, సర్పంచ్ పూనుగుంట రేవతి, ఉత్తరకాలువ వైస్‌ఛైర్మన్ పూనుగుంట ధనుంజయ, న్యాయవాది నందా ఓబులేశు, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతగా నిలిచిన కరటంపాడు జట్టుకు ట్రోఫీని, రూ. 50 వేలు నగదు బహుమతిని అందజేసి అభినందించారు. విన్నర్‌గా నిలిచిన వాశిలి జట్టుకు రూ. 25 వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఎల్ నిర్వాహకులు పూనుగుంట సునీల్, టిడిపి మైనార్టీ నాయకులు షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.